

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

FIRST TELUGU MULTIMEDIA E-PAPER


**Voice of the leader**

ఓటర్ల వ్యక్తిగత డేటా వాలంటీర్లకు ఎందుకు? ఓటర్ల వ్యక్తిగత డేటాను ప్రైవేటు సంస్థలకు ఇస్తున్నారు. ఏపీలో జరుగుతున్న ఓట్ల అక్రమాలు దేశంలో ఎక్కడా లేవు. ఎన్నికల కమిషన్ అధికారులు ఏపీకి వచ్చి ఓట్ల అక్రమాలు పరిశీలించాలి. పూర్తిస్థాయి కమిటీ వేసి ఏపీలో ఓట్ల అక్రమాలపై దర్యాప్తు చేయాలి. ఎన్నికలకు ముందే అన్నీ సరిచేయాలని ఈసీని కోరుతున్నాం. మేం ఇచ్చిన వివరాలు వాస్తవమా? వైసీపీ ఇచ్చినవి వాస్తవమా? అని తేలాలి.

– నారా చంద్రబాబునాయుడు

**యువగళం జైత్రయాత్ర**

ఇప్పటి వరకు నడిచిన దూరం: **2646.7 కి.మీ.**

28-8-2023 నడిచిన దూరం: **22.7 కి.మీ.**

### తెలుగు జాతి 'అన్న ఎన్టీఆర్' ఖ్యాతికి గుర్తింపుగా...

# 100 రూపాయల నాణెం విడుదల



5






### రాష్ట్రంలో సామాన్యుడి ఓటు హక్కుని కాపాడండి

# ప్రజాస్వామ్యాన్ని రక్షించండి

- ఓటర్ జాబితా సవరణలో అక్రమాల చిట్టా విప్పిన చంద్రబాబు
- వెంటనే జోక్యం చేసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి
- ఎన్నికల పవిత్రతను కాపాడటానికి 8 సూచనలు
- జగన్ ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని ఎండగట్టిన తెదేపా అధినేత
- పంచాయతీ ఎన్నికల నుండి ఇటీవలి వరకు జరిగిన అక్రమాల ఏకరవు
- రానున్న ఎన్నికలు సాఫీగా జరగవేమోనని ప్రజల అనుమానం

4

### పామాయిల్ రైతులకు

# ఉచితంగా మొక్కలు!

- పామాయిల్ బోర్డు, ప్రత్యేక నిధి ఏర్పాటుకు కృషి
- పామాయిల్ ఫ్యాక్టరీ, నర్సరీల ఏర్పాటుకు చర్యలు
- ముఖాముఖి సమావేశంలో లోకేష్

7





# దేశానికి స్వర్ణపతకం తెచ్చిన బల్లెం వీరుడు

### నీరజ్ చోప్రా ప్రపంచ ఛాంపియన్

2

- 88.17 మీటర్ల జావెలిన్ త్రో తో బంగారు పతకం
- ఒలింపిక్, ప్రపంచ ఛాంపియన్ షిప్ రెండూ చోప్రావే


లోపలి పేజీల్లో..

ఓటరు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయండి: చంద్రబాబు 2

విద్యాదీవెన లోనూ జగన్‌రెడ్డి దగా : అశోక్‌బాబు 10

భూమనా... నీ మతమేంటి: బుచ్చి రాంప్రసాద్ 10

మొదలైన ఇసుక సత్యాగ్రహం 11

స్కూళ్లలో మొబైల్స్‌పై నిషేధం 13

ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా

## తాడికొండలో ఓటర్ల జాబితా తయారీ

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి అచ్చెన్నాయుడు లేఖ**

అమరావతి: తాడికొండ నియోజకవర్గంలో ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా ఓటర్ల జాబితా తయారు చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ మీనాకు లేఖ రాశారు. ఒక వార్డులో ఉన్న వాళ్ళను ఒక బూత్‌కు కాకుండా 8 వేరువేరు బూత్‌లకు కేటాయించారన్నారు. ఒక కుటుంబం సభ్యులను నాలుగు బూత్‌లలో చూపారని.. 150 మంది మృతుల ఓట్లను కూడా తొలగించలేదని వెల్లడించారు. 0 ఇంటి నెంబర్‌తో 53 ఓట్లు ఉన్నాయన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు కోరారు.

టీడీపీ ఎంపవర్మెంట్ సెంటర్ ద్వారా

## మరో ఐదుగురికి ఉద్యోగాలు



అమరావతి: ఎన్ఆర్ఐ టీడీపీ ఆధ్వర్యంలోని ఎంపవర్మెంట్ సెంటర్ ద్వారా మరో ఐదుగురికి ఉద్యోగాలు లభించాయి. టీడీపీ ఎంపవర్మెంట్ సెంటర్‌లో ఐటీ రిక్రూటింగ్‌లో శిక్షణ పొందిన ఎన్ మాధవి, వీ ఉషారాణి, జీ బాలయోగి, వీ రత్నకుమార్, కె చెన్నకేశవులు హైదరాబాద్‌లోని బెనెడ్ సాఫ్ట్ సొల్యూషన్స్‌లో ఉద్యోగాలు పొందారు.

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు సోమవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో వీరికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగాలు పొందిన వారిని అభినందించారు. ఎన్ఆర్ఐ టీడీపీ చీఫ్ డాక్టర్ వేమూరు రవికుమార్, టీడీపీ బ్రాహ్మణ సాధికార సంస్థ కో ఆర్డినేటర్ డాక్టర్ బుచ్చి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు, అంగళ్లు ఘటనల్లో

## టీడీపీ నేతలకు ఊరట

**ముందస్తు బెయిల్ మంజూరు చేసిన హై కోర్టు**

**చల్లా బాబుకు నాలుగు కేసుల్లో బెయిల్, మూడింట్లో తిరస్కరణ**

అమరావతి: చిత్తూరు జిల్లా పుంగనూరు, అన్నమయ్య జిల్లా అంగళ్లు ఘటనల్లో టీడీపీ నేతలకు హైకోర్టులో ఊరట లభించింది. మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, పార్టీ నేతలు నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి, పులివర్తి నానిలకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే పుంగనూరు టీడీపీ ఇన్‌ఛార్జి చల్లా బాబుపై నమోదైన 7 కేసుల్లో నాలుగింటిలో ముందస్తు బెయిల్ రాగా.. మరో మూడు కేసుల్లో బెయిల్‌ను హైకోర్టు తిరస్కరించింది. ముందస్తు బెయిల్ మంజూరు చేసిన ముగ్గురు కూడా నాలుగు వారాల పాటు అన్నమయ జిల్లాకు వెళ్లకూడదని ఆదేశాలు జారీ చేసింది. ప్రతి ఆదివారం కర్నూల్ 3 టౌన్ పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని షరతులు విధించింది. ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి పర్యటన సందర్భంగా అంగళ్లు, పుంగనూరుల్లో ఘర్షణలు జరిగాయి. ఈ ఘటనలకు సంబంధించి టీడీపీ నాయకులపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ కోసం దేవినేని ఉమా మహేశ్వర రావు, నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి, పులివర్తి నాని, చల్లా బాబు హైకోర్టును ఆశ్రయించారు. దురుద్దేశపూర్వకంగా ఈ కేసులు నమోదు చేశారని వారి తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే చల్లా బాబుపై మొత్తం ఏడు కేసులు నమోదు కాగా, నాలుగంటిలో హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. మిగిలిన మూడు కేసుల్లో బెయిల్ పిటిషన్లను కొట్టేసింది. మరోవైపు పుంగనూరు, అంగాళ్లు సంఘటనల్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై కూడా కేసులు నమోదు అయిన విషయం తెలిసిందే. తాను ముందస్తు బెయిల్‌కు దాఖలు చేసేది లేదని టీడీపీ అధినేత తేల్చిచెప్పేశారు. తనకి సంబంధం లేకపోయినా తనపై కేసులు నమోదు చేశారని బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై దాడిచేసి తనపైనే కేసులు నమోదు చేశారని చంద్రబాబు, టీడీపీ నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# ఆధార్-ఓటరు కార్డుల అనుసంధానం

## తద్వారా నకిలీ ఓట్లను నిరోధించవచ్చన్న చంద్రబాబు

- **మేము ఇచ్చిన ఫిర్యాదు వాస్తవమా.. వైసీపీ వాళ్లు చెప్పేది వాస్తవమా తేల్చాలి**
- **బోగస్ ఓట్లపై కేంద్ర ఎన్నికల సంఘం విచారణ జరిపించాలి**



న్యూఢిల్లీ: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు కేంద్ర ఎన్నికల సంఘానికి సరికొత్త ప్రతిపాదన పెట్టారు. ఆధార్ కార్డును ఓటర్ కార్డును అనుసంధానించాలని ఆయన ఈసీని కోరారు. ఏపీలో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ చంద్రబాబు నాయుడు సోమవారం ఢిల్లీ వెళ్లి ఈసీకి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆధార్ కార్డును ఓటర్ కార్డును అనుసంధానించాలని ఆయన ఈసీకి ప్రతిపాదించారు. వచ్చే ఎన్నికల్లో ఆధార్ కార్డును ఓటర్ కార్డును అనుసంధానిస్తే తాను సంతోషిస్తానని తరువాత మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు అన్నారు. తద్వారా పారదర్శకంగా ఎన్నికలు జరుగుతాయని, నకిలీ ఓట్లను నిరోధించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో ఎన్నికల వ్యవస్థకు సాంకేతికతను వినియోగించుకోవాలని చంద్రబాబు అన్నారు. ఏపీలో ఒక విచిత్రమైన పరిస్థితి నెలకొని ఉందని, కేవలం ఒక పార్టీకి చెందిన ఓట్లను తొలగించే ఆలోచన రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకు ఎవరికీ రాలేదని అన్నారు. ఓటర్ల తొలగింపుపై సాక్ష్యాధారాలతో సహా ఇప్పటికే చాలాసార్లు పోరాడామని తెలిపారు.

అలాగే వాలంటీర్లతో వైసీపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని చంద్రబాబు ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ఢిల్లీ వచ్చానని చెప్పారు. ఒక పార్టీ ఓట్లను తొలగించాలన్న ఆలోచన, ఇంతవరకు ఏ పార్టీకి రాలేదన్నారు. వైసీపీ చాలా దారుణాలు చేసిందని, వాటన్నింటిని సాక్ష్యాధారాలతో ఈసీకి సమర్పించామని ఆయన తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగైదు ఎన్నికలు జరిగాయన్నారు. నకిలీ ఓటరు కార్డులు ముద్రిస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరినా పట్టించుకోలేదు. ఓట్ల తొలగింపుపై కోర్టుకు కూడా వెళ్లాం. స్థానిక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నకిలీ ధృవపత్రాలతో ఓట్లు నమోదు చేశారు. రాష్ట్రంలో జరిగిన అన్ని ఎన్నికల్లోనూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. మా హయాంలో ఎప్పుడూ ఇలాంటి చెత్త పనులు చేయలేదు. ఓట్ల అక్రమాలపై ప్రశ్నించే వారిని కేసులతో వేధిస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా కేసులు పెడుతున్నారని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో ప్రజాస్వామాన్ని కాపాడుకోవటానికి ఢిల్లీ వచ్చా. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలను ఈసీ కి వివరించా. ఆధారాలతో సహా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం. మేము ఇచ్చిన ఫిర్యాదు వాస్తవమా.. వైసీపీ వాళ్లు చెప్పేది వాస్తవమా.. ఎన్నికల సంఘమే తేల్చాలి. ఓటర్ల వ్యక్తిగత వివరాలు వాలంటీర్లకు ఎందుకు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని ప్రైవేటు సంస్థలకు ఇస్తున్నారు. దాని ఆధారంగా ఓట్లు తొలగిస్తున్నారు. ఏపీలో జరుగుతున్న ఓట్ల అక్రమాలు దేశంలో మరెక్కడా లేవు. కేంద్ర ఎన్నికల సంఘానికి చెందిన అధికారులతో కూడిన పూర్తిస్థాయి బృందం ఏపీలో పర్యటించాలని ఆయన కోరారు. ఏపీలో హైలెవల్ కమిటీ ఏర్పాటు చేసి బోగస్ ఓట్లపై విచారణ జరిపించాలని కోరారు. ఎన్నికల ముందే అన్నీ సరిచేయాలని చంద్రబాబు నాయుడు కోరారు. తనపై దాడిచేసి తనపైనే హత్యాయత్నం కేసు పెట్టారని తెలిపారు. టీడీపీ ఓట్లను భారీ ఎత్తున తొలగించారన్న చంద్రబాబు.. ఓటర్ల జాబితాలో వైసీపీ అవకతవకలకు పాల్పడిందని ఆరోపించారు. సీఈసీతో పాటు ఇద్దరు ఎలక్షన్ కమిషనర్లను, ఇతర రాష్ట్రాల ఐఏఎస్ లను ఏపీలో పర్యటించాలని కోరామని వెల్లడించారు. రాష్ట్రంలో ఓట్ల అవకతవకలపై ఉన్నతస్థాయి కమిటీ నియమించాలని విజ్ఞప్తి చేశామని వివరించారు. నిబంధనలను ఉల్లంఘించే పార్టీలను రద్దు చేసే అధికారం ఈసీకి ఉందని చంద్రబాబు తెలిపారు.

# దేశానికి స్వర్ణపతకం తెచ్చిన బల్లెం వీరుడు

## నీరజ్ చోప్రా ప్రపంచ ఛాంపియన్

ప్రపంచ క్రీడల్లో భారత బంగారు కల నీరజ్ చోప్రా మరోసారి దేశం గర్వంతో తలెత్తుకునేలా చేశాడు. హంగేరి రాజధాని బుడాపెస్ట్ లో జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆదివారం రాత్రి జావెలిన్ త్రో (పొడవాటి ఈటె విసరడం) లో బంగారు పతకాన్ని సాధించాడు. చోప్రా ఈటెను 88.17 మీటర్లు విసిరాడు. దీంతో 47 ఏళ్ల ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల చరిత్రలో బంగారుపతకం సాధించిన మొదటి భారతీయునిగా కీర్తి సాధించాడు. ఈ పోటీలు 1976 లో ప్రారంభమయ్యాయి.

ఈటెను 5 సార్లు విసిరే అవకాశముండగా... మొదటి ప్రయత్నంలో చోప్రా 79 మీటర్ల దూరం మాత్రమే విసిరాడు. తన మొదటి ప్రయత్నం నిరాశాజనకంగా ఉండటంతో కావాలని ఫౌల్ చేసి, ఈ దూరాన్ని రిజిస్టర్ కాకుండా చేశాడు చోప్రా. తన రెండో ప్రయత్నంలో అద్భుతంగా ఈటెను 88.17 మీటర్ల దూరానికి విసిరాడు. తన విసురుడుపై నమ్మకంతో ఈటె నేలమీద దిగకముందే సంబరాలు చేసుకున్నాడు 25 ఏళ్ల చోప్రా. వెంటవెంటనే జరిగే ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్ షిప్ గెలుచుకున్న మూడో క్రీడాకారుడిగా నీరజ్ చోప్రా ఖ్యాతి నార్జించాడు.

పాకిస్తాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ 87.82 మీటర్ల దూరం విసిరి రజత పతకం గెలుచుకున్నాడు. జర్మనీకి చెందిన జులియన్ వెబర్ 85.79మీటర్ల దూరంతో కాంస్య పతకం గెలుపొందాడు. మన క్రీడాకారులు కిశోర్ జెనా 84.77 మీటర్ల దూరంతో 5వ స్థానాన్ని,డీ.పీ.మను 83.72 మీటర్ల దూరంతో 6వస్థానాన్ని పొందారు.

**చోప్రా ఘనకీర్తి**

దేశవాళీ పోటీల్లో జావెలిన్ త్రోలో తన సామర్థ్యాన్ని నిరూపిస్తూ క్రీడాభిమానుల దృష్టిని ఆకర్షించాడు నీరజ్ చోప్రా. ప్రపంచస్థాయి క్రీడాకారుడు కాగలడని, ఒలింపిక్స్ పతకం సాధించగల సత్తా ఉన్నవాడని ఆశలు రేకిత్తించాడు. దీనికి అనుగుణంగా 2020 ఒలింపిక్ పోటీల్లో ఈటెను 87.58 మీటర్ల దూరం విసిరి, భారత్ కు బంగారు పతకాన్ని సాధించాడు. ఒలింపిక్ పోటీల్లో షూటర్ అభినవ్ బింద్రా తర్వాత స్వర్ణపతకం సాధించిన రెండో క్రీడాకారుడిగా కీర్తి పొందాడు. 2022 లో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ పోటీల్లో నీరజ్ చోప్రా రజత పతకం సాధించాడు.

బుడాపెస్ట్ లో జావెలిన్ త్రో ఫైనల్ పోటీ ప్రారంభంకాకముందు ఈటెను 90మీటర్ల దూరం విసరడానికి సంబంధించి విలేకరుల ప్రశ్నలకు చోప్రా సమాధానమిస్తూ ఇలా అన్నాడు : "అంత దూరం విసరగలనని నమ్మకంతో ఉన్నాను. వాతావరణం అనుకూలంగా ఉండి ఒక మంచి త్రో వేస్తే ఆ లక్ష్యాన్ని చేరుకోగలను."

ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో 2003లో లాంగ్ జంప్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకొని అంజు బాబీ జార్జ్ ఈ పోటీల్లో పతకం గెలిచిన మొదటి క్రీడాకారిణిగా ఖ్యాతి పొందింది. 20 ఏళ్ల తర్వాత స్వర్ణపతకాన్ని సాధించి భారతీయులను గర్వింపచేశాడు నీరజ్ చోప్రా.




**తృటిలో తప్పిన మరో పతకం**

బుడాపెస్ట్ పోటీల్లో స్వల్పసమయం తేడాతో భారత్ పతకాన్ని కోల్పోయింది. పురుషుల 4x400 రిలే పరుగులో భారత జట్టు 5వ స్థానాన్ని సాధించింది. ఈ పోటీలో 2.58.71 నిమిషాల వ్యవధితో బ్రిటన్ కాంస్య పతకం పొందగా భారత జట్టు 2.59.92 నిమిషాల సమయంలో పరుగును పూర్తి చేసి, కొత్త ఏషియన్ రికార్డుని నెలకొల్పింది. ఈ పరుగులో ఇప్పటి వరకు ఉన్న ఏషియన్ రికార్డు 3.00.25 నిమిషాలు 2020 ఒలింపిక్స్‌లో రికార్డయింది.

## రాష్ట్రంలో సామాన్యుడి ఓటు హక్కుని కాపాడండి

# ప్రజాస్వామ్యాన్ని రక్షించండి



2020-21లో జరిగిన పంచాయతీ ఎన్నికలు మొదలుకొని ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల వరకు జగన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన అరాచకాలు... ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలను కేంద్ర ఎన్నికల సంఘానికి పూసగుచ్చినట్టు వివరించి, వెంటనే రాష్ట్రంలో ప్రజలరాజ్యాంగ బద్ధమైన ఓటు హక్కుని కాపాడటానికి జోక్యం చేసుకోవాలని తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు కోరారు. సోమ వారం నాడు కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య కమిష నర్ని కలుసుకొని రాష్ట్రంలో జరుగుతున్న అప్రజా స్వామిక కాండపై తన ఆందోళన తెలియచేసి వివరాల తో కూడిన 11 పేజీల సుదీర్ఘ లేఖను అందచేశారు.

రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను దిగ్బంధం చేసి రాజ్యాంగ సూత్రాలకు పాతర వేసి ఎన్నికల పవిత్రతను విధ్వంసం చేస్తున్న తీరుని వివరించి, ఓటుహక్కు పవిత్రతను పరిరక్షించడానికి,రానున్న ఎన్నికలు స్వేచ్ఛా యుత వాతావరణంలో ధర్మబద్ధంగా జరి పేందుకు కింది విషయాలపై దృష్టి సారించాలని చంద్రబాబు ఎన్నికల సంఘాన్ని కోరారు:

1. అర్హుడైన ప్రతి పౌరుడు ఓటర్ లిస్టులో నమోదయ్యేలా, దొంగ ఓట్లు,మృతి చెందిన వారి పేర్లను తొలగించేలా చూడాలి. గత రెండు సవరణలలో తొలగించ బడిన ఓటర్లను నియమాలను పాటించి, ఫారమ్-6 ద్వారా తిరిగి నమోదు చేసి,గంపగుత్తగావచ్చిన ఫామ్-7 దర ఖాస్తుల్ని నిశితంగా పరిశీలించి అనర్హు లైన ఓటర్లను తొలగించాలి.
2. ఎన్నికల సంఘం నియమావళిని ఉల్లం ఘించి ఎన్నికల ప్రక్రియలో పాల్గొం టున్న వాలంటీర్లను దానికి దూరంగా ఉంచాలి.
3. బలవంతంగా వాలంటీర్ల చేత అధార్ నంబర్లతో సహా ఓటర్ల వ్యక్తిగత సమా చారాన్ని సేకరించి దానిని ప్రైవేట్ సంస్థలకు అప్పగించడంపై విచారణకు అదేశించాలి.
4. దీర్ఘకాలంగా కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలనలో ఉన్నవినతిపత్రాలపై విచా రణ జరిపించి నిర్దిష్ట కాల పరిమితిలో చర్యలు చేపట్టాలి.
5. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, ఈఆర్వో లకు తెలుగుదేశంపార్టీ బూత్‌ల వారీ గా అందించిన 10.32లక్షల చని పోయిన వారి,నకిలీ ఓటర్ల నమోదుకు సంబంధించిన వివరాలను సమీక్షించాలి.
6. కేంద్ర ఎన్నికల సంఘం నియమా వళిలో పొందుపరిచిన విధంగా ఉపా ధ్యాయులను, ఇతర ప్రభుత్వ సిబ్బం దిని ఎన్నికల విధుల్లో నియమించే దిశగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలి. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అను భవ రాహిత్యులైన గ్రామ సచివాలయ సిబ్బందికి క్లిష్టమైన ఎన్నికల ప్రక్రియ లో ఒత్తిడిని తట్టుకునే శక్తి ఉండదు కనుక, ఆ విధులకు ఎంతో అనుభవం కలిగిఉండే ఉపాధ్యాయులను, ఇతర విభాగాల సిబ్బందికి మాత్రమే ఎన్ని కల విధులను అప్పగించాలి.
7. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ తీవ్ర దిగ్బంధనానికి గురవుతున్న పరిస్థితు ల్లో కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలో పర్యటించి పరిస్థితిని అంచనావేయాలి.
8. రాష్ట్రంలో పరిస్థితిపై నిఘాపెట్టి, ఎప్ప టికప్పుడు అంచనా వేస్తూ, తగు నివా రణ చర్యలు చేపట్టేందుకు కేంద్ర ఎన్ని కల సంఘం అధీనంలో సాంకేతిక అనుభవం కలిగిన నిపుణులతో కూడి న ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించాలి.

స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ప్రజాస్వామ్య ఎన్నికల పవిత్రతను కాపాడుతూ ప్రపంచ స్థాయిలో అతి పెద్ద ప్రజాస్వామ్యమైన భార తదేశ కీర్తిని ఇనుమడింప చేస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలో నెలకొన్న కా లుష్య వాతావరణ నేపథ్యంలో తగుచర్యలు తీసుకోవాలని చేపట్టాలని కోరుతున్నామని... ఆ మేరకు తగు విధంగా స్పందిస్తారని ఆశిస్తున్నామని చంద్రబాబు తమ లేఖలో పేర్కొన్నారు.

### రాష్ట్రంలో అపహాస్యమవుతున్న ప్రజాస్వామ్యం

ఎన్నికల ప్రక్రియలో వాలంటీర్ల అనధికారిక పాత్ర, బీఎల్వోలుగా కొత్తగా నియమించబడిన అనుభవం లేని సిబ్బంది, స్వంతంత్రంగా వ్యవహరించలేని ఈఆర్వోలు, అధికారపార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్లతో కూడిన రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణమని వివరిస్తూ ఓటర్ల అక్రమ నమోదుకు సంబంధించిన కొన్ని వివరాలను చంద్రబాబు తెలిపారు:

1. విశాఖపట్నం తూర్పు నియోజకవర్గంలో పద్ధతులను ఉల్లంఘించి 40 వేల ఓట్ల తొలగింపు.
2. పరుచూరు నియోజకవర్గంలో 10 వేల ఫామ్-7 దరఖాస్తులను గంపగుత్తగా దాఖలు చేయడం
3. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం లో 23 వేల ఓట్ల తొలగింపు
4. చంద్రగిరి నియోజకవర్గంలో ఇళ్లకు వెళ్లకుండానే సర్వే పూర్తిచేసిన బీఎల్వోలు
5. తాడికొండ నియోజకవర్గంలో ఒకే కుటుంబంలోని ఓటర్లను వివిధ బూత్ లకు కేటాయించడం
6. ఉరవకొండ నియోజకవర్గంలో కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు వ్యతి రేకంగా 6 వేల ఓట్ల తొలగింపు
7. కాకినాడ నియోజకవర్గంలో ఏజెంట్లకు డబ్బులిచ్చి అర్హులైన ఓటర్ల తొలగింపు కు ఫామ్-7 దరఖాస్తులు చేయించడం

వీటితో పాటు అక్రమాలపైచేసిన ఫిర్యా దులకు సంబంధిత అధికారులు సకాలం లో స్పందించడం లేదని చంద్రబాబు తెలి పారు. ఉదాహరణగా చిత్తూరు జిల్లా ఎన్ని కల అధికారి అఖిలపక్ష సమావేశం నిర్వ హించకుండా కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పా టుపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, కేంద్ర ఎన్నికల సంఘం అడిగిన ప్రశ్నలకు రెండు సంవత్సరాలుగా జవాబు ఇవ్వకపోవడాన్ని ప్రస్తావించారు. ఇట్టి దారుణ పరిస్థితుల్లో రాష్ట్రంలో జరిగే రానున్న ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడం కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రధానమైన సవాల్ అని అయన వ్యాఖ్యానించారు.

### సమాంతర వ్యవస్థల ఏర్పాటు - దుర్వినియోగం

రాజ్యాంగ నియమాలకు వ్యతిరేకంగా రాష్ట్రప్రభుత్వం పంచాయతీలు మరియు మున్సిపాలిటీలకు సమాంతరంగా గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి అందులోని సిబ్బందిని గృహసారథులు మరియు సచివాలయ కన్వీనర్లుగా వ్యవహరిం చే వైసీపీ నేతల పర్యవేక్షణలో దుర్వినియోగం చేస్తున్నారని చంద్రబాబు వివరించారు. ఈ విధంగా నియమించ బడిన లక్షా 45 వేల అనుభవం లేని సిబ్బందిని బూత్ లెవల్ అధికారులుగా కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల విధుల్లో వాడుతున్నా రని తెలిపారు.

ప్రత్యేక గెజిట్ ద్వారా ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి తొలగించి అనుభవం లేని ఈ సిబ్బందితో జరిపేవి ఎన్నికలు కావని.. అవి ఎంపికలు మాత్రమే అవుతాయని దీని పర్యవసానాలు ప్రజాస్వామ్యంపై తీవ్రంగా ఉంటాయని చంద్రబాబు వివరించారు.

### వ్యవస్థల విధ్వంసం

పలు వ్యవస్థలను బెదిరించి వాటిని రాజకీయ ప్రయోజనాలకోసం రాష్ట్ర ప్రభుత్వం దురుపయోగం చేస్తోందని చంద్రబాబు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిళ్లమేరకు పోలీస్ ఉన్నతాధికారుల అదేశాల మేరకు జరుగుతున్న పలు అక్రమ కేసుల నమోదును ఉదహరించారు. రాష్ట్ర ప్రభుత్వ దుష్పరిపాలనను విమర్శించే పలు మీడియా సంస్థలపై దారుణమైన కేసుల్ని నమోదు చేస్తున్నారని తెలుపుతూ, టీవీ-5, ఏబీఎన్ ఛానళ్లపై దేశ విద్రోహ చర్యల నమోదు, ఏబీఎన్ అంధ్రజ్యోతి, టీవీ-5 ఛానళ్ల ప్రసారాలను అడ్డుకోవడాన్ని ఉదహరించారు. రాజకీయ పార్టీల కార్యకలాపాలను అడ్డు కోవడానికి జీవో -1 జారీ, తమ గళాన్ని విప్పే ఎన్జీవో నాయకులను జైలుకు పంపడం కూడా ఇందులో భాగమని తెలిపారు.

గతంలో రాష్ట్ర ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ని, తిరుమల లో అన్యమత ప్రచారాన్ని ప్రశ్నించిన ప్రధాన కార్యదర్శిని ఇబ్బందులకు గురిచేసిన వైనాన్ని కూడా చంద్రబాబు తమ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర హైకోర్టు జడ్జీలపై సోషల్ మీడియాలో చేసిన దుష్ప్రచారం కేసులో ఇంతవరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదని కూడా తెలిపారు.

### అప్రజాస్వామిక నేపథ్యం

2020-21లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలతో మొదలుపెట్టి ఎమ్మెల్సీ ఎన్నికల వరకు అధికార దుర్వినియోగంతో ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను బెదిరించడంతో పాటు పలు ఇతర అక్రమమార్గాల్లో 80 శాతం అభ్యర్థుల ఎన్నికను ఏకగ్రీవంగా జరిగేట్లు చేసి రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి నమ్మకద్రోహం చేసే స్థితికి దిగజారిందని తమ లేఖలో చంద్రబాబు అవేదన వ్యక్తం చేశారు. ఈ ఏకగ్రీవ ఎన్నికల ప్రహసనాన్ని అడ్డుకున్న నాటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ని రాష్ట్ర ప్రభుత్వం నానా ఇబ్బందులు పెట్టిందని, రాష్ట్ర మంత్రులు ఆయనపట్ల దుర్భాషలాడారని చంద్రబాబు కేంద్ర ఎన్నికల సంఘానికి తెలిపారు. ఆయనకు, అయన కుటుంబానికి పలు బెదిరింపులు వచ్చిన నేపథ్యంలో ఆయన కేంద్ర గృహమంత్రిత్వ శాఖ కార్యదర్శికి తన పరిస్థితిని వివరించారని చంద్రబా బు తెలియచేశారు.

తిరుపతి లోక్ సభ ఉపఎన్నిక,పట్టభద్రులు,టీచర్ల, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు, రాష్ట్రంలో ప్రస్తు తం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణకు సంబం ధించి పలు అక్రమాలను తాను కేంద్ర ఎన్నికల సం ఘం దృష్టికి తీసుకెళ్లానని, వాటిలో కొన్నింటికి సం బంధించి విచారణకు ఆదేశించడం జరిగిందని, పలు కేసులకు సంబంధించి తీవ్ర జాప్యం జరుగుతోం దని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల యంత్రాం గం, జిల్లా ఎన్నికల అధికారులపై రాష్ట్రప్రభుత్వం తెస్తున్న తీవ్ర ఒత్తిడే దీనికి కారణమని ఆయన అన్నారు.

ఈ విధంగా రాష్ట్రంలోని ఎన్నికల యంత్రాంగం తీవ్ర దిగ్బంధనంలో ఉందని, ఎన్నికలతో కూడిన ప్రజాస్వామ్య ప్రక్రియ పవిత్రతను కాపాడేందుకు కేంద్ర ఎన్నికల సంఘం తక్షణమే జోక్యం చేసుకోవాలని చంద్రబాబు కోరారు.

### ఓటర్ జాబితాల సవరణ - దారుణ పరిస్థితులు

రాష్ట్రంలో అధికార పార్టీయే బహిరం గంగా తమ వారేనని చెప్పుకునే 2.60 లక్షల మందిని నెలకు రూ.5వేల గౌరవ వేతనంతో వాలంటీర్లుగా నియమించు కొని, వారిపై పలు రకాల ఒత్తిళ్లు తెచ్చి వారిని స్వీయరాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ ఓటర్ల సవరణ ప్రక్రియలో కూడా వినియోగించుకుంటూ దారుణాలకు పాల్పడుతోందని చంద్ర బాబు వివరించారు.తమ ఆదేశాలను పాటించని పలువురిని తొలగిస్తూ వాలంటీర్లను రాష్ట్రప్రభుత్వం బ్లాక్ మెయిల్ చేస్తోందని తెలిపారు. ఈ వాలంటీర్ల ద్వారా బలవంతంగా ఓటర్ల వ్యక్తిగత సమాచారాన్ని, ఆధార్ కార్డు వివరాలను సేకరించి వాటిని ప్రైవేట్ సంస్థలకు రాజకీయ ప్రయోజనాల కోసం అందచేస్తున్నారని చంద్రబాబు వివరించారు.

ఇళ్ల వారీగా చేయవలసిన ఓటర్ల సర్వే గడువు దాటినా ఇంకా పూర్తి కాలే దని, పలు నియోజకవర్గాలకు సంబం ధించి నిర్ణీత గడువు ప్రకారం సర్వే వివ రాలను రాజకీయ పార్టీలకు అందించ డంలేదని చంద్రబాబు పేర్కొన్నారు. నంబర్లు లేని ఇళ్లలోనూ, పలుచోట్ల ఒకే ఇంటిలో వందలాది ఓటర్ల నమోదుకు సంబంధించి మీడియా తరచుగా బహిర్గతం చేస్తోందని తెలిపారు.

---

## తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికకు ఏడుగురు సభ్యులతో టీడీపీ కమిటీ

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను తెలుగుదేశం పార్టీ ప్రారంభించింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కోసం ప్రత్యేకంగా 7 గురు సభ్యులతో ఒక కమిటీని పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, కంభంపాటి రామమోహన్‌రావు, అరవింద్ కుమార్ గౌడ్, బక్కని నర్సింహులు, పార్టీ సీనియర్ నేతలు నర్సిరెడ్డి, కాశీనాథ్‌లతో కమిటీ ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపే వారి నుండి దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన తరువాత ఈ కమిటీ చంద్రబాబుకి నివేదిక ఇస్తుంది. దాని ఆధారంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక జరగనుంది.

చైతన్యరథం



## తెలుగు జాతి 'అన్న ఎన్టీఆర్' ఖ్యాతికి గుర్తింపుగా...

# 100 రూపాయల నాణెం విడుదల

## సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ చెరగని ముద్ర వేశారన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము





స్మారక నాణెం విడుదల సందర్భంగా ఎన్టీఆర్ మునిమనవడు నారా దేవాన్ష్‌కు చాక్లెట్ ఇచ్చి ముద్దు చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, బాలయ్యను ఆప్యాయంగా పలకరిస్తున్న రాష్ట్రపతి

న్యూఢిల్లీ: భారతీయ సినిమా చరిత్రలో నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) ఎంతో ప్రత్యేకమని... రాజకీయాల్లోనూ అయన తన ప్రత్యేకతను చాటుకున్నారని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము అన్నారు. దివంగత ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు శతజయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ముద్రించిన రూ.100 స్మారక నాణేన్ని రాష్ట్రపతి విడుదల చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని సాంస్కృతిక కేంద్రంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ కృష్ణుడు, రాముడు వంటి పాత్రల్లో ఎన్టీఆర్ నటన అద్భుతమని కొనియాడారు. భారత చలనచిత్ర రంగం పురోగతిలో ఎన్టీఆర్ పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. కృష్ణుడు, రాముడు వంటి పాత్రలతో ఆయన ప్రజల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. దేవుళ్ల రూపాలను ప్రజలు ఎన్టీఆర్‌లో చూసుకున్నారని అన్నారు. రాజకీయాల్లో సైతం ఎన్టీఆర్ ప్రత్యేకతను చాటుకున్నారని చెప్పారు. పేద ప్రజల ఉన్నతి కోసం ఆయన తపించారని తెలిపారు. సామాజిక న్యాయం కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఎన్టీఆర్ విలక్షణ వ్యక్తిత్వాన్ని ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని చెప్పారు.

ఎన్టీఆర్ కుమార్తె, భాజపా ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ ఎన్టీఆర్ అంటే తెలియని వారు ఉండరని చెప్పారు. మహిళకు ఆస్తిలో హక్కు కల్పించింది ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. తిరుపతిలో మహిళా వర్సిటీ ఏర్పాటు చేశారన్నారు. ఎన్టీఆర్ ఒక తరం హీరో మాత్రమే కాదని... అన్ని తరాలకు ఆదర్శ హీరో అని పురందేశ్వరి కొనియాడారు. సినీ, రాజకీయ రంగాల్లో ఆయన తనదైన ముద్ర వేశారన్నారు. ఈ కార్యక్రమానిక బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ తనయులు నందమూరి బాలకృష్ణ, మోహనకృష్ణ, రామకృష్ణ, కుమార్తెలు లోకేశ్వరి, భువనేశ్వరితో పాటు ఇతర కుటుంబ సభ్యులు హాజరయ్యారు. వీరితో పాటు తెదేపా ఎంపీలు కనకమేడల రవీంద్ర కుమార్, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, గల్లా జయదేవ్, కేశినేని నాని, వైకాపా ఎంపీ రఘురామకృష్ణరాజు, భాజపా ఎంపీ సీఎం రమేశ్, మాజీ ఎంపీలు సుజనా చౌదరి, కంభంపాటి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్‌కు సినీ, రాజకీయ రంగాల్లో సన్నిహితంగా మెలిగిన మరికొంతమంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

### తొలిసారి వ్యక్తి చిత్రంతో నాణెం ముద్రణ

ఎన్టీఆర్ స్మారక నాణెం హైదరాబాద్‌లోనే తయారైందని హైదరాబాద్ మింట్ చీఫ్ మేనేజర్ వీఎన్ఆర్ నాయుడు తెలిపారు. హైదరాబాద్ మింట్‌లో తొలిసారి వ్యక్తి చిత్రంతో నాణెం ముద్రించాం. ఇది మార్కెట్‌లో చలామణి కోసం కాదు. తొలి విడతలో 12 వేల స్మారక నాణేలు ముద్రించాం. ఈ నాణేల ధర రూ.8,500 నుంచి రూ.4850 వరకు ఉంటుంది. ఆన్‌లైన్‌లో నూ హైదారాబాద్ లోని 8 చోట్ల నాణేలను విక్రయిస్తున్నాం. డిమాండ్‌కి తగినంతగా నాణేల సరఫరా లేదని తెలిపారు. హైదరాబాదులోని మింట్ కార్యాలయంలో కూడా ఎన్టీఆర్ స్మారక నాణెం దొరుకుతుందన్నారు. 100 రూపాయల నాణాన్ని 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5శాతం నికెల్, 5 శాతం జింక్‌తో తయారుచేసినట్లు వెల్లడించారు.

### రాష్ట్రపతి ముర్ముకు ధన్యవాదాలు తెలిపిన టీడీపీ అధినేత చంద్రబాబు

ఢిల్లీ: ఎన్టీఆర్ గౌరవార్థం ఆయన బొమ్మతో కూడిన ప్రత్యేక నాణేన్ని విడుదల చేసినందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హృదయకపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఢిల్లీలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎన్టీఆర్ శతజయంతి స్మారక నాణెం విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ చిత్రంతో కూడిన ఈ రూ.100 నాణెం ఆవిష్కరణకు టీడీపీ అధినేత చంద్రబాబు, నందమూరి బాలకృష్ణ, దగ్గుబాటి పురందేశ్వరి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

దీనిపై చంద్రబాబు 'ఎక్స్'లో స్పందించారు. భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, రాజకీయాలకు అతీతంగా, హద్దులను చెరిపివేస్తూ, ఎన్టీఆర్ ఘనతర వారసత్వాన్ని స్మరించుకుంటూ, నేడు ఐక్యంగా నిలిచిన ప్రపంచవ్యాప్త తెలుగు ప్రజలందరికీ ఈ ఘట్టం ఎనలేని గర్వకారణం అని చంద్రబాబు వివరించారు.

### తెలుగువాడిగా, ఎన్టీఆర్ మనవడిగా గర్విస్తున్నాను: నారా లోకేశ్

అమరావతి: దివంగత నందమూరి తారక రామారావు శతజయంతిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్ స్మారక నాణేన్ని ఆవిష్కరించడం తెలుగుజాతికి దక్కిన గొప్ప గౌరవమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా అనుసంధాన వేదిక ఎక్స్(ట్విట్టర్)లో ట్వీట్ చేశారు. తెలుగువాడిగా, తెలుగుదేశం వాడిగా, నందమూరి తారకరామారావు మనవడిగా గర్విస్తున్నానని పేర్కొన్నారు. ఎన్టీఆర్ కథానాయకుడు, ప్రజాసేవకుడు, తెలుగుజాతిని ఒక్కతాటిపై నడిపించిన మహానాయకుడని కొనియాడారు.

కోట్లాది హృదయాల్లో దేవుడిగా కొలువైన ఎన్టీఆర్ తమకు స్ఫూర్తి అన్నారు. శకపురుషుడు శతజయంతిని చరిత్రలో నిలిచిపోయేలా ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదల చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

### చాలా ఆనందంగా, గర్వకారణంగా ఉంది: నందమూరి రామకృష్ణ

ముందుగా మన భారత దేశానికి, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి, భారత దేశ ప్రభుత్వానికి ధాన్యవాదాలు, కృతజ్ఞతలు. మన తెలుగు కళామతల్లి ముద్దు బిడ్డ, మన విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, పద్మశ్రీ, నటరత్న కళాప్రపూర్ణ స్వర్గీయ నందమూరి తారకరామారావు పేరిట వందరూపాయల నాణెం విడుదల చేయటం మా కుటుంబానికి తెలుగు ప్రజల ప్రజలందరికీ చాలా గర్వకారణమని ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ ఎక్స్ (ట్విట్టర్)లో ట్వీట్ చేశారు.





# చింతలపూడి నియోజకవర్గంలో దుమ్మురేపిన యువగళం

**యువనేత లోకేష్‌కు అడుగడుగునా ఆత్మీయస్వాగతం | నేడు శ్రీరాంపురంలో పోలవరం నిర్వాసితులతో ముఖాముఖి**













చింతలపూడి: యువనేత లోకేష్ యువగళం పాదయాత్ర 197వరోజు చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో దుమ్మురేపింది. అభిమానుల షేక్ హ్యాండ్లతో ఎడమ భుజం తీవ్రంగా బాధిస్తున్నా పంటిబిగువున భరిస్తూ లోకేష్ ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు. చింతలపూడి ప్రజలు అడుగడుగునా యువనేతకు నీరాజనాలతో గ్రామాల్లోకి స్వాగతిస్తున్నారు. మార్గమధ్యలో ప్రజలు చెబుతున్న ప్రతిసమస్యను ఆలకిస్తూ నేనున్నానని భరోసా ఇస్తూ యువనేత ముందుకు సాగుతున్నారు. సుందరరావుపేట క్యాంప్ సైట్ నుంచి ప్రారంభమైన పాదయాత్రకు దారిపొడవునా జనం బ్రహ్మరథం పట్టారు. మధ్యాహ్నం భోజన విరామానంతరం చింతలపూడిలో యువనేత పాదయాత్రకు పెద్దఎత్తున జనం తరలివచ్చారు. ప్రధాన రహదారి జనంతో కిక్కిరిసిపోవడంతో భవనాలపై నిలబడి లోకేష్‌కు అభివాదం తెలిపారు. జగన్‌రెడ్డి పెంచిన పన్నులు, నిత్యావసర వస్తువుల ధరలతో బతుకు బండి లాగడం భారంగా మారిందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తంచేయగా, కరెంటు బిల్లును అడ్డగోలుగా పెంచేసి బిల్లు ఎక్కువచ్చిందన్న సాకుతో పెన్షన్లు తొలగిస్తున్నారని వృద్ధులు వాపోయారు. మరికొద్ది రోజుల్లో రాబోయే చంద్రన్న ప్రభుత్వం ధరలను అదుపులోకి తెస్తుందని అభయమిస్తూ యువనేత ముందుకు సాగారు. సుందరరావుపేట, లింగ పాలెం, వెలగపల్లి, ఫాతిమాపురం, చింతలపూడి మీదుగా తీగలవంచ విడిది కేంద్రం వరకు పాద యాత్ర సాగింది. 197వరోజు యువనేత లోకేష్ 22.7 కి..మీ.ల పాదయాత్ర చేశారు. ఇప్పటివరకు యువగళం పాదయాత్ర 2646.7 కి.మీ.ల మేర పూర్తయింది. మంగళ వారం మధ్యాహ్నం పోల వరం నియోజక వర్గం శ్రీరాంపురంలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులతో యువనేత లోకేష్ ముఖాముఖి సమావేశమై వారి సమస్యలు తెలుసుకోనున్నారు.











**యువనేత లోకేష్ సెల్ఫీ చాలెంజ్**

## చంద్రన్న సమర్థతకు సజీవ సాక్ష్యం...

### చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం!

జగన్మోసపురెడ్డి మాటలకు,చేతలకు పొంతన ఉండదనడానికి నిలువెత్తు నిదర్శనం చింతలపూడి ఎత్తిపోతల పథకం. ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణాజిల్లా మెట్టప్రాంతంలో రైతులకు గోదావరి జలాలు అందించే లక్ష్యంతో చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం విస్తరణ పనులను శరవేగంతో పరుగులు తీయించారు దార్శనిక నేత చంద్రబాబునాయుడు. దీనిద్వారా రెండుజిల్లాల్లోని 33మండలాల్లో 4.80లక్షల ఎకరాలకు నీరందించేందుకు గత ప్రభుత్వ హయాంలో రూ.4909 కోట్ల అంచనాలతో పనులు చేపట్టి, అధికారం నుంచి వైదొలగేనాటికి రూ.2289 కోట్లు ఖర్చుచేశాం. ప్రాజెక్టు విస్తరణకు భూసేకరణ సమయంలో నిర్వాసిత రైతులకు కల్లబొల్లి మాటలు చెప్పి రెచ్చగొట్టిన జగన్... అధికారంలోకి వచ్చాక పరిహారం ఇవ్వకుండా ముఖం చాటేస్తున్నారు. కొత్త ప్రాజెక్టుల మాట దేవుడెరుగు... ఉన్న ఎత్తిపోతల పథకాలకు కరెంటుబిల్లులు కట్టలేక పాడుబెడుతున్నారు. విధ్వంసకుడు జగన్ అరాచకానికి, చేతల మనిషి చంద్రన్న సమర్థతకు అద్దం పడుతోంది చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు.



# పామాయిల్ రైతులకు ఉచితంగా మొక్కలు!



చింతలపూడి: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పామ్ అయిల్ మొక్కలు ఉచితంగా అందిస్తాం, మిషన్ మోడ్ లో పామ్ అయిల్ పంటను ప్రోత్సహిస్తాం, డైనమిక్ ప్రైసింగ్ పాలసీ తీసుకురావడం కోసం కృషి చేస్తామని యువనేత నారా లోకేష్ పేర్కొన్నారు. చింతలపూడిలో పామ్ అయిల్ రైతులతో యువనేత లోకేష్ ముఖాముఖి సమావేశమయ్యారు. పామ్ ఆయిల్ బోర్డు ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా ఉంది. రైతులని ఆదుకోవడం కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేసుకునే అంశంపై కూడా చర్చించాం. కొత్త పామాయిల్ ఫ్యాక్టరీ పెట్టి రికవరీ రేటు పెంచేలా చర్యలు తీసుకుంటాం. పామ్ ఆయిల్ నర్సరీ ఏర్పాటు చేస్తాం. ఇతర రాష్ట్రాల్లో ఉన్న మెరుగైన పాలసీలను అధ్యయనం చేసి బోర్డు ఏర్పాటు చేస్తాం. పామ్ అయిల్‌ని రాష్ట్రానికి పరిచయం చేసింది అన్న ఎన్టీఆర్. మెట్ట ప్రాంతం రైతుల అభివృద్ధి కోసం ఆనాడే ఆలోచించి పామ్ ఆయిల్ రైతులను ప్రోత్సహించింది ఎన్టీఆర్. పామ్ అయిల్ రైతులను ఆదుకున్నది, పామ్ అయిల్ రేట్లు పడిపోయినప్పుడు మద్దతు ధర ఇచ్చి ఆదుకుంది చంద్రబాబు నాయుడు.

### చింతలపూడి ప్రాజెక్టును నాశనంచేశారు

చింతలపూడి ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చెయ్యాలని చంద్రబాబు పనిచేస్తే జగన్ ఆ ప్రాజెక్టు ను నాశనం చేసాడు. చింతలపూడి ప్రాజెక్టు లో ఒక్క తట్ట మట్టి కూడా తియ్యలేదు. జగన్ కి జే బ్రాండ్ లిక్కర్ అంటే ఇష్టం, ఇసుక అంటే ప్రేమ... కానీ రైతులు, వ్యవసాయం అంటే ద్వేషం. పామ్ అయిల్ రైతులకు సబ్సిడీలో మొక్కలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు అందజేసాం. పామ్ ఆయిల్ రైతులకు జగన్ ప్రభుత్వం చేసింది గుండు సున్నా.

### పామాయిల్ రైతులూ బాధితులే

దేశంలోనే ఎక్కువ పామ్ ఆయిల్ పండిస్తోంది అంధ్రప్రదేశ్. జగన్ పాలనలో పామ్ అయిల్ రైతులు బాధితులుగా మారారు. మొక్కలు, ఎరువులు, పురుగుల మందులు, యంత్రాలు, పనిముట్లు దేనికీ సబ్సిడీ రావడం లేదు. గతంలో టీడీపీ హయాంలో కేంద్రంతో సంప్రదింపులు చేసి పామ్ అయిల్ పై దిగుమతి సుంకం 49 శాతం విధించే విధంగా చర్యలు తీసుకున్నాం. ఇప్పుడు కేంద్రం దిగుమతి సుంకం ఎత్తేయడంతో పామ్ ఆయిల్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గిట్టుబాటు ధర రావడం లేదు. వైసీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే, ఎంపీలు పట్టించు కోవడం లేదు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పామ్ ఆయిల్ రీసెర్చ్ సెంటర్ ని బలోపేతం చేస్తాం.









### రికవరీ రేటు పెంపుదలకు కృషిచేస్తాం

పామ్ ఆయిల్ మొక్కలు ఉచితంగా అందించాలి అనే లక్ష్యంతో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేసి ఎక్కువ దిగుబడి వచ్చే మొక్కల రకాలు అభివృద్ధి చేస్తాం. ఇతర దేశాల్లో పామ్ అయిల్ రికవరీ రేటు 22 శాతం ఉంటే ఇక్కడ కేవలం 15.5 శాతమే ఉంది. దీనిని పెంచడానికి టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటాం. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు పక్క రాష్ట్రంలో అమలు అవుతున్న రేటు ఇప్పించి ఆదుకున్నారు. జగన్ ప్రభుత్వం కొత్త ఫ్యాక్టరీ పెడతాం అని మోసం చేసింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వంతో చర్చించి డైనమిక్ ప్రైసింగ్ పాలసీ తీసుకురావడం కోసం కృషి చేస్తుంది. కేంద్రంలో కూడా టీడీపీ మద్దతు ఇచ్చే పార్టీ నే అధికారంలోకి వస్తుంది.

### పెట్టుబడులు తగ్గించేందుకు చర్యలు

పామ్ అయిల్ పెట్టుబడి తగ్గించడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఉపాధి హామీ తో అనుసంధానం చేసి మొదటి మూడేళ్లు పెట్టుబడి తగ్గించేలా చర్యలు తీసుకుంటాం. పామ్ ఆయిల్ దిగుమతి తగ్గిస్తే మన దేశానికి మేలు జరుగుతుంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పామ్ ఆయిల్ పంటను పెంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. సబ్సిడీలు, రాయితీలు అందిస్తాం. కేంద్రం సబ్సిడీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా జగన్ ప్రభుత్వం ఇవ్వాల్సిన 40 శాతం వాటా ఇవ్వకపోవడం తో పామ్ ఆయిల్ రైతులకు సబ్సిడీలు అందడం లేదు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సబ్సిడీలో డ్రిప్ ఇరిగేషన్, పరికరాలు, యంత్రాలు కూడా అందిస్తాం.

### గిట్టుబాటు ధర కల్పిస్తాం

జగన్ 16 నెలలు జైల్లో చిప్పకూడు తిన్న వ్యక్తి అందుకే రాష్ట్రంలో ఉన్న అందరి పైనా కేసులు పెడుతున్నాడు. రైతుల పై కూడా కేసులు పెట్టాడు. రైతు కళ్లలో ఆనందమే టీడీపీ లక్ష్యం. టీడీపీ హయాంలో ఎప్పుడు గిట్టుబాటు ధర సమస్య వచ్చినా చంద్రబాబు ఉదారంగా ఆదుకొనే వారు. జగన్ పాలనలో అసలు వ్యవసాయ శాఖ ఉందా అనే అనుమానం వస్తుంది. జగన్ పాలనలో రైతు ఆత్మహత్యల్లో ఏపి దేశంలోనే నంబర్ 3గా ఉంది. కౌలు రైతుల ఆత్మహత్యల్లో నంబర్ 2 గా ఉంది. పామ్ ఆయిల్ పెట్టుబడి తగ్గించి, గిట్టుబాటు ధర ఇచ్చే బాధ్యత టిడిపి తీసుకుంటుంది.

### పామాయిల్ రైతులు మాట్లాడుతూ...

పామ్ ఆయిల్ మొక్కల రేట్లు విపరీతంగా పెరిగిపోయాయి. రాష్ట్రంలో పామ్ ఆయిల్ నర్సరీ ఏర్పాటు చేయాలి. జగన్ ప్రభుత్వం కొత్త పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తాం అని చెప్పి మోసం చేసింది. కొత్త ఫ్యాక్టరీ పెట్టి రికవరీ రేటు పెరిగేలా చర్యలు తీసుకోవాలి. గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్నాం. మొక్క, ఎరువులు, పురుగుల మందులు, లేబర్ రేట్లు విపరీతంగా పెరిగిపోయాయి. పాత మొక్కలు తీసి కొత్త మొక్కలు వేసుకోవడానికి ప్రభుత్వం సహాయం అందించాలి.

జగన్ ప్రభుత్వం వచ్చిన నాటి నుండి మాకు సబ్సిడీలు, ప్రోత్సాహకాలు రావడం లేదు. టన్ను కి 13 వేలు రావడం కూడా కష్టం గా మారింది. కనీసం 18 వేలు వస్తే కానీ గిట్టుబాటు కాదు. టీడీపీ హయాంలో మొక్క దగ్గర నుండి పురుగుల మందుల వరకూ అన్ని సబ్సిడీలో అందించాం. బోర్డర్ లో ఉన్న పామ్ ఆయిల్ రైతులను వైసిపి నేతలు ఇబ్బంది పెడుతున్నారు. పక్క రాష్ట్రాల్లో టన్నుకి రూ.1600 ఎక్కువ ఉన్నా మేము అమ్ముకొనే అవకాశం లేకుండా చేశారు. ఆ సొమ్ము అంతా ఎమ్మెల్యే, ఎంపీ తింటున్నారు.









## లోకేష్‌ను కలిసిన చింతలపూడి లిఫ్ట్ భూ నిర్వాసితులు

చింతలపూడి నియోజకవర్గం వెలగపల్లిలో ప్రగడవరానికి చెందిన చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు భూనిర్వాసితులు యువనేత లోకేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకానికి మేం భూములు ఇచ్చాం. ఎకరానికి రూ.30లక్షలు ఇప్పిస్తామని ప్రస్తుత ఎమ్మెల్యే, ఎంపీ ప్రతిపక్షంలో ఉండగా పోరాటం చేయించారు. రూ.30 లక్షలు ఇప్పించే అంశంపై పాదయాత్ర సందర్భంగా జగన్ గతంలో హామీ ఇచ్చి నేడు పట్టించుకోవడం లేదు. అధికారం లోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే మాకు ఎకరాకు రూ.30లక్షలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదు. మా భూములు నేడు 22ఏ పరిధిలో ఉండడంతో మేం భూములు తాకట్టు పెట్టుకోవడం, అమ్మే పరిస్థితి లేకుండాపోయింది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల్లో కూడా మా భూములు మాకు అక్కరకు రాలేని దుస్థితి వచ్చింది. మీరు అధికారంలోకి వచ్చాక మాకు న్యాయం చేయాలి.

### చింతలపూడి ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తిచేస్తాం

ప్రాజెక్టుల గేట్లకు గ్రీజు పెట్టలేని దద్దమ్మ ముఖ్యమంత్రి కొత్తప్రాజెక్టులు ఎలా కడతారు? జగన్మోసపురెడ్డి మాయమాటలు నమ్మి అన్నివర్గాల ప్రజలు మోసపోయారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టులపై రూ.68,294కోట్లు ఖర్చుచేస్తే, వైసీపీ వచ్చాక నాలుగోవంతు ఖర్చుచేయలేదు. జగన్ దివాలాకోరు పాలనలో మెయింటెనెన్స్ లేక అన్నమయ్య ప్రాజెక్టు, పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయాయి. అధికారంలోకి వచ్చాక భూనిర్వాసితులకు పరిహారం అందజేసి, చింతలపూడి ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తిచేస్తాం.

## చింతలపూడి ఎత్తిపోతల పూర్తయితే సస్యశ్యామలం: లింగపాలెం గ్రామస్తులు

చింతలపూడి నియోజకవర్గం లింగపాలెం గ్రామస్తులు యువనేత లోకేష్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మా గ్రామంలో 30వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. చింతలపూడి ఎత్తిపోతల పూర్తయితే మా పొలాలు సస్యశ్యామలమవుతాయి. ఎత్తిపోతల భూ నిర్వాసితులకు నేటికీ డబ్బులు అందలేదు. గ్రామంలో రహదారుల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఎస్సీ, బీసీ కార్పొరేషన్ పథకాలను పునరుద్ధరించాలి. రైతులకు గతంలో అందించిన సబ్సిడీ పథకాలు పునరుద్ధరించాలి. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి.

### టీడీపీ అధికారంలోకి వచ్చాక పూర్తి చేస్తాం

జగన్మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో కనీసం పిల్లకాలువ కూడా పూర్తిచేయలేదు. రైతులకు అవసరమైన ఏ సాగునీటి పథకమూ జగన్ పాలనలో పూర్తికాలేదు. రాష్ట్రప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టును గోదావరిలో ముంచి నాశనం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేస్తాం. చింతలపూడి ప్రాజెక్టు భూనిర్వాసితులకు పరిహారం అందజేస్తాం. గ్రామంలో అభివృద్ధి పనులను పూర్తిచేస్తాం. టీడీపీ పాలనలో రైతులకు ఇచ్చిన సబ్సిడీ పథకాలను పునరుద్ధరిస్తాం. అన్నదాత పథకం కింద రైతులకు ఏటా రూ.20వేల సాయం అందిస్తాం. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తాం.



## గిట్టుబాటు ధర, పంట కొనుగోలు, చెల్లింపులకు చర్యలు తీసుకోవాలి: చింతలపూడి రైతులు

చింతలపూడి ఫైర్ ఆఫీస్ సెంటర్ లో రైతులు యువనేత లోకేష్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పామాయిల్ ధర టన్నుకు రూ.10వేలు పైబడి తగ్గి రైతులు నష్టపోతున్నారు. గతంలో పామాయిల్ మొక్కలు, ఎరువులకు సబ్సిడీలు వచ్చేవి, నేడు రద్దు చేశారు. గత పాలనలో రైతులకు సబ్సిడీ మీద పనిముట్లు, డ్రిప్, మోటార్లు ఇచ్చేవారు, నేడు రద్దు చేశారు. ధాన్యాన్ని సకాలంలో కొనడం లేదు, కొన్న వాటికి సకాలంలో డబ్బులు ఇవ్వడం లేదు. చింతలపూడి మెట్టప్రాంతం కావడంతో పూర్తిగా మోటార్లు, బావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నాం. మోటార్లకు మీటర్లు పెడితే రైతులు తీవ్రంగా నష్టపోతారు. మీరు అధికారంలోకి వచ్చాక సబ్సిడీలు, పంటలకు గిట్టుబాటు ధర, పంట కొనుగోలు, చెల్లింపులకు చర్యలు తీసుకోవాలి.

### రైతు కళ్లల్లో ఆనందం చూడడమే టీడీపీ లక్ష్యం

జగన్మోహన్ రెడ్డి చేతగాని పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అప్పుల్లో కూరుకుపోయి ఆత్మాభిమానం చంపుకుని బ్రతకలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. జగన్ పాలనలో రైతు ఆత్మహత్యల్లో ఏపీ దేశంలో 3వ స్థానం, కౌలురైతుల ఆత్మహత్యల్లో 2వ స్థానంలో నిలిపాడు. ధాన్యానికి నెలలు గడిచినా చెల్లింపులు చేసే పరిస్థితులు లేవు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఏటా 3 వేల కోట్ల ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని జగన్ మాట తప్పాడు. మేం అధికారంలోకి వచ్చాక రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం. గతంలో ఇచ్చిన సబ్సిడీలు పునరుద్ధరిస్తాం. మేం అధికారంలోకి వచ్చాక రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తాం. రైతు కళ్లల్లో ఆనందం చూడడమే టీడీపీ లక్ష్యం.







## యవతకు ఉపాధి చూపించాలి: నగర పంచాయతీ ప్రజలు

చింతలపూడి నగర పంచాయితీ ప్రజలు సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద యువనేత లోకేష్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మా ప్రాంతంలో యువత చదువుకుని నిరుద్యోగులుగా ఉన్నారు, పరిశ్రమలు పెట్టి ఉద్యోగం, ఉపాధి కల్పించాలి. మా ప్రాంతంలో పేదవారికి నివాస స్థలాలు, ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. వరి,మామిడి, పామాయిల్ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి. చింతలపూడికి వచ్చే మంచినీటి పైపులైను లో నీరు కలుషితమవుతోంది, కొత్త లైన్ నిర్మించాలి. చింతలపూడి నగర పంచాయతీలో రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. కొత్తవి నిర్మించాలి. టీడీపీ పాలనలో ప్రారంభిం చిన అనేక సీసీ రోడ్లను వైసీపీ ప్రభుత్వంలో నిలిపేశారు. గణేష్ కాలనీ, దేవుడుమాన్యం కాలనీ, బీసీ కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, వెలంపేట కాలనీ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతు న్నారు. రహదారులు సైతం అధ్వానంగా తయారయ్యి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నాం. నగరంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు..అవి సరిగా వెలగడం లేదు. హిందూ శ్మశానవాటిక, పాత చింతలపూడి ఎస్సీ శ్మశానవాటికకు రక్షణ గోడ నిర్మించాలి. ఆక్రమణలను తొలగించాలి. చింతలపూడి పట్టణంలో బస్సు డిపో ఏర్పాటు చేసి రవాణా సదు పాయం కల్పించాలి. చింతలపూడి ఎత్తి పోతల పథకాన్ని పూర్తిచేసి రైతులను ఆదుకోవాలి.

### ప్రతిఏటా జాబ్ క్యాలెండర్, ఉద్యోగాల భర్తీ

జగన్మోహన్ రెడ్డి పాలన రాష్ట్రప్రజలకు శాపంగా పరిణమించింది. పాదయాత్ర సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు 2.30లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన జగన్.. మాటతప్పి మడమతిప్పాడు. ప్రతియేటా జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి జాబ్ లెస్ క్యాలెండర్ విడుదలచేశాడు. ఉద్యోగాలు కోసం నిలదీస్తున్న యువతను జైళ్లలో పెట్టి వేధిస్తున్నాడు. జగన్ పాలన లో రాష్ట్రంలో అభివృద్ధి కనుమరుగైంది. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి, వాడలు మురికి వాడలుగా మారాయి, ప్రధాన రహదారులు మృత్యుకూపాల య్యాయి.కాంట్రాక్టర్లకు 1.30లక్షల కోట్లు పెట్టుబడి పెట్టడంతో జగన్ ముఖం చూసి పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. మేం అధికారంలోకి వచ్చాక చింతలపూడి నగరపంచాయతీని అభివృద్ధి చేస్తాం. నిలిచిపోయిన అభివృద్ధి కార్య క్రమాలను పునరుద్ధరిస్తాం. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదలచేసి, ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేస్తాం. అధికా రంలోకి వచ్చిన రెండేళ్లలో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి మెట్టప్రాంత రైతుల కష్టాలు తొలగిస్తాం.

చైతన్యరథం

# ప్రభంజనం సృష్టిస్తున్న యువగళం!

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర కని,విని ఎరుగని రీతిలో ప్రభంజనం సృష్టిస్తుంది. లోకేశ్ పాదయాత్ర స్వపక్షంలో అనందం వ్యక్తం అవుతుండగా, అధికారం పక్షం ఆందోళన చెందుతుంది. పాదయాత్రకు వస్తున్న జనాధరణ చూసి జగన్ శిభిరంలో కలవరం మొదలైంది. చిత్తూరు జిల్లా రాయలసీమ మీదుగా నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, ఉమ్మడి కృష్ణా జిల్లా వరకు సాగిన యువగళం పాదయాత్ర ప్రభంజనాన్ని చూసినప్పుడు ఎవరికైనా స్ఫురించేది ఒక్కటే. వస్తున్నాయి, వస్తున్నాయి లోకేశ్ రథ చక్రాల్. అవే రాష్ట్ర ప్రగతికి రథ చక్రాల్ అని. తాను చేస్తున్న సుధీర్ఘ యువగళం పాదయాత్ర తనకోసం కాదని, 5 కోట్ల ప్రజల ప్రయోజనం, భావితరాల ఉజ్వల భవిష్యత్ కోసం అంటున్నారు లోకేష్. 27-1-2023న కుప్పంలో ఒక్క అడుగు తో మొదలైన లోకేశ్ పాదయాత్ర చూస్తుండగానే 2600 కిలోమీటర్ల మైలు రాయిని దాటింది. లోకేశ్ నిర్విరామ యువగళం పాదయాత్ర 31-8-2023 తేదీకి 200 రోజులు పూర్తి అవుతుంది. కష్టాల్లో వున్న ప్రజలకు వాస్తవాలు వివరించడానికి ఏది మంచి,ఏది చెడు అనేది వివరంగా చెబుతూ వారిని ఆలోచింప చెయ్యడానికి ఇంతకన్నా మంచి కార్యక్రమం వుండదని 400 రోజులు, 4000 కిలోమీటర్లు భారీ పాదయాత్రను చేపట్టారు లోకేష్, విధ్వంసక పాలనలో అథోగతి పాలు అయిన ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి అగ్రగామిగా నిలిపేందుకు నడుం బిగించిన నారా లోకేష్ పాదయాత్ర మొదలు పెట్టిన దగ్గరనుండి ప్రభుత్వం అడుగడుగునా ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని కేసులు పెట్టినా అధిగమించి యువగళం పాదయాత్రని జనం చైతన్యయాత్ర చేశారు. మండుటెండలోనూ,జోరు వానలోనూ, కాళ్ళు బొబ్బలెక్కినా,చేయి నొప్పి తో బాధ పడుతున్నా లెక్క చెయ్యకుండా మొక్క వోని పట్టుదల, సడలని సంకల్పంతో పాదయాత్ర కొనసాగి స్తాగిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నారు. జైత్ర యాత్ర సారధి లోకేష్ యువగళం పాదయాత్ర జనగళమై, ప్రజా బలమై ఇప్పటి వరకు 196రోజులలో మొత్తం 2600 కిలోమీటర్లు పూర్తి చేశారు. చిత్తూరు జిల్లాలో 14 నియోజక వర్గాలు,45 రోజులు, 577 కిమీ -అనంతపురం జిల్లాలో 9 నియోజకవర్గాలు, 23 రోజులు,303 కిమీ- కర్నూలు జిల్లాలో 14 నియోజకవర్గాలు, 40 రోజులు, 507 కిమీ -కడప 7 నియోజకవర్గాలు, 16 రోజులు, 200 కి-మీ, నెల్లూరు 10 నియోజకవర్గాలు, 31 రోజులు, 499 కిమీ, ప్రకాశం 8 నియోజకవర్గాలు, 17 రోజులు, 220 కిమీ- గుంటూరు 7 నియోజకవర్గాలు, 16 రోజులు,236 కిమీ-ఉమ్మడి కృష్ణా జిల్లా 6 నియోజక వర్గాలు, 9 రోజులు, 115 కిమీ, మొత్తం 75 నియోజకవర్గాలు, 183 మండలాలు, మున్సిపాలిటీలు, 1560 గ్రామాలలో పాదయాత్ర నిర్వహించి 10 భారీ బహిరంగ సభలు పెట్టారు. ప్రతి వంద కిలోమీటర్లకు ఒక శిలాఫలకం వేస్తూ ఇప్పటి వరకు 26 శిలాఫలకాలు ఆవిష్కరించారు. లోకేశ్ పాదయాత్రకు పోలీసులు సృష్టించిన అడ్డంకులు అన్నీ ఇన్నీ కావు. చిత్తూరు జిల్లాలో పదే పదే లోకేష్‌ను అడ్డుకున్నారు. ప్రచార వాహనం, మైకులు ఎత్తుకుపోయారు. జీవో నంబర్ 1 సాకుతో కనీసం స్టూలెక్కి మాట్లాడే అవకాశం లేకుండా చేశారు. చిత్తూరు జిల్లా దాటి అనంతరంలో పాదయాత్ర ప్రవేశించినప్పటి నుండి అనంతపురం, కర్నూలు జిల్లాల్లో జనం పోటెత్తారు. తర్వాత కడప, నెల్లూరు జిల్లాలో వచ్చినజన ప్రభంజనం చూసి ఆ రోజు ఎన్‌టిఆర్ నాటి జన ప్రవాహం గుర్తుకు వస్తుందని రాజకీయ విశ్లేషకులు కూడా అభిప్రాయ పడ్డారు. వైసీపీకి బలమైన నియోజకవర్గాల్లో నిర్వహించిన బహిరంగ సభలు జనంతో కిక్కిరిసిపోయ్యాయి. సభలు ఒక దానిని మించి మరొకటి విజయవంతమయ్యాయి. వైసీపీకి కంచుకోట. కడప, నెల్లూరు జిల్లాలో లోకేష్ యాత్రకు స్వచ్ఛందంగా జనం అపూర్వ స్వాగతం పలికిన తీరు అందరిని ఆచ్చర్య పరిచింది. మొదట లోకేష్ పాదయాత్రని తేలిగ్గా తీసుకున్నది జగన్ ప్రభుత్వం. లోకేష్ పాదయాత్ర చేయలేడని, అది పాదయాత్రే కాదని, తాము చేసిందే పాదయాత్ర అని స్తోత్కర్మకాలు వినిపిం చారు. అంతే కాదు సీఎం జగన్‌రెడ్డి కడప జిల్లా వైసీపీకి కంచుకోటలో పాదయాత్రను పట్టించుకునే వారే ఉండరని ఎగతాళి చేశారు. కానీ కడప,నెల్లూరు జిల్లాలో లోకేష్‌కి వచ్చిన అపూర్వ ప్రజాదరణ చూసి పాలకపక్షానికి కళ్ళు బైర్లు కమ్మి,మైండ్ బ్లాక్ అయింది. తర్వాత ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాలలో కూడా యువగళం పాదయాత్ర కనీ, విని ఎరుగని విధంగా ప్రభంజనం సృష్టిస్తుంది. పాదయాతలో ప్రజల భాధలు స్వయంగా చూసి చలించి పోయిన లోకేష్ కొన్ని సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసి మహానాడులో ప్రకటించిన పథకాలు ప్రజల్లోకి వెళ్ళాయి.మహిళల కోసం మహాశక్తి, పథకం, తల్లికి వందనం,బీసీలను రక్షణ కోసం ప్రకటించిన చట్టం బీసీలను ఆకర్షించింది. యువతకు ఉద్యోగాల కల్పన నిరుద్యోగ బృతి హామీ యువతలో ఆత్మ విశ్వాసాన్ని నింపింది. అన్నదాత సుఖీభవ పథకం రైతుల కళ్ళలో ఆనందం నింపింది. అన్నీ వర్గాల ప్రజల్లో అంతర్మథనం ప్రారంభం అయింది. లోకేష్ తాను అనుకొన్న అంశాలను విజయవంతంగా ప్రజల్లోకి తీసుకెళుతున్నారు. ప్రజలతో పూర్తిగా మమేకం అయిన లోకేష్ వారు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పష్టమైన అవగాహనకు వచ్చారు. ఆ అవగాహనతో వాటిని తాను పరిష్కారం ఎలా చేసి చూపిస్తానో వివరిస్తున్నారు ప్రజలకు. పాదయాత్రకు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున స్వచ్చందంగా తరలివస్తున్నారు.మహిళలు ఎదురువెళ్ళి లోకేష్‌కి హారతులు ఇస్తున్నారు. అభిమానులు భారీ గజమాలలతో స్వాగతం పలుకుతూ అభిమానం చాటుతున్నారు. లోకేష్ భాధలు వింటూ బరోసా ఇస్తూ చెరగని చిరునవ్వుతో అందరినీ పలకరిస్తూ సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తూ ముందుకు సాగుతున్నారు.

తనను కలిసేందుకు వస్తున్నఅన్ని వర్గాల ప్రజలను అప్యాయంగా పలకరిస్తూ, వారిని అక్కున చేర్చుకుంటూ ఆత్మీయత పంచుతూ,ఆత్మస్థైర్యం నింపుతూ ముందుకు సాగుతున్న అలుపెరుగని బాటసారికి అపూర్వ ఆదరణతో జనం నీరాజనాలు పడుతున్నారు. ఏగ్రామం వెళ్లినా తమ కోసం వచ్చిన నేతను చూసేందుకు, తమగోడు వినిపించేందుకు జనసందోహం కిక్కిరిసి పోతున్నారు. గుండె చెదిరిన రైతన్న వెన్ను తడుతూ, బడుగుల బాగుకు,యువత భవితకు భరోసా ఇస్తూ,ఆడపడుచుల భద్రతకు అభయం ఇస్తూ, బతుకు భారమైన సామాన్యుడి కడగండ్లు కళ్లారా చూస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతానని హామీ ఇస్తూ ముందుకు సాగుతున్నారు. అనేక విషయాలపై సమగ్రమైన అవగాహనతో సమర్ధవంతంగా మాట్లాడుతున్నారు. జగన్ అసమర్ధ, అధ్వాన్న పరిపాలనను ప్రజల కళ్ళకు కట్టినట్లు వివరిస్తున్నారు. నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, నిత్యావసర వస్తువుల ధరలు, పెరిగిన విద్యుత్తు ఛార్జీలు,పడకేసిన పారిశ్రామిక రంగం, భద్రత కరువైన మహిళల దుస్థితి, పెరిగిపోతున్న రాష్ట్ర అప్పులు, బడుగు, బలహీన వర్గాలపై జరుగుతున్న దాడులు వంటి అంశాలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నారు. చీకట్లు కమ్మిన రాష్ట్రంలో మళ్ళీ వెలుగులు నింపాలి అంటే ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని లోకేష్ సోదాహరణంగా, విశ్లేషాత్మకంగా చెబుతున్న మాటలు ప్రజలను ఆలోచింప చేస్తున్నాయి. పాదయాత్రలో రాయలసీమ ఆర్ధిక, సామాజిక పురోగతికి, సర్వతోముఖాభివృద్ధికి మిషన్ ఏర్పాటు ద్వారా వ్యవసాయాభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి ప్రణాళిక ప్రకటించారు. రాయలసీమ ప్రజల కష్టాలు తీర్చి,కన్నీరు తుడిచేందుకు నేను రాయలసీమ మిషన్ ప్రకటిస్తున్నానని, అధికారంలోకి వచ్చాక మిషన్ ద్వారా రాయలసీమ రూపురేఖలే మార్చేస్తాము అని హామీ ఇచ్చారు. సీమలో అపారమైన వనరులు ఉన్నాయని, పెద్దఎత్తున పరిశ్రమలను తీసుకొచ్చి స్థానికంగా వున్న యువతకే ఉపాధి కల్పిస్తామని, మిషన్ రాయలసీమ అమలు చేసే బాధ్యత నాదేనాని, సీమను హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తామని హామీ ఇచ్చారు లోకేష్.

నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్రకు జగన్ ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టించినా, లోకేష్‌పై మొత్తం 20 కేసులు పెట్టినా, ఎన్ని విమర్శలు చేసినా అదరలేదు, బెదరలేదు. సాగనిస్తే పాదయాత్ర, లేకుంటే దండ యాత్ర అంటూ హెచ్చరిస్తూ ముందుకు సాగుతున్నారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వద్ద,తెచ్చి న పరిశ్రమల వద్ద సెల్ఫిలు దిగుతూ మీరు చేసిందేమిటో చూపాలని ప్రభుత్వానికి సవాల్ విసురుతున్నా సమాదానం లేదు. అంతే కాదు గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై ఈ నాలుగున్నరేళ్లలో వైసీపీ చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని లోకేష్ సవాల్ విసిరినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి దారి పొడవునా పూల వర్షంతో, మంగళహారతులతో లోకేష్‌కి నీరాజనాలు పట్టడంతో అపూర్వ స్పందన చూసి ఓర్వ లేక పాదయాత్రను అడ్డుకొంటున్నారు వైసీపీ నాయకులు. లోకేష్ పాద యాత్ర స్వపక్షంలో ఆనందం వ్యక్తం అవుతుండగా, అధికారం పక్షం ఆందోళన చెందుతుంది. తన ప్రభుత్వానికి చరమ గీతం పాడేందుకు ప్రజలు సిద్ధపడిన విషయం జగన్ రెడ్డికి అర్ధం అయింది.పాదయాత్రకు వస్తున్న జనాధరణ చూసి జగన్ శిభిరంలోకలవరం మొదలై ప్రస్టేషన్‌తో పాదయాత్రను అడుగడుగునా అడ్డుకొనే ప్రయత్నం చేస్తున్నారు. కానీ లోకేష్ యువగళం పాదయాత్రను అడ్డుకోవడం అంటే అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని అడ్డుకొన్న చందమే అవుతుంది.

## వైసీపీ నుండి టీడీపీలో చేరిన 50 కుటుంబాలు



సత్యసాయి జిల్లా (చైతన్యరథం): పెనుకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శ్రీ సత్య సాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బికే పార్థసారథి సమక్షంలో వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి గొల్లపల్లి దాకలి శ్రీనివాసులు, చెరువుగే రి నంజుంద ఆధ్వర్యంలో పెనుకొండ చెరువు గేరి, ఎగువ గడ్డ, కుమ్మరిదొడ్డి, టి టీ ఆర్ కాలనీ, గోనిపేట తండాకు చెందిన ఎస్ ఎం శిక్షావలి, హసేన్, బాబ్ జాన్, రమేష్ నాయక్, లక్ష్మి నాయక్, మహేష్ నాయక్, మారుతి, లక్ష్మీ బాయి, అశ్విని, రత్నమ్మ, కళావతి, అనుపమ, జ్యోతిబాయి, పార్వతీ బాయి, పార్వతి తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ పట్టణ అధ్యక్షుడు రవిశంకర్, కన్వీనర్ సిద్దలింగప్ప, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుటూరు సుబ్బరాయుడు, రాంపురం సర్పంచ్ శ్రీనివాసులు, పాలడుగు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## సమాధి కట్టేందుకు కూడా ఇసుక దొరకనివ్వడం లేదు

- ఎమ్మెల్యేలకు, వైసీపీ నేతలకు ఇసుక ఆదాయ వనరుగా మారింది
- ఇసుక దోపిడీ డబ్బంతా ఎక్కడికి పోతోంది.. జగన్ సమాధానం చెప్పాలి
- మాజీ మంత్రి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ఆగ్రహం



ధర్మవరం (చైతన్యరథం) : ఎమ్మెల్యేలు, వైసీపీ నాయకుల ఇసుక దోపిడీకి హద్దే లేకుండా పోయిందని.. మాజీ మంత్రి పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు.. శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం నల్లబోయినపల్లి ఇసుక రీచ్ వద్ద నిరసన చేపట్టారు. ముందుగా రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల టీడీపీ నేతలతో కలసి ఇసుక రీచ్ ను పరిశీలించారు. దీని వలన కులుగుతున్న నష్టాన్ని కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాసేపు ఇసుక రీచ్ వద్ద ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ వైసీపీ నాయకులు తమ స్వార్ధ ప్రయోజనాల కోసం.. రాష్ట్రంలో సామాన్యులకు ఇసుక దొరక్కుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇష్టానుసారంగా నదుల్లో ఇసుక తవ్వకాలు చేస్తున్న కారణంగా భూగర్భజలాలు అడుగంటిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. అలా అని సామాన్యులకైనా ఇసుక దొరుకుతుందా అంటే అది కూడా లేకుండా చేశారన్నారు. దీని వలన భవన నిర్మాణ రంగం కుదేలైందని.. కార్మికులకు ఉపాధి లేకపోయిందన్నారు. ప్రభుత్వం జేపీ కంపెనీ ద్వారా ఇసుక అమ్ముతున్నది టన్ను 475రూపాయలని.. కానీ బయట సదరు కంపెనీ అమ్ముతున్నది ఏకంగా 2వేల నుంచి 5వేల వరకు ఉందన్నారు. ఈ సొమ్ముంతా ఎవరి ఖాతాల్లోకి చేరుతుందో చెప్పాలన్నారు. మరోవైపు సామాన్యుదు ఎద్దుల బండ్లపై ఇసుక తీసుకెళ్తే.. పోలీసులు కేసులు పెడుతున్నారని.. కానీ అక్రమంగా కర్ణాటకకు తరలిస్తుంటే ఏమీ మాట్లాడరని విమర్శించారు. చివరకు సమాధి కట్టుకునేందుకు కూడా ఇసుక ఇవ్వడం లేదంటూ సునీత ధ్వజమెత్తారు....

### బాప్ ఏక్ నెంబరీ... బెటా దస్ నెంబరీ.. అన్నట్టుగా జగన్, కేతిరెడ్డిల పరిస్థితి ఉంది.. పరిటాల శ్రీరామ్

చిత్రావతి నదిలో ఇసుక దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయిందని.. ధర్మవరం నియోజకవర్గ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ ప్రాంతాల్లోని చిత్రావతి నదిలో ఇష్టానుసారంగా ఇసుక తవ్వేయడం వలన ఇక్కడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యేలకు, వైసీపీ నాయకులకు ఇది ఒక ఆదాయ వనరుగా మారిందన్నారు. లక్ష్మీనారాయణ అనే రైతు ఇసుక తవ్వకం వలన తన పొలం దెబ్బతింటోందని ప్రశ్నిస్తే.. ఆయనపై కేసులు పెట్టారన్నారు. గరిశనపల్లిలో కూడా ఇసుక తవ్వకాల వలన స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నదిలో బోర్ల ద్వారా గత కొన్నేళ్లుగా 18గ్రామాలకు నీరందిస్తున్నారని.. అయితే ఈ ఇసుక తవ్వకాల వలన బోర్లు ఎండిపోయే పరిస్థితి వస్తోందన్నారు. ఇలా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసి దోపిడీ చేస్తున్న ఇసుక డబ్బంతా తమ జేబుల్లోకి వేసుకుంటున్నారన్నారు. దీనిపై సీఎం జగన్ బయటకు వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# 'విద్యాదీవెన'లోనూ జగన్ రెడ్డి దగా!

**- విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్‌కు ఎక్కువ ఖర్చుచేసిన తెదేపా**

**- లబ్ధిదారులను, నిధుల కేటాయింపును తగ్గించిన జగన్ రెడ్డి**

అమరావతి (చైతన్యరథం): విద్యార్థుల ఉన్నత భవితకోసం ఎంతో చేస్తున్నానంటూ నిత్యం కోతలుకోసే ముఖ్యమంత్రి జగన్ రెడ్డి విద్యాదీవెన పథకంలోనూ దగాకు పాల్పడ్డారు. గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 16 లక్షల మంది విద్యార్థుల ఫీజుల కోసం నాటి బడ్జెట్ వనరుల్లో కేటాయించబడిన నిధులశాతం కంటే జగన్ రెడ్డి కేటాయించింది తక్కువే. పలు కారణాలతో లబ్ధిదారుల సంఖ్యను క్రమేణా తగ్గిస్తూ.. సంవత్సరానికి రూ.10 వేల నుంచి రూ.70 వేల వరకు అందచేయాల్సిన రీ యింబర్స్ మెంట్ లో తక్కువ మోతాదులను చెల్లిస్తూ విద్యార్థులను మోసం చేస్తున్నాడు జగన్ రెడ్డి. ఈ నేపథ్యంలో జగన్ రెడ్డి విద్యాదీవెన దగాపై తెదేపా నేత పరుచూరి అశోక్ బాబు సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ధ్వజమెత్తారు.

దుష్ప్రచారంతో ప్రభుత్వాలు ఎంత మాయచేస్తాయో, ప్రజల్ని ఎలా మోసగిస్తాయో చెప్పడానికి జగన్ రెడ్డే నిదర్శనమని, వైసీపీ ప్రభుత్వంలో విద్యావ్యవస్థ నాశనమైనంతగా బహుశా మరే వ్యవస్థ అవ్వలేదని అశోక్ బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆర్థిక ఇబ్బందులు, లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ గతంలో టీడీపీ ప్రభుత్వం 19 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఆర్థిక సాయం అందించింది. మొత్తం బడ్జెట్లో 1.43 శాతం నిధులు విద్యార్థుల విద్యకోసం వెచ్చించింది. బడ్జెట్ కేటాయింపులు, రాష్ట్ర ఆదాయం, అప్పులు అన్నీ పెరిగినా, బడ్జెట్లో ఫీజు రీయింబర్స్ మెంట్ కు జగన్ రెడ్డి ఖర్చుపెట్టింది కేవలం 0.93శాతం నిధులు మాత్రమే. కేటాయింపులు తగ్గిం చడంతో పాటు విద్యార్థుల సంఖ్యను కూడా వైసీపీప్రభుత్వం తగ్గించింది. కేవలం 9.8 లక్షల మందికే ఫీజు రీయింబర్స్ మెంట్ ఇస్తోంది. ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ సహా ఇతర వృత్తి, సాంకేతిక విద్యా కోర్సులు అభ్యసించే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ అందుతుంది. టీడీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ సొమ్మును సంవత్సరంలో ఒకేసారి నేరుగా విద్యాసంస్థలకు చెల్లించింది. దాంతో విద్యార్థులు నేరుగా విద్యాభ్యాసంపై దృష్టి పెట్టి, శ్రద్ధతో చదవడంతో మంచి ఫలితాలు వచ్చాయని ఆయన తెలిపారు.

## విడతలవారీ చెల్లింపులతో ఇబ్బందులు

జగన్ రెడ్డి హయాంలో అందుకు భిన్నంగా ఫీజు రీయింబర్స్ మెంట్ సొమ్ముని తల్లుల బ్యాంక్ ఖాతాల్లో వేయడం ప్రారంభించారు. ప్రభుత్వం తల్లులకు డబ్బులిస్తే, వారు విద్యా సంస్థలకు చెల్లించాల్సిన పరిస్థితి. వైసీపీప్రభుత్వం ఒకేసారి చెల్లించాల్సిన సొమ్ముని సంవత్సరంలో నాలుగు సార్లుగా ఇస్తోంది. ఏడాదికి నాలుగుసార్లు సక్రమంగా ఇస్తున్నారా అంటే.. అదీలేదు. 2019-20లో వైసీపీప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఫీజు రీయింబర్స్ మెంట్ పూర్తిగా ఎగ్గొట్టారు. 2020-21లో నాలుగు వాయిదాలకు ఒక వాయిదా ఎగ్గొట్టారు. 2021-22, 2022-23 లో అరకొరగా చెల్లించి చేతులు దులుపు కున్నారు. 2023-24 విద్యాసంవత్సరం మెదలైన తరుణంలో గత విద్యా సంవత్సరానికి సంబంధించి మూడో విడత చెల్లించారు. తల్లులకు ఫీజు రీయింబర్స్ మెంట్ సొమ్ము ఇవ్వడం వల్ల పిల్లల ఫీజుల్ని సకాలంలో చెల్లించలేకపోతున్నారు. 80శాతం మంది తల్లులు ప్రభుత్వ మిచ్చిన సొమ్ముని ఇచ్చినట్టే విద్యాసంస్థలకు చెల్లించలేకపోతున్నారు. దాంతో విద్యాసంస్థల యాజమాన్యాలు మొత్తం ఫీజులు కట్టేవరకు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదు. తల్లుల కు డబ్బులిచ్చాం.. అంత ఇచ్చాము.. ఇంత ఇచ్చామని పత్రికల్లో, ప్రసారమాధ్యమాల్లో ప్రకటనలు ఇవ్వడం తప్ప, క్షేత్రస్థాయిలో దానివల్ల విద్యార్థులకు నష్టమే జరుగుతోందని అశోక్ బాబు తెలిపారు.

## ఫీజు రీయింబర్స్ మెంట్ సక్రమంగా చెల్లిస్తే, విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గుతుంది?

కేవలం విద్యాసంస్థల్ని, విద్యార్థుల్ని ఇబ్బంది పెట్టడానికే జగన్ రెడ్డి ఫీజు రీయింబర్స్ మెంట్ సొమ్మును విడతలవారీగా చెల్లిస్తున్నాడు. అనేక నిబంధనలతో ఏటికేడు విద్యార్థుల సంఖ్యలో



కోతపెడుతున్నాడు. తొలుత 11 లక్షల మందికి ఫీజు రీయింబర్స్ మెంట్ ఇచ్చిన జగన్ రెడ్డి సర్కార్, ఆ సంఖ్యను ఇప్పుడు 9.8లక్షలకు కుదించింది. విద్యుత్ ఛార్జీలు, నాలుగు చక్రాల వాహనం, ఇంటి విస్తీర్ణం ఎక్కువ ఉందనే అర్థంపర్థం లేని నిబంధనలతో విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల చెల్లింపుల్లో జరిగే అనర్థాలతో ప్రతి ఏటా విద్యనభ్యసించే విద్యార్థులు సంఖ్య తో పాటు, నాణ్యమైన విద్యాబోధన, ఉత్తీర్ణతాశాతం తగ్గుతున్నాయి. టీడీపీ ప్రభుత్వంలో ఇంటర్ ఉత్తీర్ణతా శాతం 74శాతం పైనే ఉంది. ఒక సంవత్సరం 77శాతం వరకు వచ్చింది. ఈ ప్రభుత్వంలో అది 72 శాతానికే పరిమితమైంది. పత్రికల్లో, ప్రచార సభల్లో ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లింపులపై ఊదరగొడుతున్న ప్రభుత్వం, ఉత్తీర్ణతా శాతం తగ్గడంపై ఏం సమాధానం చెబుతుంది? ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లింపులకు సంబంధించి వాస్తవాలతో శ్వేతపత్రం విడుదలచేయాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేస్తున్నాం. నాలుగేళ్లలో ఎందరు తల్లులఖాతాల్లో ఎంత సొమ్ము, ఎన్ని విడతల్లో ఇచ్చాడో జగన్ రెడ్డి చెప్పాలని తెదేపా నేత డిమాండ్ చేశారు.

## ప్రాథమిక విద్యకు దూరమైన 7లక్షల మంది విద్యార్థులు

రాష్ట్రంలో మంచి కళాశాలల్లో ఇంజనీరింగ్ సీట్లు రావన్న ఉద్దేశంతో చాలామంది విద్యార్థులు తెలంగాణ, తమిళనాడుకు వెళ్లిపోయారు. ఫీజు రీయింబర్స్ మెంట్ తల్లుల కు ఇస్తున్న ప్రభుత్వవిధానంతో యాజమాన్యాలు విద్యాసంస్థల్ని నిర్వహించలేని స్థితికి వచ్చాయి. అలానే జీవోనెం-77తో జగన్ రెడ్డి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వకుండా ఎగ్గొట్టాడు. సదరు జీవోతో ఎయిడెడ్ కళాశాలల్లో పీజీ చదివే వారికే ఫీజు రీయింబర్స్ మెంట్ రాకుండా పోయింది. అలానే జాతీయ విద్యావిధానం పేరుతో ప్రాథమిక స్కూళ్లను తీసేయడంతో దాదాపు 2లక్షల డ్రాపవుట్స్ పెరిగాయి. ఇలాంటి నిర్ణయాలతో విద్యావ్యవస్థను పూర్తిగా నాశనం చేసిన జగన్ రెడ్డి విద్యారంగానికి తమ ప్రభుత్వం రూ.11 లక్షలకోట్లు ఖర్చు పెట్టిందని చెప్పాడు. టీడీపీప్రభుత్వంతో పోలిస్తే, నిధుల కేటాయింపు ఈ ప్రభుత్వంలో తగ్గినా జగన్ నిస్సిగ్గుగా సమర్థించుకుంటున్నా డు. ఫీజు రీయింబర్స్ మెంట్ సొమ్ము తల్లులకు ఇచ్చినట్టే, ఆరోగ్య శ్రీ సాయాన్ని నేరుగా పేదలకు ఇచ్చే ధైర్యం ముఖ్యమంత్రి చేయగలడా? విద్యావిధానంలో ఒకలా... ఆరోగ్యశ్రీలో మరోలా వ్యవహరించడం జగన్ రెడ్డి ద్వంద్వనీతికి నిదర్శనమని చెప్పారు.

## నాలుగేళ్లలో విద్యారంగ పరిపుష్టికి జగన్ రెడ్డి ఎలాంటి చర్యలు తీసుకోలేదు

జాతీయ విద్యావిధానం నిబంధనలను దేశంలో ఏ రాష్ట్రం అమలుచేయకపోయినా వైసీపీ ప్రభుత్వం అమలుచేస్తోంది. కేవలం ఎఫ్.ఆర్.బీ.ఎం అప్పులపరిమితి పెంచుకో వడానికే జగన్ రెడ్డి జాతీయ విద్యావిధానం అమలుకు సిద్ధమయ్యాడు. టీడీపీప్రభుత్వం సమర్థవంతంగా అమలుచేసిన విదేశీవిద్య పథకాన్ని జగన్ రెడ్డి కొంగకు పళ్లెంలో పెట్టిన విధంగా నీరుగార్చాడు. విద్యారంగం పరిపుష్టికి నాలుగేళ్లలో ఎలాంటి చర్యలు తీసుకోని జగన్ రెడ్డి, వేలకోట్ల నిధులు కేటాయించానని చెప్పడం కేవలం ప్రచార ఆర్భా టమే. వందలకోట్ల ప్రజల సొమ్ము ప్రచారానికి దుర్వినియోగం చేస్తూ, దుష్ప్రచారంతో ప్రజల్ని వంచిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఒక్కడే. గత ప్రభుత్వాల బకాయిలు తరువాత వచ్చే ప్రభుత్వాలు చెల్లించడం ఎప్పటినుంచో ఉన్న ఆనవాయితీనే. జగన్ రెడ్డి చేస్తున్న మోసాలు, దుష్ప్రచారాన్ని ప్రజలు గ్రహించారు." అని అశోక్ బాబు చెప్పారు.

# భూమనా... నీది ఏ మతం?



**- ప్రమాణం చేసి హిందువునని చెప్పగలవా?**

**- జగన్ రెడ్డి, భూమన తిరుమల పవిత్రతను మంటగలుపుతున్నారు**

**- టీటీడీ సభ్యుల్లోని కళంకితుల్ని తక్షణమే తొలగించాలన్న బుచ్చిరామ్ ప్రసాద్**

అమరావతి (చైతన్యరథం): హిందూమతంపై, తిరుమల తిరుపతి దేవస్థానంపై ముఖ్యమంత్రికి ఏమాత్రం గౌరవం లేదు అనడానికి నాలుగేళ్ల వైసీపీ పాలనలో జరిగిన ఘటనలే నిదర్శనమని, కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామిపై, లేదా ఆయన నమ్మే ఏదైనా పవిత్ర మత గ్రంథంపై ప్రమాణం చేసి, తాను హిందువునని చెప్పగల దమ్ము, ధైర్యం టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డికి ఉన్నాయా అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుచ్చిరామ్ ప్రసాద్ సవాల్ చేశారు. సోమవారం మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... వేంకటేశ్వరస్వామి ఆలయ పవిత్రతకు జరుగుతున్న భంగంపై ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను అనుసరించే మతమేదో చెప్పకుండా, తాను గతంలో టీటీడీ ఛైర్మన్ గా ఉన్నప్పుడు అవిచేశాను... ఇవిచేశానని దాటవేత ధోరణితో కరుణాకర్ రెడ్డి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. శేషాద్రి కొండల ప్రాశస్త్యం, గొప్పతనం తెలుసుకోకుండా కరుణాకర్ రెడ్డి వాటిని బోడికొండలని చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. శేషాచలంపై మునులు, దేవతలు నడయాడి, సాక్షాత్తూ ఆ వేంకటేశ్వరస్వామిని పూజించారని ప్రతీతి. స్వయంగా కలియుగ పరంధాముడే ఆ కొండలపై తిరుగాడారని చెప్పుకుంటారు. వృషభాద్రి, నీలాద్రి, గరుడాద్రి, అంజనాద్రి, శేషాద్రి, నారాయణాద్రి, వేంకటాద్రి అని ఏడుకొండలకు ఏడు పేర్లున్నాయి. ఒక్కో కొండకు ఒక్కో ప్రాశస్త్యం, ఒక్కో ఘన చరిత్ర ఉన్నాయి. అటువంటి ఏడు కొండలను గతంలో కరుణాకర్ రెడ్డి రెండుకొండలుగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది నిజంకాదా అని రామ్ ప్రసాద్ ప్రశ్నించారు.

## టీటీడీ బోర్డులోని సభ్యులపై కేసులున్నది నిజంకాదా?

టీటీడీ (తిరుమల తిరుపతి దేవస్థానం) సభ్యులుగా నియమితులైన వారికి నేరచరిత్ర ఉన్నది నిజంకాదా? వైసీపీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుపై 16 కేసులు, తిప్పేస్వామి పై భూకబ్జా కేసులు, శరత్ చంద్రారెడ్డిపై లిక్కర్ స్కామ్ కేసులు, కేతన్ దేశాయ్ పై కేసులు ఉన్నది నిజంకాదా? టీటీడీ బోర్డు సభ్యుల ప్రయాణ ఖర్చులు బోర్డే భరించాలి. అందువల్లే గతంలో ఏప్రభుత్వం ఏపీ చుట్టుపక్కల రాష్ట్రాల వారిని తప్ప, ఇతర రాష్ట్రాల వారిని బోర్డు సభ్యులుగా నియమించలేదు. గతంలో టీటీడీ సభ్యులుగా ఉన్న 14 మందిపై కేసులు, నేరచరిత్ర ఉన్నాయని తెదేపా నేత తెలిపారు.

## మర్యాదలు, సాంప్రదాయాలు పాటించని జగన్ రెడ్డి

జగన్మోహన్ రెడ్డి, వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లిన ప్రతిసారీ అక్కడి రిజిస్టర్లో తాను హిందుమతాన్ని గౌరవిస్తానని, స్వామివారిపై భక్తిశ్రద్ధలు ఉన్నాయని ధృవీకరించు కుంటూ ఏనాడు ఎందుకు సంతకం పెట్టలేదు? సతీసమేతంగా స్వామివారికి పట్టు వస్త్రాలు ఎందుకు సమర్పించలేదు? నాలుగున్నరేళ్లలో ఏ హిందూదేవాలయానికి అయినా జగన్ రెడ్డి సతీసమేతంగా వెళ్లాడా? జగన్ రెడ్డికి హిందూమతంపై గౌరవం ఉందంటే ఎలా నమ్మాలి?

ముంబైకి చెందిన ఓ కంపెనీ రూ.300కోట్లతో పిల్లల ఆసుపత్రి నిర్మిస్తామంటే సదరు కంపెనీకి 10 ఎకరాలు కేటాయించి నిర్మాణం చేపట్టమన్నారు. రూ.2లక్షల మూలధనం కూడా లేని సదరుకంపెనీ రూ.300కోట్లతో ఆసుపత్రి నిర్మాణం చేపడుతుందంటే ఎలా నమ్మారు...ఎలా ఎంపికచేశారు? మేం క్షేత్రస్థాయిలో పరిశీలించి జరిగిన వ్యవహారంపై నిలదీయడంతో, సదరు కంపెనీని పక్కన పెట్టినట్టు టీటీడీ చెప్పింది. తరువాత టీటీడీనే స్వయంగా నిర్మిస్తుందని చెప్పి, ముఖ్యమంత్రితో ఆసుపత్రి నిర్మాణానికి శంఖుస్థాపన చేయించారు. ఇది జరిగి రెండేళ్లు అవుతున్నా.. అనాడు జరిగిన తప్పిదాలపై టీటీడీ ఎందుకు స్పందించడంలేదని రామ్ ప్రసాద్ ప్రశ్నించారు.

తన కుమారుడు చనిపోయిన 11 రోజులకే టీటీడీ ఈవో ధర్మారెడ్డి స్వామివారి ఆలయా నికి వచ్చింది నిజంకాదా? హిందూ ధర్మానికి విరుద్ధంగా ధర్మారెడ్డి అలా చేయడం ఎం తవరకు సబబు? మైల ఉన్న ఇంటినుంచి రాకూడదని తెలిసినా, ధర్మారెడ్డి స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి పవిత్రతను, ఆలయ నియమనిష్టలను మంటగలిపారు. దీనిపై ముఖ్యమంత్రి ఏం సమాధానం చెబుతారని తెదేపా నేత నిలదీశారు.

ఇలాంటి ఘటనలు చూశాక హిందూమతం ప్రాశస్త్యాన్ని, పవిత్రతను మంటగలపడమే ధ్యేయమన్నట్లుగా టీటీడీ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. టీటీడీ చేసే తప్పులకు ముఖ్యమంత్రే బాధ్యులవుతారు. టీటీడీ బోర్డు 1930లో ఏర్పాటైంది. 93ఏళ్లుగా ఆ బోర్డు ఒక పద్ధతిప్రకారం, పవిత్రతతో పనిచేస్తోంది. కానీ జగన్ రెడ్డి ఏలుబడిలోనే సదరు బోర్డులో ఏనాడు జరగని అక్రమాలు, తప్పులు జరుగుతు న్నాయి. టీటీడీ బోర్డు సభ్యులుగా నియమించిన కళంకితుల్ని జగన్ రెడ్డి తక్షణమే తొలగించాలని బుచ్చిరామ్ ప్రసాద్ డిమాండ్ చేశారు.

# టీడీపీ ఇసుక మార్చ్ సక్సెస్

- రాష్ట్ర వ్యాప్తంగా 67 క్వారీలను గుర్తించగా 44 ప్రధాన క్వారీలలో 'ఇసుక సత్యాగ్రహం' కార్యక్రమం
- అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలతో అడ్డుకునేందుకు కుట్ర
- ఇసుక అనుమతులు, తవ్వకాల లెక్క తేల్చాలని టీడీపీ నేతల పట్టు
- రాష్ట్ర వ్యాప్తంగా 'ఇసుక సత్యాగ్రహం' పేరుతో టీడీపీ శ్రేణుల నిరసనల హోరు
- ఇసుక దొంగలను అరెస్టు చేసి.. ఉచిత ఇసుక విధానం తీసుకురావాలంటూ డిమాండ్
- జగన్ రెడ్డి ఇసుక దోపిడీతో 123 వృత్తులు, వ్యాపారాలు రోడ్డున పడ్డాయి
- 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల నోట్లో జగన్ రెడ్డి మట్టి కొట్టారు



జేసిబిని అడ్డుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న పార్టీ శ్రేణులు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో జరుగుతున్న ఇసుక అక్రమాలపై తక్షణమే ప్రభుత్వం స్పందించాలని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు


ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ నేతల ఇసుక సత్యగ్రహ నిరసన

నారా చంద్రబాబు నాయుడు 48 గంటల గడువు ఇచ్చినా ప్రభుత్వం స్పందించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు రోడ్డెక్కాయి. మూడు రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా తొలి రోజు రాష్ట్రంలోని ఇసుక ర్యాంపుల వద్ద ప్లకార్డులు పట్టుకుని అక్రమ ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కొండలను తలపించేలా ఉన్న ఇసుక గుట్ట(డంప్)లను పరిశీలించారు. ప్రకృతిని నాశనం చేస్తూ, పర్యావరణాన్ని విధ్వంసం చేస్తూ ఇసుక తవ్వకాలు జరిపి వాటిని బ్లాక్ మార్కెట్లో అమ్ముకోవడాన్ని తప్పుబట్టారు. అక్రమ క్వారీలకు సంబంధించిన ఆధారాలను మీడియాకు వెల్లడించారు. టెండర్లు పిలవకుండా, కొత్త ఏజెన్సీ ఎంపిక చేయకుండా, ఎన్జీటీ విధించిన నిషేధాజ్ఞలను పట్టించుకోకుండా రాష్ట్రంలో జరుగుతున్న ఇసుక అక్రమ మైనింగ్, ఇసుక ర్యాంపులు ఏర్పాటు చేసుకుని అధిక ధరలకు ఇసుకను అమ్ముకుంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఉచితంగా ఇసుక అందిస్తే విమర్శించిన జగన్ రెడ్డి, నేడు పందికొక్కులా ఇసుక మొత్తాన్ని బొక్కేస్తున్నాడని, పేదలకు ఇసుక అందని ద్రాక్షలా తయారు చేశారంటూ మండిపడ్డారు. దీంతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు రోడ్డెక్కకుండా పోలీసులతో అడ్డుకునే ప్రయత్నం చేయడాన్ని తప్పుబట్టారు.

## అరెస్టులు, గృహ నిర్బంధాలు

ఆమదాలవలసలో కూన రవికుమార్, నరసన్నపేటలో బగ్గు రమణమూర్తి, మచిలీపట్నంలో కొనకళ్ల నారాయణ, పెడనలో కాగిత కృష్ణప్రసాద్, పెనమలూరులో బోడె ప్రసాద్, పామర్రులో వర్ల కుమార్ రాజా, అవనిగడ్డలో మండలి బుద్ధప్రసాద్, కళ్యాణదుర్గంలో ఉమామహేశ్వర నాయుడు, కురుపాంలో తొయ్యక జగదీశ్వరి, వేమూరులో నక్కా ఆనందబాబు, గుంటూరు పశ్చిమలో కోవెలమూడి రవీంద్ర, కోవూరులో పోలంరెడ్డి దినేష్ రెడ్డి, జగ్గయ్యపేటలో శ్రీరాం తాతయ్య, నందిగామలో తంగిరాల సౌమ్య, విజయవాడ తూర్పులో గద్దె రామ్మోహన్‌లను కార్యక్రమానికి వెళ్తుండగా అడ్డుకున్నారు.

మైలవరంలో దేవినేని ఉమామహేశ్వరరావు, చిలకలూరిపేటలో



తెనాలి నియోజకవర్గంలోని ఇసుక దిబ్బలను వద్ద ఆలపాటి రాజా ఆధ్వర్యంలో నిరసన

ప్రత్తిపాటి పుల్లారావు, తాడికొండలో తెనాలి శ్రావణ్ కుమార్, పెదకూరపాడులో కొమ్మాలపాటి శ్రీధర్, తిరువూరులో శావల దేవదత్, కొవ్వూరులో గొర్రెల శ్రీధర్, కంఠమనేని రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బారాయ చౌదరిలను ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు.

**నెల్లూరు రూరల్‌లో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, కావలి నియోజకవర్గంలో మాలేపాటి సుబ్బారాయుడు, నెల్లూరు సిటీలో కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, తెనాలిలో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను హౌస్ అరెస్ట్ చేశారు.**


ఇసుక సత్యగ్రహ నిరసనకు బయలుదేరిన కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి అడ్డుకుంటున్న పోలీసులు రోడ్డుపై బైఠాయింపు

రాష్ట్రంలో ఎక్కడైనా ఇసుక తవ్వకాలు చేపట్టాలంటే ముందుగా గనుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు తీసుకుని, వాటిని పరిశీలించి కేంద్ర ఆధీనంలో ఉండే స్టేట్ లెవల్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ (ఎస్ఇఏఏ) ఏడాదికి మాత్రమే అనుమతిస్తుంది. ఆ నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ఇసుక రీచుల్ని మూడు జోన్లుగా విభజించి జేపీ పవర్స్ అనే సంస్థకు గంపగుత్తగా


గుంతకల్లులో ఇసుక మాఫియా అగడాలను సెల్ఫీ ద్వారా ప్రశ్నిస్తున్న టీడీపీ నేతలు జిత్తేందర్ గౌడ్, వైకుంఠం ప్రభాకర్

కట్టబెట్టడం ద్వారా అక్రమాలకు పాల్పడ్డారని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఉచితంగా ఇసుక అందిస్తే జగన్ రెడ్డి ఇసుక మొత్తాన్ని గంపగుత్తగా చేతుల్లోకి తీసుకుని సామాన్యులు ఇసుక కొనుగోలు చేయాలంటేనే భయపడే పరిస్థితి కల్పించారన్నారు. జేపీ పవర్ వెంచర్స్ ఇసుక కాంట్రాక్టు 12.05.2023తో ముగిసింది. 06.06.2023న జీఎస్టీ నెంబర్ సస్పెండ్ అయింది. అగ్రిమెంట్ ముగిసినా, జీఎస్టీ నెంబర్ సస్పెండైనా, అదే కంపెనీ పేరుతో, అదే జీఎస్టీ నెంబర్‌తో దొంగ వే బిల్లులు ఇచ్చి మరీ ఇసుక అమ్మకాలు ఎలా సాగుతున్నాయని ప్రశ్నించారు. ఈ దందా వెనుక సీఎం జగన్ రెడ్డి హస్తం ఉందన్నారు. రీచుల్లో వే బిల్లులు, సీసీ కెమెరాలు లేకపోయినా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవం లేదని నిలదీశారు. రాష్ట్ర వ్యాప్తంగా అనుమతులున్న 110 రీచుల్లో ఏడాదికి కేవలం 77 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలకు మాత్రమే అనుమతులున్నాయి. కానీ అనధికారికంగా సగటున ఏటా 15 కోట్ల క్యూబిక్ మీటర్ల చొప్పున ఇసుక తవ్వకాలు జరిపి నాలుగేళ్లలో 60 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వేశారన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లెక్క ప్రకారం చూసుకున్నా నాలుగేళ్లలో రూ.45,750 కోట్ల విలువైన ఇసుక అమ్మకాలు జరిగాయని, ఆ సొమ్ము ఎవరి ఖాతాల్లోకి వెళ్లిందో చెప్పాలని డిమాండ్ చేశారు. తీసుకున్న అనుమతులకు, జరిగిన తవ్వకాలకు ఏమాత్రమూ పొంతన లేకుండా పోయిందన్నారు. అడ్డగోలుగా జరుగుతున్న ఇసుక తవ్వకాలతో రాష్ట్రంలో పర్యావరణ విధ్వంసం జరుగుతోందని ఎన్జీటీ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు జరిమానా కూడా విధించింది. సుప్రీంకోర్టు కూడా రాష్ట్రంలోని అక్రమాలపై అసహనం వ్యక్తం చేసింది



మైలవరంలో ఆందోళన వ్యక్తం చేస్తున్న దేవినేని ఉమా, టీడీపీ నేతలు, కార్యకర్తలు

అయినా ప్రభుత్వ పెద్దలు ఎందుకు నోరెత్తడం లేదని నేతలు ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 67 క్వారీలను గుర్తించగా 44 క్వారీలలో 'ఇసుక సత్యాగ్రహం' విజయవంతంగా జరిగింది. మిగిలిన చోట్ల పోలీసులు అడ్డుకోవడంతో జరగలేదు.

ఈ కార్యక్రమాల్లో గుమ్మిడి సంధ్యారాణి, కూన రవికుమార్, పల్లా


పామర్రు నియోజకవర్గంలో వర్ల కుమార్ రాజా ఆధ్వర్యంలో నిరసన

శ్రీనివాసరావు, మాజీ మంత్రులు కొండ్రు మురళీ మోహన్, బండారు సత్యన్నారాయణమూర్తి, కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, వేగుళ్ల జోగేశ్వరరావు, డోలా బాలవీరాంజనేయ స్వామి, శాసన మండలి మాజీ వైస్ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగ్రాయుడు, మాజీ ఎమ్మెల్యేలు గిడ్డి ఈశ్వరి, వంతల రాజేశ్వరి, గుండ లక్ష్మీదేవి, కొండపల్లి అప్పలనాయుడు, కోళ్ల లలితకుమారి, గండి బాబ్జి, బండారు సత్యానందరావు, బోడే ప్రసాద్, శ్రీరాం రాజగోపాల్, పాశిం సునీల్ కుమార్, సుగుణమ్మ, ప్రభాకర్ చౌదరి, ఆర్.జితేందర్ గౌడ్, గౌరు చరితారెడ్డి,బి.సి.జనార్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.ఎన్.రాజసింహులు, పుత్తా నరసింహారెడ్డి, 2019 ఎంపీ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్, నియోజకవర్గ ఇంఛార్జిలు గౌతు శిరీష, కోరాడ రాజబాబు, బత్తుల తాతయ్య బాబు, పి.వి.జి కుమార్, మద్దిపాటి వెంకట్రాజు, వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్, వేగేశన నరేంద్రవర్మ, పోలంరెడ్డి దినేష్ రెడ్డి, హెలెన్, బొజ్జల సుధీర్ రెడ్డి, కలికిరి మురళీమోహన్, అమీర్ బాబు, జి.వి.ప్రవీణ్ రెడ్డి, పరిటాల శ్రీరామ్, మన్నె సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఇసుకలో పడుకుని నిరసన తెలుపుతున్న బత్యాల చంగల్ రాయుడు

# ఇసుకాసురుల ఆగడాలపై టీడీపీ రాష్ట్రవ్యాప్తంగా సత్యాగ్రహ దీక్షలు



### ఇసుక దొంగలను అరెస్ట్ చేయాలి : నందం అబద్ధయ్య

మంగళగిరి (చైతన్యరథం): ఇసుక అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయాలంటూ నియోజకవర్గంలోని తాడేపల్లి మండలం, గుండిమెడ ఇసుక క్వారీ వద్ద టీడీపీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. కొండల మాదిరిగా నిల్వచేసిన ఇసుక పైకి ఎక్కి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇసుక దొంగలను అరెస్ట్ చేసి, ఉచిత ఇసుక విధానాన్ని తీసుకురావాలంటూ డిమాండ్ చేశారు. ఇసుక కుంభకోణంలో జగన్ రెడ్డి దోపిడీ రూ.40,000 కోట్లు అని, టీడీపీ తెచ్చిన ఉచిత ఇసుక విధానం రద్దుతో 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు, 125 వృత్తులు, వ్యాపారాలు కుదేలయ్యాయని నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.



### అవనిగడ్డ ఇసుక సత్యాగ్రహంలో ఉద్రిక్త వాతావరణం

అవనిగడ్డ (చైతన్యరథం): టీడీపీ నేతలు చేపట్టిన ఇసుక సత్యాగ్రహం దీక్షలో ఉద్రిక్త చోటుచేసుకుంది. శాంతియుతంగా చేపట్టిన దీక్షను పోలీసులు అడ్డుకోవడాన్ని మండలి బుద్ధ ప్రసాద్ తీవ్రంగా హెచ్చరించారు. కృష్ణా జిల్లా, ఘంటసాల మండలంలోని శ్రీకాకుళం వద్ద కృష్ణానదిలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ఎంపీ కొనకళ్ల నారాయణ రావు, నేతలు బోడే ప్రసాద్, వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్ కలిసి ఆయన ఇసుక సత్యాగ్రహం దీక్ష చేపట్టారు. టీడీపీ నాయకుల ప్రసంగాలను ఘంటసాల ఎస్ఐ శ్రీనివాసు అడ్డుకోవడాన్ని బుద్ధ ప్రసాద్ ఖండించారు. సాయంత్రంలోగా ఎస్ఐ బాధ్యత తీసుకుని అన్ని అనుమతులు చూపాలనీ.. లేకుంటే ఘంటసాల పోలీసుస్టేషన్ ఎదుట నిరాహార దీక్ష చేపడతామని బుద్ధ ప్రసాద్ హెచ్చరించారు. మేలో జేపీ సంస్థ గడువు పూర్తయితే ఎలా రవాణా చేస్తున్నారని బుద్ద ప్రసాద్ ప్రశ్నించారు.



### ఇసుక అక్రమ రీచ్‌లను అడ్డుకున్న పుత్తా

కమలాపురం (చైతన్యరథం): కడప జిల్లాలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలను టీడీపీ నేతలు అడ్డుకున్నారు. కమలాపురం నియోజకవర్గం, వల్లూరు మండలం, ఆదినమ్మాయ పల్లెలో ఉన్న ఇసుక గుట్టల వద్ద టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ఆందోళన చేపట్టారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న ఆయన... వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఇసుకలో రూ. 40 వేల కోట్లు దోచేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ లింగారెడ్డి, ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ నేత ఉక్కు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



### గుంటూరులో దేగల ప్రభాకర్ హౌస్ అరెస్ట్

గుంటూరు (చైతన్యరథం): వైసీపీ నాయకుల అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునేందుకు గుంటూరు నుంచి బయలుదేరిన గుంటూరు నగర అధ్యక్షులు దేగల ప్రభాకర్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అక్రమ మైనింగ్ ప్రాంతాన్ని సందర్శనకు వెళ్తున్నా పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు.

### ఎన్టీఆర్ జిల్లా/నందిగామ నియోజకవర్గం /కంచికచర్ల మండలం



నందిగామ (చైతన్యరథం): అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకోవడమే లక్ష్యంగా పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన ఇసుక సత్యాగ్రహం కార్యక్రమానికి బయలుదేరిన టీడీపీ నేతలు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, తంగిరాల సౌమ్య, కనపర్తి శ్రీనివాసరావు, టీడీపీ శ్రేణుల్ని కంచికచర్ల మండలం గనిఆత్కూరు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అక్రమ ఇసుక రవాణాను వెంటనే నిలుపుదల చేయాలంటూ ఈ సందర్భంగా నేతలు డిమాండ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా పక్క రాష్ట్రాలకు టన్నుల కొద్ది కోట్ల రూపాయల విలువైన ఇసుకను అధికార పార్టీ నేతలు తరలించుకుపోతున్నారని అన్నారు. ఇసుక అక్రమ రవాణాను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. "ఇసుక సుర - జగనాసుర" అంటూ రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు.



### కొవ్వూరు ఇసుక ర్యాంప్ వద్ద టీడీపీ నేతల ఆందోళన

కొవ్వూరు (చైతన్యరథం): కొవ్వూరు నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు అధ్వర్యంలో కుమారదేవం గ్రామంలోని ఇసుక ర్యాంప్ వద్ద టీడీపీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుకలో జగన్ రెడ్డి నాలుగున్నరేళ్లలో రూ.40 వేల కోట్లు దోచేశారని మండిపడ్డారు. ఇసుక తవ్వకాలపై ఎటువంటి అనుమతులు లేకపోయినా నదిలో నుంచి భారీగా ఇసుక బయటకు తోడుతున్నారని, వెంటనే అక్రమ ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, గోపాలపురం టీడీపీ ఇన్ ఛార్జ్ మద్దిపాటి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు. ఇసుక ఇలాగే అక్రమ రవాణా ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఈ సందర్భంగా నేతలు హెచ్చరించారు.



### టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఉచిత ఇసుక

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తామని మాజీ శాసనసభ్యులు వైకుంఠ ప్రభాకర్ చౌదరి వెల్లడించారు. సోమవారం పార్టీ ఆదేశాల మేరకు పామిడి మండలం నీలూరు ఇసుక రీచ్‌ను గుంతకల్లు టీడీపీ ఇన్‌ఛార్జ్ జితేంద్ర గౌడ్‌తో కలిసి సందర్శించారు. ఇసుకలో జగన్ రెడ్డి ప్రభుత్వం రూ.40 వేల కోట్లు దోచుకుందన్నారు. అనుమతులు లేకుండా చేపట్టిన ఇసుక తవ్వకాలను వెంటనే నిలుపదల చేయాలని డిమాండ్ చేశారు.

### కూన రవికుమార్‌ను అడ్డుకున్న పోలీసులు



ఆముదాలవలస నియోజకవర్గం పొందూరు మండలం సింగూరు ఇసుక ర్యాంప్‌ల పరిశీలన కోసం వెళ్ళిన శ్రీకాకుళం జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ అధ్యక్షులు కూన రవికుమార్ ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ఇసుక అక్రమ రవాణా లేకపోతే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలని కూన రవికుమార్ డిమాండ్ చేశారు.



### ప్రభుత్వ ఇసుక విధానం దోపిడీగా మారింది...

వైసీపీ ప్రభుత్వమే హోల్ సేల్ దోపిడీ చేస్తుంది : బండారు సత్యానందరావు

కొత్తపేట (చైతన్యరథం): ఇసుక విధానం అవినీతిమయంగా మారిందని, జగన్ ప్రభుత్వమే హోల్ సేల్ దోపిడీ చేస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, నియోజకవర్గ ఇంఛార్జ్ బండారు సత్యానందరావు ఆరోపించారు. రావులపాలెం మండలం రావులపాడు శివారు మల్లయ్యదొడ్డి జాతీయ రహదారి సమీపంలోని ఇసుక స్టోరేజీ వద్ద జగన్ ప్రభుత్వం ఇసుక దోపిడీ ఆపాలంటూ సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు కొత్తపేట నియోజకవర్గ పర్యటనలో భాగంగా జొన్నాడలో ఇసుక స్టోరేజ్ వద్ద సెల్ఫీ ఛాలెంజ్ విసిరి, శ్వేతపత్రాన్ని డిమాండ్ చేసినా ఇప్పటివరకూ ఈ సిగ్గులేని ప్రభుత్వం ఎలాంటి ప్రకటనా చేయలేదని గుర్తు చేశారు. మాకున్న సమాచారం ప్రకారం జేపి సంస్థకు మే నెలలోనే అనుమతులు పూర్తయ్యాయని తెలిపారు. ఏ విధంగా రాష్ట్రమంతా ఒకే సంస్థకి అనుమతులు కట్టబెట్టారో, లక్షలాది టన్నుల్లో ఇసుక స్టోరేజ్ చేయడానికి అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఉంటే ఆ అనుమతులను బయటపెట్టాలని లేని పక్షంలో ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటుందో రాష్ట్ర ప్రజలందరికీ తెలియజేయాలని డిమాండ్ చేశారు.




### అక్రమ మైనింగ్‌కు నిరసనగా గూడురులో పాశం సునీల్ ఆందోళన

గూడూరు (చైతన్యరథం): రాష్ట్రంలో జరుగుతున్న ఇసుక అక్రమ మైనింగ్ కు నిరసనగా రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు కోట మండలం, కేశవరం పంచాయతీ, కొండుగుంట గ్రామంలో ఉన్న ఇసుక డంప్ యార్డ్ వద్ద టీడీపీ నేతలతో కలిసి నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ పాశం సునీల్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక తవ్వకాల్లో ఎటువంటి అనుమతులు లేకున్నా వైసీపీ నేతలు ఇసుకను దోచుకుంటూ అక్రమ మైనింగ్ కు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇసుక తవ్వకాలను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.




### ఇసుక సత్యాగ్రహం కార్యక్రమంలో పాల్గొన్న గౌతు శిరీష

పలాస (చైతన్యరథం): రాష్ట్రంలో జరుగుతున్న అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆదేశాలు మేరకు జలుమూరు మండలం, పర్లం గ్రామంలో నిర్వహించిన ఇసుక సత్యాగ్రహం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మాజీ శాసన సభ్యులు ఇంచార్జ్ బగ్గు రమణమూర్తి ఆందోళనలో పాల్గొని తన సంఘీభావం తెలిపారు. టెక్కలి నియోజకవర్గ ముఖ్య నాయకులు,నరసన్నపేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ముఖ్యగమనిక**

తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న కార్యక్రమాలు ప్రతిరోజు ఈ క్రింది వాట్సాప్ నెంబర్‌కి పంపించగలరు. చైతన్యరథం పత్రికలో వాటిని ప్రచురించడం జరుగుతుంది. మీరు పంపించే కార్యక్రమాల వివరాలు ఒక ఫోటో జత చేసి పంపించగలరు

9618727040

# ఇసుకాసురుల ఆగడాలపై టీడీపీ రాష్ట్రవ్యాప్తంగా సత్యాగ్రహ దీక్షలు




### శ్రీకాళహస్తిలో ఇసుక రీచ్ వద్ద టీడీపీ నేతల ఆందోళన

శ్రీకాళహస్తి (చైతన్యరథం): రాష్ట్రంలో ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతి లేకున్నా అధికార పార్టీ నేతలు పెద్దఎత్తున దొంగ బిల్లులతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, ఒక్క ఇసుకలోనే జగన్ రెడ్డి రూ.40 వేల కోట్లు దోచుకున్నారని నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ బొజ్జల సుధీర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పార్టీ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలం, పెన్నలపాడు ఇసుక రీచ్ వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ మున్నూరు సుగుణమ్మ పాల్గొని తన సంఘీభావం తెలియజేశారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా వెంటనే నిలుపదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, తిరుపతి నగర పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చినబాబు, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ ఇసుక రవాణా పై చర్యలు తీసుకోవాలి : గుండ లక్ష్మీదేవి



శ్రీకాకుళం (చైతన్యరథం): రాష్ట్ర వ్యాప్తంగా సాగుతున్న ఇసుక దోపిడీపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నోరు విప్పాలని, సంబంధిత బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ.అదుపూ లేకుండా పోతోందని వాపోయారు. జేపీ వెంచర్స్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుని, ఇసుక రీచ్ ల నిర్వహణ అన్నది సంబంధిత సంస్థకు అప్పగించిందని, ఇప్పుడు కాల పరిమితి ముగిసినా నిబంధనలు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని ఆరోపించారు. సోమవారం బట్టేరు ఇసుక రీచ్‌ను సందర్శించారు. స్థానికులను కలిసి పలు సమస్యలు తెలుసుకున్నారు. స్థానిక వైసీపీ నాయకులకు కాసుల వాన కురిపిస్తున్న ఈ బట్టేరు రీచ్ నిర్వహణపై కలెక్టర్ స్థాయి వ్యక్తులు నిఘా ఉంచి,నిబంధనలకు తిలోదకాలు వస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ఇసుక దోపిడీపై అయితాబత్తుల ఫిర్యాదు

అమలాపురం (చైతన్యరథం): రాష్ట్రంలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను వెంటనే అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎమ్మార్వోకు, పోలీసులకు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ అయితాబత్తుల ఆనందరావు వినతి పత్రం అందజేశారు. సోమవారం అమలాపురం



పార్లమెంట్ పరిధిలోని పి.గన్నవరం మండలంలోని నాగులంక గ్రామంలోని ఇసుక రిచ్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి మెట్ల రమణ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

### సర్వేపల్లిలో వైసీపీ అక్రమ ఇసుక దోపిడిని అరికట్టాలి




వైసీపీ నాయకుల అక్రమ ఇసుక దోపిడిని అరికట్టాలని డిమాండ్ చేస్తూ సర్వేపల్లి నియోజకవర్గం కేంద్రమైన వెంకటాచలంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక అక్రమ రవాణాను వెంటనే అడ్డుకోవాలని, అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ నేతల ఆందోళనను కృష్ణపట్నం పోర్టు సిఐ వెంకటరెడ్డి, ఎస్ఐ అంజిరెడ్డి అడ్డుకుని స్టేషన్ కు తరలించారు. సైకో పాలన పోవాలి... సైకిల్ పాలన రావాలని... పెద్దఎత్తున నేతలు ఆందోళనకు దిగారు.

### బందిపోట్లను మించిన నియంత పాలన జగన్ ది



జగ్గయ్యపేట (చైతన్యరథం): రాష్ట్రంలో వైసీపీ పరిపాలన బందిపోట్లను మించిపోయిందని, జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని టీడీపీ జాతీయ కోశాధికారి, మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య వ్యాఖ్యానించారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిపక్ష పార్టీలు నిలదీస్తే అరెస్టులు, దాడులకు పాల్పడుతూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని అన్నారు. టీడీపీ పిలుపు మేరకు సోమవారం ఇసుక దందా, దోపిడీ, మాఫియాని నియంత్రించాలని జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామం వద్ద ఉన్న ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఆందోళన చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక స్టాక్ పాయింట్ దగ్గర నిరసన తెలియజేయుటకు వెళుతున్న వారిని పోలీసు వారు అరెస్ట్ చేయడం ఏ చట్టంలో ఉందని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో పోలీసులు దొంగలకి కాపలాకాయాల్సి రావడం బాధాకరమన్నారు. పోలీసుల వ్యవహార శైలి ఇకనైనా మార్చుకోవాలని రానున్నది తెలుగుదేశం ప్రభుత్వం అని, అందరికీ ఇసుక ఫ్రీగా ఇస్తామన్నారు.

### అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు



ఆత్మకూరు (చైతన్యరథం): కోర్టు ఆదేశాలను దిక్కరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇసుక అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని, దొంగ బిల్లులతో ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం ఆత్మకూరు రూరల్ మండలం, అప్పారావుపాలెం గ్రామంలోని ఇసుక రీచ్ నందు అక్రమంగా తరలిస్తున్న ఇసుకను ఆత్మకూరు రూరల్ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు అడ్డుకుని ఇసుక రీచ్ వద్ద ఆందోళన చేపట్టారు. నిబంధనల మేరకు ఒక మీటరు లోతు మాత్రమే ఇసుక తీయాల్సి ఉండగా వైసీపీ నాయకులు అక్రమంగా ఏడు మీటర్లు లోతు తీశారని మండిపడ్డారు.

### పాణ్యంలో గౌరు చరిత రెడ్డి ఆధ్వర్యంలో ఇసుక సత్యాగ్రహం



పాణ్యం (చైతన్యరథం): టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలో జరుగుతున్న ఇసుక దోపిడీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గౌరు చరితరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం టీడీపీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. బెంగళూరు జాతీయ రహదారి వద్ద ఉన్న వెంకన్న బావి ఇసుక రిచ్ ను సందర్శించిన ఆమె జగన్ ప్రభుత్వానికి సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో ఒక్క ఇసుకలోనే రూ.40 వేల కోట్లు దోచుకున్నారని చరిత రెడ్డి మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, బనగానపల్లె మాజీ శాసనసభ్యులు బీసీ జనార్దన్ రెడ్డి, డోన్ నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి, కల్లూరు మండలం ముఖ్య నాయకులు, కల్లూరు అర్బన్ వార్డ్ ఇన్‌ఛార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మొబైల్ ఫోన్ల వాడకంపై నిషేధం

### ఏపీ విద్యాశాఖ కీలక నిర్ణయం



అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో మొబైల్ ఫోన్ల వాడకంపై ఏపీ పాఠశాల విద్యాశాఖ నిషేధం విధించింది. పాఠశాలలకు విద్యార్థులు మొబైల్ ఫోన్లు తేవటంపై పూర్తి నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యాయులు సైతం తరగతి గదుల్లోకి ఫోన్లు తీసుకురాకుండా ఆంక్షలు విధించింది. టీచర్లు తరగతి గదులకు వెళ్లేముందు తమ మొబైల్స్‌ను ప్రధానోపాధ్యాయుడికి అప్పగించాలని సూచించింది. యునెస్కో విడుదల చేసిన గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ రిపోర్ట్ ఆధారంగా... బోధనకు ఎటువంటి ఆటంకం రాకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఉపాధ్యాయ సంఘాలు, ఇతర వర్గాలతో చర్చించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్టు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. నిబంధనలు ఉల్లంఘించిన ఉపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పై అధికారులు ఈ నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని ఆదేశాలు ఇచ్చింది.

## నన్ను చంపేందుకు మిలిటెంట్లతో వైసీపీ సంప్రదింపులు

### సంచలన వ్యాఖ్యలు చేసిన టీడీపీ నేత జూలకంటి బ్రహ్మనందరెడ్డి



మాచర్ల (చైతన్యరథం): నన్ను చంపేందుకు మిలిటెంట్లతో వైసీపీ సంప్రదింపులు జరుపుతుందని, 2024 ఎన్నికల్లో వైసీపీ గెలవలేదనే విషయం తెలిసే తన హత్యకు కుట్ర చేస్తున్నారని మాచర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అధికార పార్టీకి చెందిన ముఖ్య నేతలు హతమార్చేందుకు తెలంగాణలోని మిరియాలగూడెంకు చెందిన మాజీ మిలిటెంట్‌ను కలిశారని ఆరోపించారు. తనను హత్య చేసేందుకు కిరాయి హంతకులతో పనిలేదని మాచర్ల పట్టణంలో నడిరోడ్డుపై తాను ఒక్కడినే నిలబడతానని... దమ్ము, ధైర్యం ఉన్నవారు వచ్చి నేరుగా తలపడగలరా? అని సవాల్ విసిరారు. నియోజకవర్గంలో వైసీపీ అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలకు తెలుగుదేశం పార్టీకి మధ్య జరుగుతున్న పోరాటమని, అధికార వైసీపీలోనే ఎవరో ఒక అమాయక కార్యకర్తను చంపి ఆ నేరాన్ని తనపై మోపి తద్వారా నియోజకవర్గానికి, పార్టీకి దూరం చేయాలన్న ఆలోచన వైసీపీ చేస్తుందన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్ర భవిష్యత్తు కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. మాచర్ల నియోజకవర్గంలోని అధికార పార్టీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కుటుంబంలోనే దొంగ ఓట్లు ఉన్నాయని బ్రహ్మారెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్యే సొంత గ్రామం కళ్ళకుంట గ్రామంలోనే కాక పట్టణంలో సైతం కుటుంబ సభ్యుల మొత్తానికి దొంగ ఓట్లు ఉన్నాయన్నారు. ఇక తాము న్యాయబద్ధంగా గెలవలేమని తెలిసి ఈ రకమైన దుర్మార్గానికి పిన్నెల్లి కుటుంబం పాల్పడుతుందని అన్నారు. ఓటర్ జాబితాలో రెండుసార్లు ఓట్లు నమోదు కాలేదని అధికారులు ఎలా ధృవీకరించి ధ్రువీకరణ పత్రం విడుదల చేశారో అర్థం కాలేదని, అవకతవకలకు పాల్పడిన ఏ అధికారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని బ్రహ్మారెడ్డి హెచ్చరించారు. ఇటీవల అనంతపురంలోని నకిలీ ఓటరు జాబితాపై ఉదాసీనంగా వ్యవహరించిన ప్రభుత్వ అధికారిపై వేటుపడిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇటీవల మాచర్ల నియోజకవర్గం కారంపూడి మండలంలో లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# దూదేకుల సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

**తెనాలిలో దూదేకుల ఆత్మీయ సమ్మేళనం...?**

**ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్**



తెనాలి (చైతన్యరథం): దూదేకుల వారు మన రాష్ట్రంలో 18 లక్షల మంది ఉన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అందరికీ వర్తించే సంక్షేమ పథకాలతో పాటు ప్రత్యేకంగా మైనార్టీ సంక్షేమ పథకాలు అమలు చేశారు. దుల్హన్, విదేశీ విద్య, దుకాన్ ఔర్ మకాన్, చంద్రన్న తోఫాతో పాటు కమ్యూనిటీ హాల్స్ వంటి పథకాల ద్వారా వీరు లబ్ధి పొందారు. దూదేకుల యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూదేకుల కోసం ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి దూదేకుల వర్గీయులకు ఆర్థిక భరోసా కల్పించారు. దీంతో పాటు రాజకీయంగా జిల్లా పరిషత్ ఛైర్మన్, పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ ఛైర్మన్, మున్సిపల్ కార్పోరేషన్ ఛైర్మన్ లు, స్థానిక సంస్థల్లో అవకాశాలు, పార్టీ పరంగా వివిధ పదవులు ఇవ్వడం జరిగింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దూదేకుల వారికి ప్రత్యేకంగా ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదు. అలాగే రాజకీయంగా దూదేకుల వారికి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్యాయం చేసిందనే చెప్పుకోవాలి. గతంలో ఈయన తండ్రి కూడా దూదేకుల వారికి ముస్లిం మైనార్టీ రిజర్వేషన్లలో కూడా అన్యాయం చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ నేత, హెచ్.ఆర్.డి సభ్యులు ఎస్పీ సాహెబ్ అధ్యక్షతన, షేక్ చినమస్తాన్ పర్యవేక్షణలో ఆదివారం నాడు తెనాలిలో దూదేకుల వారి ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ పోలీస్ అధికారి, టీడీపీ సాధికార సమితుల రాష్ట్ర సమన్వయకర్త షేక్ షా వలి, అనంతపురం మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ చమన్ సాహెబ్ కుమారుడు డాక్టర్ ఉమర్‌తో పాటు పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. నూర్ బాషా దూదేకుల వారు మైనార్టీలతో అత్యంత పేదలు. సామాజికంగా అన్ని కులాల వారితో కలిసిమెలిసి స్నేహపూర్వకంగా ఉంటారు. గతంలో రాజశేఖర్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీల్లో పేదలైన నూర్ బాషాలకు మైనార్టీ రిజర్వేషన్లలో వీరికి అన్యాయం జరిగింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబునాయుడు గారు మైనార్టీలకు వర్తించే అన్ని సంక్షేమ పథకాలను నూర్ బాషాలకు కూడా వర్తింపజేశారన్నారు. వీరికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రత్యేక ఫెడరేషన్ కూడా ఏర్పాటుచేయడం జరిగింది. సామాజికంగా, విద్యాపరంగా, రాజకీయంగా నూర్ బాషా సామాజిక వర్గానికి న్యాయం చేసింది తెలుగుదేశం పార్టీ మాత్రమే. నేను కూడా తెనాలి నియోజకవర్గంలో ఉండే నూర్ బాషా సామాజికవర్గానికి అన్ని విధాలుగా ఉండగా ఉంటానని ఆలపాటి రాజేంద్రప్రసాద్ హామీ ఇచ్చారు.

షేక్ షా వలి మాట్లాడుతూ.. నేను రిటైర్ అయిన తర్వాత నా జాతి ఎదుర్కొంటున్న సమస్యలు తీరాలంటే టీడీపీతో మాత్రమే సాధ్యమని నేను చంద్రబాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలోకి రావడం జరిగింది. చదువుకున్న వారు, మన కులంలో మేధావులు, మన జాతికి జరుగుతున్న అన్యాయాన్ని గొంతెత్తి చాటాలని, టీడీపీలో మాత్రమే మనకు సామాజిక న్యాయం జరుగుతుందని, రాజకీయంగా అభివృద్ధి చెందాలంటే అది ఒక్క చంద్రబాబుతో మాత్రమే సాధ్యమని అన్నారు.

ఎస్పీ సాహెబ్ మాట్లాడుతూ.. అన్న ఎన్టీఆర్ తోనే సామాజిక న్యాయం ఆరంభమైందన్నారు. సంక్షేమ యుగానికి శ్రీకారం చుట్టిన మహానుభావుడు ఎన్టీఆర్ చూపిన చొరవ వల్ల తెలుగు రాష్ట్రాల్లో బడుగు, బలహీన వర్గాలు, ఎస్సీ ఎస్టీలు, మైనార్టీలు ఉన్నత స్థానాల్లో ఉన్నారని అన్నారు. అన్న గారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళుతూ చంద్రబాబు గారు మైనార్టీలలో పేదవారైన దూదేకుల సామాజిక వర్గం వారికి విద్యా, ఆర్థిక, రాజకీయ, సామాజికపరంగా చేయూత ఇచ్చారు. మైనార్టీలలో పేదవర్గానికి చెందిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంని రాష్ట్రపతిగా ఎన్నుకునే సమయంలో



చంద్రబాబు చొరవ చూపి, మద్దతుగా నిలిచి రాష్ట్రపతిని చేశారు. ఈ విషయాన్ని అబ్దుల్ కలామే స్వయంగా చెప్పారని ఎస్పీ సాహెబ్ తెలిపారు. చంద్రబాబు ద్వారానే దూదేకుల వర్గానికి న్యాయం జరుగుతుందని అన్నారు. అన్నంపెట్టే వారిని నమ్ముకోవాలని, ముద్దులు పెట్టే వారిని దూరంగా పెట్టాలని తెలిపారు. జగన్ రెడ్డి నూర్ బాషా దూదేకుల వర్గానికి చేసిందేమీ లేదు. ఎన్నికలలో వాడుకుని వదిలేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుతోనే మన అభివృద్ధి సాధ్యమని.. దూదేకుల వర్గం ఆయనకు అండగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

డాక్టర్ ఉమర్ మాట్లాడుతూ.. రాజకీయంగా నూర్ భాషాలకు చేయూతనిచ్చే పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. మా నాన్నగారికి అనంతపురం జడ్పీ ఛైర్మన్‌గా చంద్రబాబు గారు అవకాశం ఇచ్చారు. నేను ఎంబీబీఎస్ చదువుకోవడానికి కూడా ఆర్థిక సాయం చేశారన్నారు. మనవారందరూ ఐక్యమత్యంగా ఉండి తెలుగుదేశానికి అండగా నిలవాలన్నారు.

సభా కోఆర్డినేటర్ చిన మస్తాన్ మాట్లాడుతూ.. టీడీపీతోనే మన అభివృద్ధి, ఆలపాటి రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో ముందుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి షేక్ షుకూర్, దూదేకుల సయ్యద్ బాబు, అబ్దుల్ రజాక్, షేక్ బాజి, దూదేకుల బాజి, చిన వలి, షేక్ జాన్ సైదా, షేక్ దాదావలి, షేక్ బాషా, షేక్ మహబూబ్ సుభాని, షేక్ చాందూ, బాబావలి, నబీ, బాజి, పీరు, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో చిక్కిన మరో చిరుత

తిరుమల: తిరుమలలో చిరుతలను పట్టుకునేందుకు అధికారుల చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. తాజాగా మరో చిరుత బోనులో చిక్కింది. అలిపిరి కాలి నడక మార్గంలో ఏడో మైలు వద్ద ఏర్పాటు చేసిన బోనులో చిరుత చిక్కినట్టు అధికారులు తాజాగా తెలిపారు. ఈ చిరుతను బంధించేందుకు అధికారులు కొన్ని రోజులుగా విస్తృత ప్రయత్నాలు చేస్తున్నారు. చిరుత పలుమార్లు బోను వరకూ వచ్చి వెళ్లినట్టు కూడా ట్రాప్ కెమెరాల్లో కనిపించింది. ఆదివారం రాత్రి ఎట్టకేలకు ఈ చిరుత బోనులో చిక్కింది. ఇప్పటివరకూ మొత్తం నాలుగు చిరుతలు పట్టుబడ్డాయని అధికారులు తెలిపారు.

## కుప్పంలో నేడు నారా భువనేశ్వరి పర్యటన

కుప్పం: ఎన్టీఆర్ ట్రస్టు ఛైర్‌పర్సన్, టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి మంగళవారం కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. కుప్పంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఎన్టీఆర్ సంజీవని ఉచిత వైద్యశాలను ఉదయం 11 గంటలకు ఆమె ప్రారంభిస్తారు. అనుబంధంగా ఎన్టీఆర్ ట్రస్టు ఉచిత వైద్య మొబైల్ వ్యాన్‌నూ ప్రారంభించనున్నారు. అంతకుముందు ప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయంలో అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇక, కుప్పం మండలం మల్లానూరులో ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శిస్తారు. శాంతిపురం మండలం కడపల్లి సమీపంలోని శివపురం వద్ద నిర్మాణంలో ఉన్న ఇంటిని పరిశీలిస్తారు. అక్కడ్నుంచి బెంగళూరుకు చేరుకుని హైదరాబాదుకు తిరుగు ప్రయాణమవుతారు.

### ముఖ్యగమనిక

తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న కార్యక్రమాలు ప్రతిరోజు ఈ క్రింది వాట్సాప్ నెంబర్‌కి పంపించగలరు. చైతన్యరథం పత్రికలో వాటిని ప్రచురించడం జరుగుతుంది. మీరు పంపించే కార్యక్రమాల వివరాలు ఒక ఫోటో జత చేసి పంపించగలరు

9618727040

## ఎన్టీఆర్ 100 నాణెం విడుదల చేయడం తెలుగుజాతికి గర్వకారణం

**నెల్లూరులో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నేతల పాలాభిషేకం**

**భారతరత్న ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేసిన ధర్మవరం సుబ్బారావు**

నెల్లూరు (చైతన్యరథం): సినీ, రాజకీయ రంగాల్లో తనదైన ముద్ర వేసిన స్వర్గీయ నందమూరి తారకరామారావుకు భారతరత్న ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు కోరారు. సోమవారం ఎన్టీఆర్ స్మారక రూ.100 నాణెం విడుదల చేయాడంపై హర్షం వ్యక్తం చేస్తూ... నెల్లూరు నగరంలోని, నర్తకి సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధర్మవరం మాట్లాడుతూ... రాష్ట్రపతి భవన్‌లో ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, రాజకీయ, సినీ పరిశ్రమ ప్రముఖుల సమక్షంలో గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అన్న ఎన్టీఆర్ 100? నాణెం విడుదల చేయడం తెలుగుజాతికి గర్వకారణమన్నారు. ఉమ్మడి ఏపీకి ఎన్టీఆర్ చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గణేష్ కుమార్, కల్వకుంట బాస్కర్, రెహమాన్, కోటపాటి రాజ, అద్దంకి చంద్ర, ఎనికిపాటి చెంగయ్య, సిద్ధకళాచారి, మహంకాళి వెంకటరమణయ్య, రత్నం, వీరమల్లు



చంద్ర, మదుచిలకపాటి, కల్వకుంట సుధా, సీమకుర్తి వెంకటేశ్వర్లు, ఏలూరుబాబు, మన్నారుస్వామి, అర్మాట్ శ్రీనివాసులు, దక్షిణామూర్తి, పూంగావనం శివ, గుమ్మడిపూడి ప్రభాకర్ సాయి క్రిష్ణ, మునిశేఖర్, వాహిద్ న్నసాయియాదవ్, పసబాకరాజ, నాగర్జున్ టీడీపీ కార్యకర్తలు , ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

## గూడూరులో మహాశక్తి కరపత్రాలు పంపిణీ

గూడూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ మహా శక్తి కార్యక్రమాన్ని జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మినీ మేని ఫెస్టో నీ తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి ఆధ్వర్యంలో చిట్టమూరు మండలం టిడిపి అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు, ఆరూరు గ్రామం టిడిపి సీనియర్ నాయకులు అరూరు గిరినాయుడు, నియోజక వర్గ మహిళా ప్రధాన కార్యదర్శి దాసరి శైలజ సహకారంతో మండల పరిధిలోని ఆరూరు పంచాయతీలో మహాశక్తి కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం రచ్చబండ కార్యక్రమం, మన భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణపర్తి కిషోర్ నాయుడు మాట్లాడుతూ సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ల ఫ్రీగా ఇవ్వబడుతుందని, ఆడబిడ్డ నిధి కింద ప్రతి ఇంటిలో ఎంతమంది ఆడబిడ్డలు ఉన్న ప్రతి ఒక్కరుకు 18 సంవత్సరాలు నుండి 59 సంవత్సరాలు వరకు మహిళలకు నెలకు 15 వేల రూపాయలు ఇవ్వబడును



రైతులకు సంవత్సరానికి 20 వేల రూపాయలు ఇవ్వబడును బీసీలకు ప్రత్యేక చట్టం కనిపిస్తారు. ఇవి జరగాలంటే రాబోయే 2024 సంవత్సరం ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి సైకిల్ గుర్తుపై ఓటు వేసి మన నారా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేసుకొని గూడూరు నియోజకవర్గంలో పాశం సునీల్ కుమార్‌ని ఎమ్మెల్యేగా గెలిపించుకుని మనకున్న సమస్యలు తీర్చుకోగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షురాలు దువ్వూరు.భారతి రెడ్డి, పార్లమెంట్ తెలుగు మహిళా కార్యదర్శి ఆరూరు.భార్గవి, ఆరూరు సర్పంచ్ కాకి.చెంగమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు బత్తిన. ప్రమీల,పార్లమెంట్ కార్యదర్శి శ్రీ పతి. నరసమ్మ,గూడూరు మండలం మహిళా అధ్యక్షురాలు మల్లి.శ్యామల,చిల్లకూరు మండల మహిళా అధ్యక్షురాలు నెల్లటూరు.సుప్రజ,పట్టణ ప్రధాన కార్యదర్శి నిమ్మల. సరస్వతమ్మ, నియోజకవర్గ కార్యదర్శి మేఖల.మాధవి, .కావలి రెడ్డి.శివా రెడ్డి, నెలవల. ముత్తురాజు, కంటెపల్లి.వెంకటరమణయ్య, పాల్గొన్నారు.

## యార్లగడ్డ వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిసిన సాయి కల్యాణి



హనుమాన్ జంక్షన్ (చైతన్యరథం): ఇటీవల గన్నవరం నియోజకవర్గంలో యువగళం సారధి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రివర్యులు, యువనేత, నారా లోకేష్ పాదయాత్రలో భాగంగా గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంఛార్జిగా యార్లగడ్డ వెంకట్రావుని నియమించిన నేపథ్యంలో విజయవాడలోని వారి నివాసంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మూల్పూరి సాయి కల్యాణి మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

# సంక్షేమ పథకాల్లో కోతలు.. దోపిడీల్లో ఘనులు

- ఇదే వైసీపీ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న తంతు
- భవిష్యత్ కు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునీత



సంక్షేమ పథకాల్లో ఏదో ఒక మెలిక పెడుతూ కోతలు విధిస్తూ వైసీపీ ప్రభుత్వ పాలన సాగుతోందని.. మాజీ మంత్రి పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామంలో భవిష్యత్ కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నేతలతో కలిసి ఇంటింటికీ వెళ్తూ మినీ మ్యానిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలు అందజేస్తూ.. ఆ పథకాల వలన కలిగే లబ్ధిని వివరించారు. అన్ని వర్గాలకు సముచితంగా న్యాయం చేసే విధంగా సంక్షేమ పథకాలు ఉన్నాయని ఈ సందర్భంగా సునీత అన్నారు.

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకాలన్నీ కచ్చితంగా అమలు చేస్తామన్నారు. ప్రతి ఇంటికీ కనీసం ఐదారు పథకాలకు తక్కువ లేకుండా అందే అవకాశం ఉందని.. ముఖ్యంగా మహిళలకు మేలు జరిగే విధంగా పథకాలు ఉంటాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో జరుగుతున్న విధంగా.. ఏదో ఒక సాకుతో సంక్షేమ పథకాలను కట్ చేసే పరిస్థితి ఉండదన్నారు. అమ్మకు వందనం ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా.. అందరికీ అందిస్తామన్నారు. అలాగే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేయడం, నెలనెల ఆర్థిక సాయం ఉంటాయన్నారు. వీటిన్నింటిపై ప్రజలకు ఇప్పటికే ఒక స్పష్టత ఉందన్నారు.

వైసీపీ నాయకులకు దోపిడీలపై ఉన్న శ్రద్ధ.. ప్రజలకు మంచి చేయడంలో లేదన్నారు. ఈ ప్రభుత్వానికి చివరి రోజులు వచ్చాయని.. ప్రజలు అన్ని విషయాలు గుర్తిస్తున్నారన్నారు...

## ఆ ఇసుకలోనే వైసీపీ ప్రభుత్వాన్ని కప్పి పెట్టే రోజులు దగ్గర పడ్డాయ్



- టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ ఉమామహేశ్వరనాయుడు

కళ్యాణదుర్గం (చైతన్యరథం) : గ్రామాల్లో లభించే ప్రకృతి వనరులైన ఇసుక, ఎర్రమట్టిని యదేచ్చగా దోచుకుంటున్న వైసీపీ ప్రభుత్వాన్ని అ ఇసుక లోనే కప్పి పెట్టే రోజులు దగ్గరపడ్డాయని కళ్యాణదుర్గం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ మాదినేని ఉమామహేశ్వర నాయుడు హెచ్చరించారు. 28 న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం నియోజక వర్గం, బ్రహ్మసముద్రం మండలంలోని అజ్జయ్య దొడ్డిలో గల ఇసుక రీచ్ సందర్శనకు వెళ్లేందుకు ఉమామహేశ్వర నాయుడు బయలుదేరుగా దారి మధ్యలోనే పోలీసులు అడ్డుకుని అధికార దర్పణాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర నాయుడు మాట్లాడుతూ జేపీ వెంచర్స్ పేరుతో ఇసుకను ఇష్టానుసారంగా అక్రమంగా తరలిస్తున్నారు అన్నారు. జేపీ వెంచర్స్ రద్దు చేసినప్పటికీ కానీ అలాగే ఇసుకను యధేచ్చగా అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. మంత్రి ఉషశ్రీ ఇసుకను బెంగళూరుకు తరలిస్తూ అక్రమంగా సంపాదిస్తున్నారు అన్నారు.

అధికార పార్టీకి పోలీసులు తొత్తులుగా మారిపోయి వారి అక్రమ రవాణాకు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు ఇలాంటి ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఏపీకి శాపంలా ఇసుక దందా : నరేంద్ర వర్మ



బాపట్ల (చైతన్యరథం) : పట్టణంలోని కొత్తపాలెం గ్రామంలో కో అపరేటివ్ సొసైటీ భూముల్లో ఇసుక అక్రమ దందా జరుగుతున్న ప్రాంతాన్ని బాపట్ల నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్ శ్రీ వేగేశన నరేంద్ర వర్మ సందర్శించి అక్కడ జరుగుతున్న ఇసుక దందా గురుంచి మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుక దందాల తో అ పార్టీ నాయకులు కోట్లు గడిస్తూ ప్రకృతిని సర్వనాశనం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో నీటి వనరులు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి పేద రైతులు కూరగాయలు, ఆకుకూరలు పండించుకొంటారని కో-ఆపేరటివ్ సొసైటీ భూములు ఇవ్వడం జరిగింది. కానీ బాపట్ల వైసీపీ నాయకులు రైతుల వద్ద నుండి అక్రమంగా భూములు లాక్కుని ఇసుక వ్యాపారం చేయడం దారుణమని, ప్రకృతి వనరులు దోపిడీ జరుగుతుంటే అడ్డుకోవాల్సిన అధికారులు డబ్బు మత్తులో జోగుతూ అధికార పార్టీకి ఊడిగం చేస్తున్నారు.

ఈ ఇసుక దందా అంత ఎమ్మెల్యే కోన రఘుపతి కనుసన్నల్లోనే జరుగుతుందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో భవన నిర్మాణాలకు ఇసుక ఉచితంగా అందిస్తే ఈ ప్రభుత్వం లో అందినకాడికి దోచుకొంటు నిర్మాణ రంగం మీద పెనుభారం మోపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో జరుగుతున్న ఇసుక దందాను ఆపేలా చర్యలు తీసుకో వాలని నరేంద్ర వర్మ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గొలపల శ్రీనివాసరావ్ు,ముక్కామల సాంబశివరావు,కనుమూరి సాంబమూర్తి రాజు,కావూరి శ్రీనివాసరెడ్డి,ఇనగంటి గాంధీ, సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో బరితెగించిన ఇసుక మాఫియా

- 1979 పరిస్థితి పునరావృతం అవుతుందని ప్రజలలో ఆందోళన..
- విధులను మరిచిన అధికారులు
- కొండేపి ఎమ్మెల్యే దోలా బాల వీరాంజనేయ స్వామి ఆగ్రహం

సింగరాయకొండ/ జరుగుమల్లి (చైతన్యరథం) : రాష్ట్రంలో బరి తెగించిన ఇసుక మాఫియా ప్రభావం నదీ పరివాహక ప్రాంతాల్లో జలాలు అడుగంటి పోవడంతో పాటు ప్రవాహ దిశ మారి గ్రామాలలో 1979 నాటి పరిస్థితులను పునరావృతం అయ్యే ప్రమాదం ఉందని కొండేపి శాసన సభ్యుడు డా డోలా బాల వీరాంజనేయ స్వామి ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్ర పిలుపు మేరకు జరుగుమల్లి మండలం పాలేరు నదీ పరివాహక ప్రాంతం చతుకుపాడు గ్రామంలో చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ.. కొండపి నియోజకవర్గం పరిధిలో ఉన్న నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక కు ఈ ప్రాంతంలో గిరాకీ ఉండడం తో అధికారిక రీచ్ లు అందికార రీచ్ ల పేరుతో ఇసుక మాఫియా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. దాన్ని నియంత్రించే వ్యవస్థ, అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తమ ఉద్యోగ ధర్మాన్ని బాధ్యత లను అమలు పరచకుండా ఇసుక మాఫియా కి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించడం కారణంగానే లక్షలాది రూపాయల ఇసుక తరలి పోతుందని ఎమ్మెల్యే అరోపించారు. ఇసుక అక్రమ రవాణా తో



గ్రామాలలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా మానవత్వం లేకుండా ఇసుక మాఫియా వ్యవహరిస్తుందని అయన ఆరోపించారు. నియంత్రణ అధికారులు తన విధినిర్వహణ బాధ్యతా యుతంగా ప్రజలకు రక్షణ కల్పించే విధంగా నిర్వహించాలని అపాపాన్ని తమ పైన వెసుకోవద్దని ఎం ఎల్ ఎ స్వామి హితవు చెప్పారు. పాలేరు నదీ పరివాహక ప్రాంతం చతుకుపాడు వద్ద నిరసన ప్రదర్శన చేస్తూ ఇసుక మాఫియా అక్రమాలను చూపుతూ కాలం చెల్లిన అనుమతులు, ప్రభుత్వ లెక్కకి రాని బిల్లులను చూపించారు. ఈ అవకతవకల పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆదాయానికి, గ్రామ పంచాయితీ ఆదాయానికి గండి కొడుతున్న వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ రాష్ట్ర పార్టీ పిలువు మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయాలు,పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదులు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కొండపి నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాల నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు రావాలి : తిప్పేస్వామి



మడకశిర (చైతన్యరథం) : మడకశిర నియోజక వర్గ అభివృద్ధి చెందాలంటే బాబు రావాలి. మడకశిర ప్రాంతం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే మడకశిర ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి మద్దతు ఇవ్వాలని టీడీపీ నాయకులు కోరారు. దొడ్డేరి పంచాయితీ పిలుగుండ్లు మరియు కాకిపంచాయతి కె బ్యాడిగెరలో మండల నాయకులు మరియు తెలుగు మహిళ నాయకుల తోకలిసి ఇంటింటికి తిరుగుతూ గత తెదేపా ప్రభుత్వ హయాం లో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను, చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టో పథకాలను మహాశక్తి కార్యక్రమం ద్వారా, తెలుగు మహిళలు ప్రజలకు వివరిస్తూ టీడీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దాసి రెడ్డి మాజి ఎంపీపీ రాజన్న టీఎన్‌టీయూసీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు మూర్తి, మండల ప్రధాన కార్యదర్శి జి కే ఈరన్న నియోజకవర్గ కోఆర్డినేటర్ రామకృష్ణ తాలూకా ఐటీడీపీ అధ్యక్షుడు కాంతరాజు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, మహిళలు స్థానిక పంచాయతీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కనివినీ రీతిలో టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ టీసీఎల్

- 18 మండలాల జట్లతో అల్లూరి ఆదిశేషారెడ్డి స్టేడియం

**గూడూరు (చైతన్యరథం):** తిరుపతి జిల్లా గూడూరు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో డా. సర్వేపల్లి రాధకృష్ణన్ జన్మదినం సెప్టెంబర్ 5 "ఉపాధ్యాయ దినత్సవం" నందర్భంగా ప్రతి సంవత్సరంలాగే ప్రతిష్టాత్మకంగా కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ టీసీఎల్ 2023 ను ఈ సంవత్సరం కూడా 18 మండలాల జట్లతో అల్లూరి ఆదిశేషా రెడ్డి స్టేడియం నందు పండుగ వాతావరణంలో ఈనెల 25,26,27,28 తేదీలలో నిర్వహించడం జరిగింది. ఈ టోర్నమెంట్‌లో విన్నర్స్ గా నిల్చిన బాలాయపల్లి టీమ్ మరియు రన్నర్స్ గా నిల్చిన వాకాడు టీమ్ కు ముఖ్య అతిథులుగా వచ్చిన గూడూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్, శ్రియా రియల్



ఎస్టేట్స్ అధినేత బాబు ఆగస్టస్ చేతుల మీదుగా మెడల్,షీల్డ్‌లను బహు కరించడం జరిగింది. అధ్యక్షుడు కడివేటి చంద్ర శేఖర్, కార్యవర్గ సభ్యులు పురందర్ రాజు,ప్రభాకర్(రిటైర్డ్ ఎస్ఐ) పి.డి.కరిముల్లా, ప్రజేంద్ర రెడ్డి,మురళీ సింగ్,బాబర్, సతీష్, ఎంపైర్స్ గా వ్యవహరించిన విజయ్, మణి, ఉపాధ్యాయ క్రీడాకారులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో ఉన్న విశ్వేశ్వరాయపురం వంతెన

- సెల్ఫీ ఛాలెంజ్ చేసిన మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు



మల్కిపురం (చైతన్యరథం) : శిథిలావస్థలో ఉన్న విశ్వేశ్వరాయపురం వంతెన వద్ద మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు సెల్ఫీ ఛాలెంజ్ చేసారు. ఈ సందర్భంగా మాజీమంత్రి గొల్లపల్లి మాట్లాడుతూ రెండు మండలాలు కలిపే వంతెన శిథిలావస్థకు చేరితే ఈ వైస్సార్సీపీ ప్రభుత్వ ప్రజా ప్రతినిధులకు దున్నపోతు మీద వర్షం కురిసినట్టు ఉందని అన్నారు. ప్రతీ రోజు కొన్ని వందల వాహనాలు ఈ వంతెన మీద నుండి వెళతాయని, అనేకమంది వాహనదారులు రోజు ప్రయానిస్తారని, ఈ వంతెన అత్యవసరం అనే ఇంగిత జ్ఞానం కూడా లేదని, ఇటువంటి అజ్ఞానులు మనకు నాయకులా అని ప్రశ్నించారు. ఏ సమయంలోలో నైనా కూలి పోయే ప్రమాదం ఉందని, ప్రజల ప్రాణాలతో ఆటలు ఆడుకోవద్దని హితవు పలికారు. ఈ వంతెన పై రవాణా వెంటనే నిలుపుదల చెయ్యాలని కొత్త వంతెన పనులు ప్రారంభిం చాలని మాజీమంత్రి గొల్లపల్లి డిమాండ్ చేశారు. బట్టేలంక శంకరగుప్తం వంతెన వద్ద ఉప్పుటేరు పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడంతో భారీ వాహనాలను నిలిపివేసి, కొత్త వంతెన నిర్మించకుండా ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్నారని, ఈ వంతెనను కూడా వెంటనే నిర్మిం చాలని మాజీమంత్రి గొల్లపల్లి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిటికెల రామ్మోహనరావు, నాగిడి నాగేశ్వరావు, సర్పంచ్ చెల్లుబోయిన హెలీనా హరికృష్ణ, అనిశెట్టి సత్యనారాయణ, రాయుడు ఈశ్వరి ఏసుబాబు, కొమ్మోజు హరీష్ మాస్టర్, సాగి సత్యం రాజు, కట్టా తరుణ్, అప్పారి సత్యనారాయణ, కడలి రామచంద్రరావు, గుబ్బల సత్యనారాయణ, మంగెన భూదేవి, కాండ్రేగుల భవానీ లావణ్య, బందెల పద్మ, చెల్లింగి సీతామహాలక్ష్మీ, ముత్యాల దుర్గాదేవి, కడలి దుర్గాదేవి, పరసా సుజాత, కేతా వెంకటలక్ష్మి, కోట పుష్పకుమారి,తోట సత్తిబాబు మరియు విశ్వేశ్వరాయపురం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

# ఒక్క జిల్లా నుంచే తాడేపల్లి అండర్ గ్రౌండ్ 21 కోట్లు

- తెదేపా నేత మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు




విజయవాడ (చైతన్యరథం) : ఏపీలో అధికార వైసీపీ ఇసుక దోపిడీకి పాల్పడుతోందని ఆరోపిస్తూ టీడీపీ చేపట్టిన నిరసన కార్యక్రమం మైలవరంలో ఉద్రిక్తతకు దారి తీసింది. ఇసుక దోపిడీపై 28, 29, 30 తేదీలలో టీడీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా మైలవరంలో ఇసుక డంపింగ్ స్టాక్ పాయింట్ వద్ద టీడీపీ నేతలు మాజీ మంత్రి దేవినేని ఉమా, తిరువూరు నియోజకవర్గ ఇన్చార్జి శావల దేవదత్ నిరసనకు దిగారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు టీడీపీ నేతలను అడ్డుకున్నారు. ఇసుక రీచ్‌ల వద్ద ధర్నా చేసుకోవాలని టీడీపీ ఆందోళనను మైలవరం సీఐ, ఎస్ఐలు మధ్యలో వచ్చి అడ్డుకున్నారు. ఈ క్రమంలో మైలవరంలో పోలీసులు, టీడీపీ నేతల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. పోలీస్ జులం నశించాలని, వైసీపీ ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ టీడీపీ నేతలు నినాదాలు చేశారు. దీంతో టీడీపీ నేతలు దేవినేని ఉమా, దేవదత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని మైలవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

# దళితులను పూర్తిగా విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

- ఎస్సీ సర్పంచ్‌లకు విలువలేకుండా చేసిన వైసీపీ
- దళితుల ఉపయోగపడే 28 సంక్షేమ పథకాలను రద్దు చేసిన వైసీపీ : వర్మ



పిఠాపురం (చైతన్యరథం) : దళితులను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, వైసీపీ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి కుంటుపడిందని, గ్రామాలలో ఎక్కడ కూడా తట్టెడి మట్టి పోసిన దాఖలాలు కనపడడం లేవని మాజీ ఎమ్మెల్యే వర్మ అన్నారు. టౌన్ 16వ వార్డు అయితేనగర్ అంబేద్కర్ యూత్ సుమారుగా 40 మంది వైసీపీ నుండి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. వారందరికీ పార్టీ కండువా కప్పి మాజీ ఎమ్మెల్యే వర్మ పార్టీలోకి ఆహ్వానించారు. వర్మ మాట్లాడుతూ వైసీపీ పాలనలో దళితులకు జరిగినటి వంటి అన్యాయం ఎస్సీ సోదరులు గుర్తించి, అదే విధముగా మహానాడు వేదికగా గౌరవ చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించినవి మెచ్చి, తెలుగుదేశం ప్రభుత్వంలో ఎస్సీ సోదరులు జరిగినటువంటి మేలును గుర్తించుకొని పార్టీలోకి చేరారని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హాయాంలో ఎస్సీ కాలనీలు అన్ని 100 అభివృద్ధి చెందినవని, అన్ని ఏరియాలలో సి.సి.రోడ్లు, పార్కులు, వారికీ ఆట స్థల పరికరాలు సదుపాయం అన్ని సౌకర్యాలు ఉండేవని అన్నారు. ప్రజలలో మార్పు వస్తుందని, జగన్ ప్రభుత్వం దళితులకు ఉపయోగకరమైన 28 సంక్షేమ పథకాలు రద్దు చేయడం, విదేశి విద్య లేకుండా చేయడం, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్ళించడం, వైసీపీ పార్టీకి చెందినా ఎస్సీ సర్పంచ్‌లను విలువ లేకుండా చేయడం, రాష్ట్రంలో దళితులపై జరుగుతున్నటివంటి అరాచకాలు, దౌర్జన్యాలు అదే విధముగా దళితుల ఓట్లతో నెగ్గిన జగన్ వారిని ఎదుగుదలను అణిచివేసి మోసం చేసారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రెడ్డం భాస్కర రావు, నుతాటి ప్రకాష్, దుర్గాడ విజయలక్ష్మి, యాళ్ళ గణేష్, కూసి సత్తిబాబు, రాయుడు శ్రీను పార్టీలోకి చేరిన యువత నాగ సురేష్, కిరణ్, శ్రీకాంత్, శ్యాం శేఖర్, నాగు, నరేష్, రాకేశ్, పండు, రాజ్ కుమార్, సుబాష్, మహేష్, వీరబాబు, రమణ నానిబాబు, హరీష్ మరియు అభిషేక్, నిఖిల్ తేజ్, అలపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మినగల్లు ఇసుక రీచ్‌లో పోలంరెడ్డి దినేష్ రెడ్డి ఇసుక సత్యాగ్రహం

- ఇసుక రీచ్‌లో ఉద్రిక్తత దినేష్ రెడ్డి అరెస్ట్
- అడుగడుగునా నిర్బంధం పోలీసుల దురుసుతనం



కోవూరు (చైతన్యరథం) : మినగల్లు ఇసుక రీచ్ లో తెలుగుదేశం పార్టీ కోవూరు నియోజకవర్గ ఇంచార్జి పోలంరెడ్డి దినేష్ రెడ్డి తలపెట్టిన సాండ్ సత్యాగ్రహం ఉద్రిక్తతకు దారితీసింది. ముందుగా నల్లపాలెం ప్రతీ అడుగు ప్రజలకోసం కార్యక్రమం లో ఉన్న దినేష్ రెడ్డి అక్కడ నుండి ఇసుకరీచ్‌కి బయలుదేరిన అప్పటి నుంచి పోలీసులు వెంబడించారు. అప్పటికే మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిని గృహ నిర్బంధం చేశారు. దినేష్ రెడ్డి మాత్రం వాహనాలు మారుతూ దారులు మార్చుతూ అనుకున్న విధంగా మినగల్లు ఇసుక రీచ్‌ను చేరుకున్నారు. అక్కడ జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు అడ్డుకునే ప్రయత్నం చేసారు. ఇక పోలీసులు వచ్చి చేసి దినేష్ రెడ్డిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు కానీ తెలుగుదేశం పార్టీ శ్రేణులు అడ్డుకోవడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులు దినేష్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. మీడియాతో దినేష్ రెడ్డి మాట్లాడుతూ ఇది అక్రమ రీచ్ అని ఇక్కడ ఎటువంటి అనుమతులు లేవని అయినా ఇక్కడ ఇసుక మాఫియాతో చేరి ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి వందల కోట్లు దోచుకున్నారని తెలిపారు. ఎక్కడో ఎస్.ఎస్ పురం పేరుమీద బిల్లులు తీసుకుని మినగల్లు రీచ్ నుండి ఇసుక తవ్వకాలు చేస్తుంటే అధికారులు కమిషన్లు తీసుకుని చోద్యం చూస్తున్నారని గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసులు వేస్తున్నాం అని అధికారుల అక్రమాలు బయటకు తెస్తామని హెచ్చరించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న దినేష్ రెడ్డిని బేషరతుగా వదిలిపెట్టాలని, లేకుంటే టీడీపీ శ్రేణులు కలిసి పోరాటానికి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నార్కెడిమిల్లి గ్రామస్తులకు చంద్రబాబు భరోసా

- పచ్చళ్ళ తయారీకి ఊతం - బండారు సత్యానందరావు



నార్కెడిమిల్లి (చైతన్యరథం): ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లి గ్రామంలో గ్రామస్తులకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రత్యేక భరోసా ఇచ్చారని ఆ రాష్ట్ర ఉపాధ్యక్షులు, నియోజకవర్గ ఇంఛార్జ్ బండారు సత్యానందరావు అన్నారు.ఈ నార్కెడిమిల్లి గ్రామంలో మహాశక్తి చైతన్య రథయాత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇటీవల రావులపాలెంలో ఏర్పాటు చేసిన భవిష్యత్తుకు గ్యారెంటీ బహిరంగ సభలో చంద్రబాబునాయుడుని నార్కెడిమిల్లి గ్రామ పచ్చళ్ళపై దృష్టి సారించాలని కోరడంతో వారు అందుకు అనుకూలంగా స్పందిం చారని తెలిపారు.ఈ పచ్చళ్ళ తయారీపైనే అధిక సంఖ్యలో మహి ళలు జీవనం సాగించదాన్ని దృష్టిలో వుంచుకునే వారికి తోడ్పాడును అందించడమే నా లక్ష్యమని సత్యానందరావు తెలిపారు.జగన్ ప్రభుత్వంలో పెరిగిన ధరలతో పచ్చళ్ళ వ్యాపారస్తులకు భారం పెరిగిందని,అలాగే వీరికి టాక్స్ ల భారం కూడా పెరిగినట్టు ఇటీవలే మీడియా కథనాలతో తేటతెల్లం అయ్యిందని గుర్తుచేశారు.రుణాల కోసం బ్యాంకుల చుట్టూ వ్యాపారులు తిరుగుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని జగన్ ప్రభుత్వంలో వ్యాపారులకు ఆర్థిక భరోసా ఇవ్వడంలో విఫలమైందని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఈ గ్రామస్తులపై ప్రత్యేక దృష్టి సారిస్తానని సత్యానందరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు , మహిళల తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ముసుగులో గ్రావెల్ అక్రమాలు.. ఎమ్మెల్యే వేగుళ్ళ



వేములపల్లి (చైతన్యరథం) : రైతుల ముసుగులో గ్రావెల్ అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఆరోపించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం అయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని ద్వారపూడి శివారు వేములపల్లి లో రైతుల ముసుగులో అక్రమ మైనింగ్ చేపట్టారని రెండు నెలల నుంచి ఈ విషయంపై ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు నాయకుల ఒత్తిడికి తలొగ్గి అక్రమాలకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. పుంతగట్లకు రెండు లారీలు వేసి మిగిలిన 98 లారీలు అక్రమంగా అమ్ముకుంటూ కోట్లాది రూపాయల దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఈ నెల 22న మైనింగ్, రెవెన్యూ అధికారుల సమక్షంలో గ్రావెల్ తవ్వకాలపై అక్రమ మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలన చేస్తామని చెప్పి అధికారులు కప్పదాటు వ్యవహారంతో ఒకరిపై ఒకరు నెపాన్ని నెట్టి పరిశీలన వాయిదా వేసారన్నారు. తిరిగి ఎప్పుడు పరిశీలన చేస్తారో చెప్పమంటే మైనింగ్ అధికారులు ఫోను ఎత్తడం లేదన్నారు. తహసీల్దార్ కార్యాలయంకు అనేక మార్లు ఫిర్యాదు చేసినా దానిని రిజిస్టర్ చెయ్యకుండా మైనింగ్ అధికారులకు ఫార్వర్డ్ చేస్తూ పబ్బం గడుపుతున్నారని అయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నదీ గర్భంలో రోడ్డేసి.. ఎమ్మెల్యే ఇసుక దందా

- ఇసుక సత్యాగ్రహ దీక్షలో వర్ల కుమార్ రాజా

పామర్రు (చైతన్యరథం): చరిత్ర ఏనాడూ చూడనంతటి ప్రకృతి విధ్వంసం, పర్యావరణ నాశనం, ఇసుక దోపిడీ నాలుగేళ్ల జగన్ రెడ్డి పాలనలో చోటు చేసుకుందని పామర్రు టీడీపీ నియోజకవర్గ ఇంఛార్జి వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. ఇసుక అక్రమాలకు సహక రించని అధికారులపై దాడులకు పాల్పడుతూ, అడ్డుకునే పోలీసులను ట్రాన్స్ ఫర్ చేసే దుర్మార్గ పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయన్నారు. పమిడిముక్కల మండలం లంకపల్లి గ్రామంలో వర్ల కుమార్ రాజా ఆధ్వర్యంలో ఇసుక సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఎమ్మెల్యే కైలే అనిల్ అరాచకం ఏ స్థాయికి చేరిందంటే.. నదీ గర్భంలోనే రోడ్డు వేసి మరీ ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారన్నారు. అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు చేయడం వల్లే ఇప్పటికే ఎంతో మంది అధికారులు జైళ్లకు వెళ్లారు. వందలాది మంది పోలీసులు కేసుల్లో తిరుగుతున్నారు. వారి కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. ఎమ్మెల్యే కైలే దోపిడీ మూడు ట్రాక్టర్లు, ఆరు టిప్పర్లు అనేలా తయారైందని ఎద్దేవా చేశారు. అధికారులు చట్టబద్ధంగా పని చేసి ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలి. ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకోవడంలో తమవంతు సహకారం అందించాలని సూచించారు.



## రోడ్డు పనుల్లో

# కనీస ప్రమాణాలు పాటించకపోవడం దారుణం

- తీవ్ర ఇబ్బందులకు గురౌతున్న స్థానికులు...
- నిర్మాణ లోపాలను సరిదిద్దాలని కోరుతూ నిరాహార దీక్ష
- సంఘీభావం తెలిపిన మాజీ మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం (చైతన్యరథం)** : రోడ్డు నిర్మాణ పనుల్లో కనీస ప్రమాణాలు పాటించకుండా మచిలీపట్నం మండలం, సుల్తానగరం 216 అండర్ పాస్ నెంబర్ 85 నిర్మాణ పనులు చేపట్టడం దారుణమని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణ లోపం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. అండర్ పాస్ నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని డిమాండ్ చేస్తూ... స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, స్థానికులు గత ఆరు రోజులుగా నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు మాజీ మంత్రి కొల్లు రవీంద్ర తన సంఘీభావం తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను ఫోన్‌లో సంప్రదించి తక్షణమే రోడ్ పనులు చేపట్టాలని కోరారు.

216 ప్రాజెక్ట్ మేనేజర్‌ని ఫోన్లో సంప్రదించి రోడ్డు పనులు పూర్తయి రెండు సంవత్సరాలు అయినా అండర్ ఫ్లస్ పనులు ఇప్పటివరకు పూర్తి చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులంటే ఎందుకు అంతటి నిర్లక్ష్యమని ప్రశ్నించారు. తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించాలని లేకపోతే స్వయంగా రోడ్డపై బైఠాయిస్తామని కొల్లు రవీంద్ర హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ పార్టీ అధ్యక్షుడు కుంచే నాని, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు చిట్టి బొమ్మ వనరాజు వేముల శివాజీ, ఈడే వెంకట దాసు, రాయిన శివ, అబ్దుల్ ఖదీర్, బెజవాడ శ్రీకాంత్ , వడుపు నాగేశ్వరరావు, ఈడే వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## అధినేత ఆధ్వర్యంలో సెప్టెంబరు 2న జోన్ -2 సమావేశం

- సమావేశం విజయవంతం కావాలని పూజ నిర్వహించి ఏర్పాట్లు ప్రారంభించనున్న, జిల్లా నాయకులు



**కాకినాడ (చైతన్యరథం)** : సెప్టెంబర్ - 2 న జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులునారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జోన్ - 2 నాయకుల సమావేశం కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ అచ్చంపేట జంక్షన్ నందు గల నన్నయ్య విశ్వావిద్యాలయం ఎదురుగా రాష్ట్ర కార్యదర్శి మీసాల రాజు స్థలములో నిర్వహించడం జరుగుతుందని టీడీపీ నాయకులు తెలియజేశారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్, పొలిట్ బ్యూరో సభ్యులు నిమ్మకాయల చిన్నరాజప్ప తదితరులు సదరు స్థలముని పరిశీలించి, తిమ్మాపురంలో గల మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు నివాసానికి చేరుకొని వారితో ఏర్పాట్లు పై సమీక్ష నిర్వహించారు. అనంతరం జోన్ -2 సమావేశం విజయవంతం కావాలని ఈరోజు ఉదయం 8:30 నిమిషములకు అచ్చంపేట జంక్షన్ నన్నయ్య యూనివర్సిటీ ఎదురుగా గల మీసాల రాజు స్థలములో పూజ నిర్వహించి ఏర్పాట్లు ప్రారంభించుటకు సన్నాహాలు చేస్తున్నామని ఈ పూజ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మాజీ మంత్రియనమల రామకృష్ణుడు ని ,పొలిట్బ్యూరో సభ్యులు చిన్నారాజప్ప, కాకినాడ పార్లమెంట్‌లో గల నియోజకవర్గ ఇంచార్జ్ లు రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరవుతారని జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మీసాల రాజు, పార్లమెంట్ జనరల్ సెక్రటరీ పెంకే శ్రీనివాస్ బాబా, వాసిరెడ్డి ఏసుదాసు, అడబాల వెంకటేశ్వరారావు బుర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు..

# పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది

- **టీడీపీ నియోజకవర్గ ఇంచార్జీ,మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ**
- **తెలుగుదేశం పార్టీలో భారీగా చేరిన పట్టణ ప్రముఖులు,విద్యావేత్తలు, విశ్రాంత ఉద్యోగులు.**



**సత్తెనపల్లి (చైతన్యరథం)** : ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీలో గుర్తింపు ఉంటుందని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ తెలియజేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంనకు చెందిన పలువురు ప్రముఖులు విద్యావేత్తలు టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి , మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా అహ్వానించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ.. రాష్ట్ర భవిష్యత్ దృష్ట్యా మేధావులు, విద్యావేత్తలు తెలుగుదేశం పార్టీలోకి అహ్వానిస్తున్నామన్నారు. అధికార పార్టీ రాష్ట్రంలో చేస్తున్న దుర్మార్గాలు భరించలేక ఎందరో ప్రముఖులు స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీకి మద్దతు పలుకుతున్నారన్నారు.

టీడీపీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. పార్టీలో చేరిన వారు మహిళా నాయకురాలు మన్నవ శారద, గద్దె మురహరిరావుమన్నవ వెంకటరామయ్య,గద్దె వెంటరత్నం,కొండ్రు వెంకటరావు( విశ్రాంత ప్రధానోపాధ్యాయులు) కొండ్రు జాన్సీ,లింగిశెట్టి సుబ్బారావు( విశ్రాంత పంచాయితీ రాజ్ సుపర్నిడెంట్ ) అంది రమేష్ బాబు,ఎల్ రమేష్ ,మల్లవరపు జోజి,మొక్కపాటి శివ ప్రసాద్(విశ్రాంత పోస్టుమాన్ ) ఎల్ గిరీష్ , ఎల్ సందీప్, దర్శి ఏసుదాసు,వంగర సుబ్బారావు,వంగర సత్యనారాయణ,ఎల్ అశోక్ తదితరులున్నారు.

# రాష్ట్ర భవిష్యత్తుకు తెలుగుదేశం గ్యారెంటీ

- మహిళా సంక్షేమానికి చంద్రన్న భరోసా
- నేకునాంబాద్ గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల



**నేకునాంబాద్ (చైతన్యరథం)**: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్‌కు తెలుగుదేశం పార్టీ గ్యారెంటీఅని, మహిళల సంక్షేమానికి చంద్రబాబు భరోసానిస్తూ మహాశక్తి పథకాలను ప్రవేశపెట్టారని గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లా, బెస్తవారిపేట మండలం, నేకునాంబాద్ గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు ముత్తుముల అశోక్ రెడ్డి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి తెలుగుదేశం ప్రవేశపెట్టిన మినీ మ్యానీఫెస్టోలోని పథకాల గురించి ప్రజలకు వివరించారు. మహాశక్తి ద్వారా తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకాల మహిళా సంక్షేమానికి చంద్రన్న భరోసానిచ్చారన్నారు. అదే విధంగా రైతాంగానికి లబ్ధి చేకూర్చే అన్నదాత, యువగళం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి, పేదలను సంపన్నులను చేసే పూర్ టూ రిచ్, బీసిలకు రక్షణ చట్టం వంటి పథకాల ద్వారా రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు తెలుగుదేశం పార్టీ గ్యారెంటీ ఇస్తూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి నారా చంద్రబాబు నాయుడు గారితోనే సాధ్యమన్నారు. అన్నీ వర్గాల ప్రజలు తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలుస్తున్నారని రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో గిద్దలూరు నియోజకవర్గంలో తెలుగుదేశం జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సోరెడ్డి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుంటక నరసింహా యాదవ్, ఎంపీటీసీ సభ్యులు పూనూరు భూపాల్ రెడ్డి స్థానిక నాయకులు యామా ప్రసాద్, షేక్ సుల్తాన్, గొట్టం ప్రసాద్, దూదేకుల దస్తగిరి, సుబ్బయ్య, దస్తగిరి, వంశీ, మరియు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహాశక్తితో మహిళలకు వరాలు

**హిందూపురం (చైతన్యరథం)** : మహాశక్తిలోని సంక్షేమ పథకాలు మహిళలకు వరాలనీ టీడీపీ మహిళలు అన్నారు. శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు తెలుగు మహిళా ఆధ్వర్యంలో సోమవారం హిందూపురం రూరల్ మండలం బసవన్ పల్లి వీవర్స్ కాలనీ నందు ప్రచారం నిర్వహించారు ఇంటింటికి తిరిగి మహాశక్తి పై అవగాహన కల్పిస్తూ మహాశక్తి పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నేతృత్వంలో మినీ మేనిఫెస్టోలో పొందుపరిచిన మహా శక్తి చాల మంచి పథకం అన్నారు. మహాశక్తి ద్వారా ప్రతి మహిళా జీవితాల్లో కూడా వెలుగులు నింపే పథకాలు రాబోతున్నాయని వారు తెలియజేశారు. మహిళ లందరూ అదరించి తెలుగుదేశం ప్రభుత్వాన్ని అధికారంలో కూర్చోపెడితే మహిళలకు మహాశక్తి ద్వారా వరాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళ కార్యదర్శి పరిమళ పట్టణ అధ్యక్షురాలు విజయలక్ష్మి, పార్లమెంట్ కార్యదర్శి చెన్నమ్మ, రాష్ట్ర అంగన్వాడీ కార్యదర్శి వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.





నల్లచెరువు మండల కేంద్రం బీసీ కాలనీలో కదిరి టిడిపి ఇన్చార్జ్ కందికుంట వెంకటప్రసాద్ అన్న ఆదేశాల మేరకు మాజీ మహిళ కమీషన్ సభ్యురాలు పర్వీన్ భాను ఆధ్వర్యంలో టీడీపీ మహిళలు పెద్ద ఎత్తున మహాశక్తి ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నారు .ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజశేఖర్ బాబు,బుజ్జమ్మ,గంగ రత్నమ్మ,ప్రేమలత,ఉమాదేవి, హసీనా మరియు తెలుగుదేశం నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు .



శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇంచార్జ్ బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన తొట్టంబేడు మండలం, పెన్నలపాడు ఇసుక రీచ్ వద్ద ధర్నా కార్యక్రమం పాల్గొన్న తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్ , తిరుపతి నియోజకవర్గం ఇన్‌చార్జ్ మన్నూరు సుగుణమ్మ, పార్టీశ్రేణులు, శ్రీకాళహస్తి, తిరుపతి నాయకులు, క్లస్టర్ ఇంచార్జిలు తదితరులు.

## రెండేళ్ల చిన్నారికి విమానంలో ఆగిన శ్వాస : కాపాడిన ఎయిమ్స్ డాక్టర్స్




బెంగుళూరు : తాజాగా ఓ విమాన ప్రయాణంలో అనూహ్య సంఘటన జరిగింది. ఊపిరి ఆగిపోయిన పరిస్థితిలో ఉన్న ఓ రెండేళ్ల చిన్నారని ఒక వైద్య బృందం కాపాడింది. బెంగుళూరు నుంచి ఢిల్లీకి బయలుదేరిన విస్తార అనే సంస్థకు చెందిన యూకే 814 విమానంలో అదివారం రోజున ఈ ఘటన జరిగింది. ఇందులో వెళు న్న ప్రయాణికుల్లో ఓ కుటుంబం గుండె సమస్యతో బాధపడు తున్నటువంటి తమ రెండేళ్ల చిన్నారిని అత్యవసర చికిత్స కోసం ఢిల్లీకి తీసుకెళ్తున్నారు. బెంగళూరు నుంచి ఆ విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఆ చిన్నారి పరిస్థితి విషమంగా మారిపోయింది. సమాచారం తెలుసుకున్న విమాన సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే విమానాన్ని అత్యవసరంగా నాగ్‌పూర్ వైపుకు మళ్లించారు. అయితే ఇండియన్ సొసైటీ ఫర్ వాస్కులర్ అండ్ ఇంటర్వెన్షనల్ రేడియాలజీ సదస్సుకు హాజరై.. అదే విమానంలో తిరిగి వస్తున్న ఢిల్లీ ఎయిమ్స్‌కు చెందిన ఒక వైద్య బృందం చిన్నారి సమస్యను తెలుసుకుని, వెంటనే పాపను రక్షించేందుకు వారు ముందుకు వచ్చారు. ముందుగా ఆ చిన్నారి శ్వాస తీసుకునేందుకు వీలుగా ట్రీట్‌మెంట్ మొదలుపెట్టారు. అలాగే సీపీఆర్ కూడా చేయడంతో ఆ పాప తిరిగి ఊపిరి పీల్చుకుంది. ఆ చిన్నారిని కాపాడేందుకు దాదాపు 45 నిమిషాల పాటు వైద్యులు తీవ్రంగా శ్రమించారు. వారు చేసిన ప్రథమ చికిత్స ద్వారా ఆ చిన్నారి ప్రాణాలతో బయటపడింది. విమానం ల్యాండ్ తరువాత ఆసుపత్రికి తరలించారు.

# అభివృద్ధి పథంలో ఆర్థిక వ్యవస్థ

### - ఆ మూడు రంగాల్లోనే అధిక ఉద్యోగావకాశాలు : ప్రధాని



న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ వేగవంతమైన వృద్ధి బాటలో పయనిస్తోందని, దాని వల్ల దేశంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. రాష్ట్రీయ రోజ్ గార్ మేళాలో భాగంగా సోమవారం 51 వేల మంది యువతకు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ నియామక పత్రాలు అందించింది. ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని.. రాబోయే రోజుల్లో ఆటోమొబైల్, ఫార్మా, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని, వాటిలో ఎక్కువ మంది యువతకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ దశాబ్దంలోనే దేశంలోని ప్రతి సామాన్యుడికి లబ్ది చేకూరేలా.. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద అర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని అన్నారు. అన్ని రంగాలు అభివృద్ధి చెందాలి.. ఆహారం నుంచి ఫార్మా వరకు, అంతరిక్షం నుంచి స్టార్టప్ల వరకు ప్రతి రంగం అభివృద్ధి చెందాలి. అప్పుడే దేశఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం దేశీయ ఫార్మా రంగం విలువ రూ.4 లక్షల కోట్లుగా ఉంది. 2030 నాటికి ఇది రూ.10 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. అలాగే, 2030 నాటికి దేశీయ పర్యాటక రంగం సైతం రూ.20 లక్షల కోట్ల విలువతో 13 నుంచి 14 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తుందని కేంద్రం అంచనా వేసింది. అంటే, రాబోయే పదేళ్లలో ఫార్మా, పర్యాటక రంగాల్లోనే ఎంతో మంది యువతకు ఉద్యోగావకాశాలు రాబోతున్నాయి.

వీటితోపాటు ఆటోమొబైల్ రంగంలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి" అని ప్రధాని మోదీ వెల్లడించారు.

అలాంటి రోజు ఎంతో దూరంలో లేదు.. గత 9 ఏళ్లలో దేశంలోని వివిధ రంగాల్లో మార్పు కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. గతేడాది భారత్ నుంచి ఎగుమతులు గణనీయంగా పెరిగాయని, అంతర్జాతీయంగా భారత్‌లో తయారైన వస్తువులకు డిమాండ్ పెరుగుతుందనేందుకు ఇదే నిదర్శనమని అన్నారు. మొబైల్ తయారీలో ప్రపంచంలోనే భారత్ రెండో స్థానంలో ఉంది. ఇకపై ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్ల తయారీపై కూడా దేశీయ పరిశ్రమలు దృష్టి సారించాలి. భారత్‌లో తయారైన ల్యాప్టాప్స్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు మన దేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిపే రోజు దగ్గర్లోనే ఉంది అని ప్రధాని మోదీ తెలిపారు. సోమవారం ఉద్యోగ నియామక పత్రాలు పొందిన 51 వేల మందిలో ఎక్కువ మంది భద్రతా దళాల్లో ఉద్యోగం పొందినవారే ఉన్నారు. వారందరినీ ప్రధాని 'అమృత్‌కాల్ రక్షకులుగా' పేర్కొన్నారు. వీరు దేశానికి సేవ చేయడమే కాకుండా, దేశాన్ని కాపాడతారని అన్నారు.

# చంద్రయాన్-3 రోవర్ ముందు పెద్ద గొయ్యి : దారి మార్చిన ఇస్రో



బెంగళూరు: జాబిల్లి దక్షిణ ధ్రువం సమీపంలో అడుగుపెట్టిన చంద్రయాన్-3 ప్రజ్ఞాన్ రోవర్ తన పరిశోధనల్లో నిమగ్నమైంది. ఈ క్రమంలోనే అది ప్రయాణిస్తున్న మార్గంలో లోతైన గొయ్యి కన్పించింది. దీంతో వెంటనే అప్రమత్తమైన ఇస్రో శాస్త్రవేత్తలు.. రోవర్ రూటు మార్చారు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ ఇస్రో సోమవారం ఎక్స్ (ట్విటర్ లో అప్డేట్ ఇచ్చింది. ఆగస్టు 27న రోవర్ ఉన్న ప్రాంతానికి మూడు మీటర్ల దూరంలో గొయ్యి కన్పించింది. నాలుగు మీటర్ల వ్యాసంతో భారీ గొయ్యి ఉంది. దీంతో తన మార్గాన్ని మార్చుకోవాలని రోవర్‌కు కమాండ్ ఇచ్చాం. ప్రస్తుతం రోవర్ తన కొత్త మార్గంలో సురక్షితంగా ప్రయాణిస్తోంది అని ఇస్రో రాసుకొచ్చింది. ఆ గొయ్యి ఫొటోను కూడా షేర్ చేసింది.

రోవర్ లోని నావిగేషన్ కెమెరా ద్వారా ఈ గొయ్యిని గుర్తించినట్లు ఇస్రో వెల్లడించింది. ఈ సందర్భంగా కొత్త మార్గంలో రోవర్ ప్రయాణించిన గుర్తులను కూడా పంచుకుంది. ఈ మిషన్‌కు సంబంధించిన మొదటి శాస్త్రీయ పరిశోధన వివరాలను ఇస్రో ఆదివారం ప్రకటించిన విషయం తెలిసిందే. విక్రమ్ ల్యాండర్ లోని 'చంద్రాస్ సర్ఫేస్ థర్మో ఫిజికల్ ఎక్స్పెరిమెంట్ (చాస్టే) పరికరం.. చందమామ ఉపరితలంపైన, కాస్త లోతులో సేకరించిన ఉష్ణోగ్రతల గణాంకాలను గ్రాఫ్ రూపంలో వెల్లడించింది. తాజాగా చంద్రుని ఉపరితలంపై 50.5 డిగ్రీల సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రతలుంటే, 80 మి.మీల లోతులో మైనస్ 10 డిగ్రీల సెల్సియస్ ఉన్నట్లు చాస్టే గుర్తించినట్లు ఇస్రో తెలిపింది.

# కాశ్మీర్ లోయలో.. అందాల భామల సందడి



శ్రీనగర్: భూతల స్వర్గంగా పేరొందిన జమ్ము కాశ్మీర్‌లో అందాల తారలు సందడి చేస్తున్నారు. ఒక్క రోజు పర్యటన కోసం 2021 మిస్ వరల్డ్ కరోలినా బీలాస్కా సోమవారం కాశ్మీర్‌కు వచ్చారు. పోలెండ్ దేశానికి చెందిన ఈ అందాల సుందరితోపాటు.. పలువురు అందగత్తెలు కూడా ఆమె వెంట ఉన్నారు. వారందరితో కలిసి మిస్ ఇండియా వరల్డ్ (2022) సినీశెట్టి ఓ ఐదు నక్షత్రాల హొటల్లో విందు అరగించారు. అనంతరం వీరిద్దరూ కలిసి జమ్ము కాశ్మీర్ లోనే ఉన్న మిస్ వరల్డ్ అమెరికా శ్రీ సైనీ, మిస్ వరల్డ్ అర్గనైజేషన్ సీఈవో, చైర్‌పర్సన్ జూలియా మోర్లీతో సమావేశం కానున్నారు. ప్రపంచ సుందరి కిరీటాన్ని అందుకున్న తర్వాత కరోలినా జమ్ముకశ్మీరు రావడం ఇదే తొలిసారి. వచ్చే ఏడాదిలో 71వ ఎడిషన్ ప్రపంచ సుందరి పోటీలు భారత్ వేదికగా జరగనున్న నేపథ్యంలో కరోలినా పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. భారత్‌లో చివరిగా 1996లో మిస్ వరల్డ్ పోటీలు జరిగాయి. ఆ తర్వాత మళ్లీ ఇన్నేళ్లకు మన దేశంలో ప్రపంచ సుందరి పోటీలు జరగనుండటం విశేషం. దాదాపు నెల రోజుల పాటు సాగే ఈ ప్రపంచ సుందరి పోటీల ఈవెంట్‌లో 130కి పైగా దేశాల నుంచి పోటీదారులు పాల్గొని తమ అందాలతో పాటు ప్రతిభను ప్రదర్శించేందుకు పోటీ పడతారు. గతంలో ఈ ప్రతిష్టాత్మక టైటిల్‌ను భారత్ అరు సార్లు గెలుచుకుంది. మన దేశం నుంచి రీటా ఫరియా (1966), ఐశ్వర్యా రాయ్ (1994), దయానా హైడెన్ (1997), యుక్తాముఖి (1999), ప్రియాంకా చోప్రా (2000), మానుషి చిల్లర్ (2017) మిస్ వరల్డ్ కిరీటాలను దక్కించుకున్న విషయం తెలిసిందే.

## కోడి రెట్టతో కరెంటు తయారు చేసిన వ్యక్తి..!

### - తన ఇంటితో పాటు గ్రామంలో వెలుగులు..



భారతదేశంలోని కొన్ని ప్రాంతాలకు ఇప్పటికీ సరైన విద్యుత్ కనెక్షన్ లేదు. మారుమూల గ్రామాలు లేక ఇతర కారణాలతో కొన్ని ప్రాంతాలకు ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. అందుకే అలాంటి గ్రామాలు నేటికి అంధకారంలో జీవించాల్సిన పరిస్థితి. ఇందులో హర్యానాకు చెందిన జజ్జర్ కుటుంబం కూడా ఒకటి. హర్యానాకు చెందిన జజ్జర్ కుటుంబం విద్యుత్ కనెక్షన్ లేకపోవటంతో చీకట్లోనే ఉంటున్నారు. దీంతో విసిగిపోయిన కుటుంబ సభ్యులు ఓ కీలక నిర్ణయానికి వచ్చారు. సొంతంగా కరెంటు తయారు చేసుకోవాలని పథకం వేసి అందులో విజయం సాధించారు.. వారు విద్యుత్తును ఉత్పత్తి చేసి వినియోగించడమే కాకుండా మరికొందరు విద్యుత్ విక్రయిస్తున్నారు కూడా. ఇందుకోసం వారు కోడి రెట్టతో కరెంటును తయారు చేశారు.

జజ్జర్ కుటుంబం ఇప్పుడు కోడి రెట్టతో కరెంట్ తయారు చేసింది. కోడి రెట్టతో విద్యుత్ ఉత్పత్తి చేయడంతో పాటు ఆ ప్రాంతమంతా పరిశుభ్రతకు ప్రధాన్యమిస్తున్నారు. కోడి పెంట దుర్వాసన నుంచి కూడా ఉపశమనం కలిగించారు. ఇళ్లు, ఇంటి పనులన్నింటికీ ఈ కరెంటును ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం ఈ కుటుంబం కోడి రెట్ట నుంచి దాదాపు 50 కిలోవాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తోంది. పౌల్ట్రీ ఫారంలోనే విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన పరికరాలు అమర్చి 24 గంటల పాటు ఇక్కడ విద్యుత్ ఉత్పత్తి నిర్వహిస్తున్నారు.

ఝజ్జర్‌లోని సిలానీ కేషో గ్రామానికి చెందిన రామెహర్ విద్యుత్ కనెక్షన్ కోసం చాలాసార్లు విద్యుత్ కార్పొరేషన్‌ను సందర్శించాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది.. దీంతో విసుగెత్తిపోయిన రామెహర్ తన ఇంట్లోనే విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్ణయించుకున్నాడు. వ్యవసాయ శాఖ సాయం పొందిన రైతు రామెహర్ తన ఇంట్లో 20 వేల కోళ్లను పెంచుతున్నాడు.. రామెహర్ మొదట్లో కోడి రెట్టలతో గ్యాస్ తయారు చేసేవాడు. ఆ గ్యాస్‌నే తన ఇంటి అవసరాలకు వాడుకున్నాడు. దాంతోనే అతడికి మరో ఆలోచన వచ్చింది. కోడి రెట్టతో విద్యుత్ తయారు చేయడం ప్రారంభించాడు. ఇప్పుడు రామెహర్ ఇల్లు పర్యాటక కేంద్రంలా మారింది. దేశం నలుమూలల నుంచి సందర్శకులు ఇక్కడికి వస్తుంటారు.

రామ్‌హర్ గతంలో భారత సైన్యంలో పనిచేశాడు. సుబేదార్ పదవి నుంచి పదవీ విరమణ చేసిన తర్వాత రామెహర్ పౌల్ట్రీ ఫారాన్ని ప్రారంభించాడు. ఆ తర్వాత కోడి రెట్టల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను ఏర్పాటు చేశాడు. గతంలో 85, 85 క్యూబిక్ మీటర్ల రెండు ట్యాంకులు తయారు చేసి దాని నుంచి గ్యాస్ సిద్ధం చేశారు. అప్పుడు అతను 50% గ్యాస్, 50% డీజిల్‌తో జనరేటర్‌ను నడపడం ప్రారంభించాడు. 30 కిలోవాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశాడు. రామ్‌హెర్ 2011లో 160 క్యూబిక్ మీటర్ల డైజెస్టర్ ట్యాంక్‌ను నిర్మించారు. ఇద్ర సాయంతో 50 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. ఇప్పుడు 240 క్యూబిక్ మీటర్ల ట్యాంక్ తయారు చేశారు. రామ్‌హెర్‌కు ఇప్పుడు విద్యుత్ శాఖ నుండి విద్యుత్ అవసరం లేదు. ఇంట్లో తయారవుతున్న విద్యుత్‌ను వినియోగిస్తున్నారు.

# నేను గెలిస్తే.. కీలక స్థానంలో మస్క్: వివేక్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష రేసులో ఉన్న వివేక్ రామస్వామి టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు అయోవాలోని ఒక టౌన్ హాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడిగా గెలుపొందిన అనంతరం మీ సలహాదారుడిగా ఎవరిని నియమిస్తారు అని అడిగిన ప్రశ్నకు వివేక్ ఆసక్తికర సమాధానం ఇచ్చారు. తన పరిపాలనలో టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌ను సలహాదారుడిగా నియమిస్తానని అన్నారు. అందుకు గల కారణాన్ని కూడా ఆయన వివరించారు. అమెరికాకు నేను ఏమి చేయాలనుకుంటున్నాను అనే దానికి ట్విట్టర్ మంచి ఉదాహరణ. గతేడాది ట్విటర్‌ను మస్క్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి దాన్ని సమర్థవంతంగా నడిపిస్తున్నారు. అందువల్ల నేను గెలిస్తే.. ఆయననే ప్రభుత్వ సలహాదారుడిగా నియమిస్తా. ట్విట్టర్ మాదిరిగానే ప్రభుత్వాన్ని కూడా ఆయన సమర్థవంతంగా నడిపించగలరు అంటూ వ్యాఖ్యానించారు. ఇటీవల మస్క్ చైనా పర్యటనను వివేక్ తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. అయితే, అందుకు భిన్నంగా వివేక్ నమ్మకమైన అభ్యర్థి అంటూ మస్క్ కొనియాడారు. ఇదిలా ఉండగా.. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్న వారిలో రామస్వామి పేరు మారుమోగుతోంది. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో రోజురోజుకూ ఆయన ప్రాచుర్యం పెరుగుతోంది.

# మిత్రులు సహకరిస్తే యుద్ధ సమయంలోనే ఉక్రెయిన్లో ఎన్నికలు: జెలెన్‌స్కీ



ఇంటర్నెట్‌డెస్క్: ఉక్రెయిన్‌లో ఎన్నికల నిర్వహణ పై ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ స్పందించారు. పశ్చిమ దేశాల మిత్రులు సహకరిస్తే యుద్ధ సమయంలో కూడా ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఇటీవల అమెరికా రిపబ్లికన్ పార్టీ నాయకుడు లిండ్సె గ్రాహం విలేకర్లతో మాట్లాడుతూ "జెలెన్స్కీ.. మీకు ఎన్ని ఆయుధాలు కావాలంటే అన్ని పంపిస్తాం. మీ పోరాటం కొనసాగించండి. మీ ఓటమిని మేము తట్టుకోలేం. కానీ, మీకో విషయం చెప్పాలనుకుంటున్నాను. ఉక్రెయిన్లో వచ్చే ఏడాది ఎన్నికలు జరగడం మాకు అవసరం. యుద్ధ సమయంలో మీ దేశ ప్రజలు స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికల్లో పాల్గొనడాన్ని మేము చూడాలనుకొంటున్నాం" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై ఓ మీడియా ప్రతినిధి జెలెన్ స్కీ ప్రశ్నించగా.. మిత్ర దేశాలు ఖర్చును పంచుకొని, చట్ట సభ్యులు ఆమోదిస్తే యుద్ధ సమయంలో ప్రతి ఒక్కరు ఎన్నికల్లో పాల్గొంటారని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉక్రెయిన్లో మార్షల్ లా అమల్లో ఉండటంతో ఎన్నికలు నిర్వహణ సాధ్యం కావడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం అక్టోబర్లో ఎన్నికలు నిర్వహించాలి. కానీ, మార్షల్ చట్టం నవంబర్ 15 వరకు అమల్లో ఉండటంతో.. ఈ ఎన్నికలు వచ్చే ఏడాది మార్చి వరకు వాయిదా పడ్డాయి.

తాజాగా జెలెన్స్కీ దానిపై మాట్లాడుతూ.. "మా చట్ట సభ సభ్యులంతా అంగీకరించినంత కాలం నాకు సంతోషమే. శాంతి సమయంలో ఎన్నికల నిర్వహణకు 135 మిలియన్ డాలర్లు ఖర్చుచేశాం. ఇప్పుడు ఎంతవుతుందో నాకు తెలియదు. అందుకే.. అమెరికా, ఐరోపా సమాఖ్య దేశాలు ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నాను. నేను ఆయుధాల సొమ్మును తీసి ఎన్నికలకు ఖర్చుపెట్టలేను. ఈ విషయం చట్టం నిర్దేశించింది. అంతేకాదు.. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు.. ఎన్నికల పరిశీలకులను సరిహద్దుల్లోని గోతుల్లోకి పంపించి పరిశీలించే ఏర్పాట్లు చేద్దామని లిండ్సేకు చెప్పాను. పరిస్థితి ఇది.. నేను ఎన్నికలకు సిద్ధమే" అని జెలెన్ స్కీ స్పష్టం చేశారు. యుద్ధాన్ని రష్యా భూభాగంలోకి తీసుకెళితే ఎవరూ సాయం చేయరు..! తాము యుద్ధాన్ని రష్యా భూభాగంలోకి తీసుకెళితే ఎవరూ సాయం చేయరని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ వెల్లడించారు. యుద్ధాన్ని రష్యా భూభాగంలోకి తీసుకెళ్లడంపై ఓ విలేకరి ప్రశ్నించగా.. "అది చాలా రిస్క్.. మేం ఒంటరిగా మిగిలిపోతాం" అని వ్యాఖ్యానించారు.

### ఇజ్రాయేల్ మంత్రితో మాట్లాడారని

# లిబియా మంత్రిపై వేటు



ట్రిపోలీ: తాము గుర్తించని దేశానికి చెందిన ప్రతినిధితో మామూలుగా మాట్లాడినందుకే.. అరబ్ దేశానికి చెందిన ఓ మహిళా మంత్రి పదవిని కోల్పోయింది. అంతే కాదు.. దేశ వ్యాప్తంగా అల్లర్లు కూడా చెలరేగాయి. ఈ ఘటన లిబియాలో చోటు చేసుకొంది. గత వారం లిబియా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి నజ్లా అల్ మంగోష్.. ఇజ్రాయేల్ మంత్రి ఎలి కొహెన్‌ను రోమ్లో అనధికారికంగా కలిశారు. ఆమె రోమ్ పర్యటనలో ఈ ఘటన జరిగింది. ప్రస్తుతానికి చాలా అరబ్ దేశాల మాదిరిగా లిబియా కూడా ఇజ్రాయేల్‌ను గుర్తించలేదు. ఈ మీటింగ్ అనంతరం ఇజ్రాయేల్ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇరుపక్షాల సహకారం, మానవీయ అంశాల్లో ఇజ్రాయేల్ సాయం, వ్యవసాయం, నీటి నిర్వహణ వంటి అంశాలపై చర్చలు జరిగాయని వెల్లడించింది. దీంతోపాటు లిబియాలో యూదులకు సంబంధించిన సాంస్కృతిక వారసత్వ సంపదను కాపాడే అంశాన్ని కూడా నజ్లా వద్ద బలంగా లేవనెత్తినట్లు ఇజ్రాయేల్ మంత్రి వెల్లడించారు. ఈ సమావేశం ఇటలీ విదేశాంగ మంత్రి సమక్షంలో జరిగింది. ఇజ్రాయేల్ ప్రకటనతో లిబియా రాజధాని ట్రిపోలీ సహా పలు నగరాల్లో అందోళనలు చెలరేగాయి. రోడ్ల మూసివేత, టైర్ల దహనం ఘటనలు చోటు చేసుకొన్నాయి. దీంతో పరిస్థితి అంచనావేసిన లిబియా నేషనల్ యూనిటీ ప్రభుత్వ ప్రధాని అబ్దుల్ హమీద్ వెంటనే తన మంత్రి నజ్లాను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. మరో మంత్రిని ఆ శాఖకు అధిపతిగా నియమించారు. నజ్లాపై దర్యాప్తు ప్రారంభించామని వెల్లడించారు. ఈ ఘటన అనంతరం విదేశీ వ్యవహారాలశాఖ కూడా వివరణ ఇచ్చుకొంది. నజ్లా ఇజ్రాయేల్ మంత్రి లేదా ప్రతినిధులతో అధికారికంగా భేటీ కాలేదని పేర్కొంది. నేషనల్ యూనిటీ ప్రభుత్వ విధానాలకు అనుగుణంగానే పనిచేసినట్లు వెల్లడించింది. రోమ్‌లో జరిగింది ఓ అనధికారిక మీటింగ్ మాత్రమే. దానికి ఎటువంటి ముందస్తు ప్లానింగ్ లేదు. కేవలం అనుకోని సాధారణ మీటింగ్ అని నజ్లో కూడా వెల్లడించినట్లు విదేశీ వ్యవహారాలశాఖ పేర్కొంది. తాము ఎటువంటి ఒప్పందాల్లో భాగస్వాములం కాలేదని వెల్లడించింది. పార్లమెంట్ స్పీకర్ కార్యాలయం ఈ ఘటనపై స్పందించింది. విదేశీ వ్యవహారాల మంత్రి పెద్ద ద్రోహానికి పాల్పడ్డారని ఆరోపించింది. సోమవారం అత్యవసర సమావేశానికి పిలుపునిచ్చింది. ఇటీవల కాలంలో ఇజ్రాయేల్ తన ద్వైపాక్షిక సంబంధాలను యూఏఈ, బహ్రెయిన్, మొరాకో, సుడాన్ దేశాలతో సాధారణ స్థితికి తీసుకొచ్చింది. గడాఫీ పాలన సమయంలో పాలస్తీనాకు లిబియా నుంచి భారీ మద్దతు లభించింది. ఆ సమయంలో లిబియాలోని యూదులు ఇతర ప్రాంతాలకు వలస పోవాల్సి వచ్చింది.




## ట్రంప్‌పై కాసుల వర్షం..
## 2 రోజుల్లో రూ.58 కోట్ల విరాళాలు

న్యూయార్క్: అమెరికా అధ్యక్ష ఎన్నికల(2020) ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారన్న అభియోగాలపై గత గురువారం జార్జియాలో అరెస్టయి, 20 నిమిషాల పాటు జైలుకెళ్లిన మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. తాజా పరిణామాలతో గత రెండు రోజుల్లోనే తమకు 71 లక్షల డాలర్ల (సుమారు రూ.58 కోట్లు) విరాళాలు అందినట్లు ట్రంప్ ఎన్నికల ప్రచార బృందం వెల్లడించింది. అరెస్టయ్యాక నిందితులను పోలీసులు తీసే ఫొటోను మగ్ షాట్‌గా పిలుస్తారు. ట్రంప్ కూడా గురువారం అలాంటి ఫొటో దిగాల్సి వచ్చింది. ఈ మగ్ షాట్ ఫొటో ఆయనకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఆయన మగ్ షాట్‌తో కూడిన టీషర్టు, బీర్ కూజీలు, బంపర్ స్టిక్కర్లు, పోస్టర్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి.



## తైవాన్ అధ్యక్ష రేసులో ఫాక్స్‌కాన్ వ్యవస్థాపకుడు

తైపీ: తైవాన్‌లో వచ్చే ఏడాది అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ప్రముఖ బిలియనీర్, ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఫాక్స్‌కాన్ వ్యవస్థాపకుడు టెర్రీ గౌ అధ్యక్ష పదవి కోసం బరిలోకి దిగుతున్నారు. ఈ ఎన్నికల్లో తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రస్తుత అధికార డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీపై విమర్శలు గుప్పించారు. "అధికార పార్టీ విధానాలు తైవాను చైనాతో యుద్ధం ముప్పులోకి నెట్టేశాయి" అని దుయ్యబట్టారు. కాగా.. కొన్నేళ్లుగా అధ్యక్ష పదవి కోసం కలలు కంటున్న టెర్రీ గౌ .. 2019 ఫాక్స్కాన్ చీఫ్ బాధ్యతల నుంచి దిగిపోయారు. అదే ఏడాది జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రతిపక్ష కుమోమింగ్టాంగ్ పార్టీలో చేరారు. అయితే, ఆ పార్టీ తరఫున అభ్యర్థిగా నామినేట్ కాకపోవడంతో అప్పుడు తన ప్రయత్నాలను విరమించుకున్నారు. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ అభ్యర్థి అయిన త్సాయి ఇంగ్ వెన్ అధ్యక్షురాలిగా విజయం సాధించారు. తాజాగా మరోసారి కుమోమింగ్టాంగ్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా పోటీ చేసేందుకు ముందుకొచ్చారు. అయితే ఈ సారి కూడా టెర్రీ గౌను కాకుండా న్యూ తైపీ సిటీ మేయర్ హు యు ఇయ్ను ఎంపిక చేస్తూ ఈ ఏడాది మే నెలలో కుమోమింగ్టాంగ్ ప్రకటన చేసింది. దీంతో పార్టీ నుంచి బయటకు వచ్చిన టెర్రీ గత మూడు నెలలుగా ప్రజల మద్దతు కూడగట్టుకునేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలోనే అధ్యక్ష ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు నేడు ప్రకటించారు. ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ యాపిల్‌కు ఫాక్స్‌కాన్ ప్రధాన ముడిసరుకు సరఫరాదారుగా ఉంది. చైనాలో ఈ కంపెనీకి అనేక ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఇక తైవాన్ ను చైనా తమ భూభాగంగానే పేర్కొంటున్న విషయం తెలిసిందే. ఇక్కడి ప్రధాన ప్రతిపక్షమైన కుమోమింగ్టాంగ్ పార్టీకి చైనాతో మంచి అనుబంధం ఉంది. మరోవైపు, శాశ్వత స్వతంత్ర దేశంగా ప్రకటించుకునేందుకు ప్రయత్నిస్తున్న తైవాన్.. 2024 జనవరిలో అధ్యక్ష ఎన్నికలకు సిద్ధమవుతోంది.

### అణు జలాల విడుదలపై

## చైనా నుంచి బెదిరింపులు

టోక్యో: జపాన్ అణు జలాలను పసిఫిక్ మహా సముద్రంలోకి విడుదల చేయడం మొదలు పెట్టింది. ఈ నేపథ్యంలో తమకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయంటూ జపాన్ చీఫ్ కేబినెట్ సెక్రటరీ హిరోకాజు మట్సునో తెలిపారు. ఈ ఫోన్ కాల్స్ కచ్చితంగా చైనా నుంచే వస్తున్నాయని ఆరోపించారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. 2011లో ఫుకుషిమా అణు కేంద్రం సునామీ కారణంగా దెబ్బతిన్న నాటి నుంచి అందులోని అణుధార్మిక జలాలను భారీ ట్యాంకుల్లో నిల్వ చేశారు. కానీ, ఇప్పుడు నిల్వకు చోటు సరిపోని పరిస్థితికి చేరుకొంది. ఇక్కడ మొత్తం 1.34మిలియన్ టన్నుల అణుజలాలు ఉన్నాయి. వీటిల్లో ముందుగా 200 నుంచి 210 క్యూబిక్ మీటర్ల నీటిని శుద్ధి చేసి పసిఫిక్ సముద్రంలోకి వదిలేసింది. ఏదైనా అసాధారణ ఫలితాలు కనిపిస్తే తక్షణమే నీటి విడుదలను నిలిపివేసి దర్యాప్తు చేపడతామని ఇటీవల టోక్యో ఎలక్ట్రిక్ పవర్ కంపెనీ(టెప్కో) వెల్లడించింది. వీటిని వివిధ దశల్లో శుద్ధి చేసి రానున్న కొన్నేళ్లపాటు సముద్రంలోకి విడుదల చేయనున్న విషయం తెలిసిందే. అణుజలాల విడుదలపై చైనా, దక్షిణ కొరియా తదితర దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రస్తుతం చైనా నుంచి తమకు బెదిరింపు ఫోన్లు వస్తున్నాయని హిరోకాజు మట్సునో వెల్లడించారు. చైనా బెదిరింపులకు పాల్పడడం ఎంతో విచారకరమని అన్నారు. ఆయన చేసిన ఆరోపణలపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించలేదు.




జోహార్ హరికృష్ణ
తెలుగు యువసేన
చైతన్య రథసారథి
పంచమ వర్ధంతి